మే
2014

97

సంపుటి : 9 సంచిక : 1
వెల రు. 10/-

ఈ సంచికలో........


సిపిఐ(ఎం) కార్యక్రమం రూపుదిద్దుకున్న తీరు
పాలక వర్గాల చేత, పాలక వర్గాల కోసం
ఎన్నికల తరువాత....?
ఉక్రెయిన్ పరిణామాలు : ఫాసిస్టు ప్రమాద సూచికలు
వలసకార్మికులు: మారుతున్న ప్రభావాలు
రెండు విభిన్న సంస్కృతులు
మహారచయిత, పాత్రికేయుడు, విప్లవ భావుకుడు గార్షియా గాబ్రియెల్ మార్క్వెజ్
*మారిన పరిస్థితుల్లో వర్గపోరాట వ్యూహాలను కమ్యూనిస్టు పార్టీలు అభివృద్ధిచేసుకుంటున్నాయి*

నివాళి

# మహా రచయిత, పాత్రికేయుడు, విప్లవ భావుకుడు

# గార్షియా గాబ్రియెల్ మార్క్వెజ్

సోనియా సురభి గుప్త



మన కాలపు మహారచయితల్లో ఒకరైన గాబ్రియెల్ గార్షియా మార్క్వెజ్ కన్నుమూశారు. మెక్సికోలోని ఆస్పత్రినుంచి విడుదలైన తర్వాత పదిరోజులకు 2014 ఏప్రిల్17వ తేదీన ఆయన తుదిశ్వాస విడిచారు. వన్ హండ్రెడ్ ఇయర్స్ ఆఫ్ సాలిట్యూడ్, లవ్ ఇన్ టైమ్స్ ఆఫ్ కలరా, నో వన్ రైట్స్ టు ద కల్నల్, ద ఆటమ్ ఆఫ్ ద పేట్రియార్క్, క్రానికల్ ఆఫ్ ఎ డెత్ ఫోర్‌టోల్డ్ వంటి ప్రామాణిక రచనలు చేసిన అక్షర శిల్పి ఆయన. ఆయన సృష్టించిన మకోండో అజరామరమైనదీ, అద్భుతమైనదీ. లక్షలాది మంది పాఠకుల దృష్టిలో అది లాటిన్ అమెరికాకు పర్యాయపదంగా మారిపోయింది. 1982లో నోబెల్ బహుమతి స్వీకరిస్తూ మార్క్వెజ్ ఇలా చెప్పారు :(లాటిన్ అమెరికా) అపారమైన సృజనశీలతకు మూల బిందువు. శోకం, సౌందర్యాల భరితం. ఈ సంచార కొలంబియన్ వాటికి సంబంధించిన గత జ్ఞాపకాలలో మరో శకలం. అదృష్టవశాత్తూ విడివడిన ఎడంగా వుండిపోయాను. కవులు, భిక్షకులు, సంగీత కారులూ, ప్రవక్తలు, యోధులు, నీచులూ అందరూ ఈ అవధుల్లేని వాస్తవం నుంచి సృష్టించబడిన వారే. మా జీవితాలను నమ్మశక్యంగా చేసిన మా కీలక సమస్యను చెప్పడానికి ఒకింత సృజన శక్తికోసం మేము వెతుక్కోవలసి వచ్చింది.”

ఈ విధంగా ఒక సరికొత్త సాహిత్య వ్యక్తీకరణ శైలికోసం చేసిన అన్వేషణే లాటిన్ అమెరికన్ రచయితల, కవులు ప్రప్రధాన చింతనగా మారింది. మార్క్వెజ్ రచనా శైలి దానికి చిరునామాగా మారింది. దాన్నే మార్మిక వాస్తవికత (మ్యాజికల్ రియలిజం) అన్నారు. లాటిన్ అమెరికా అందులోనే తన స్వరాన్ని చూసుకున్నది. గాబోగా ప్రసిద్ధుడైన మార్క్వెజ్ కేవలం ప్రపంచ ప్రఖ్యాత నవలాకారుడు, రచయిత మాత్రమే కాదు. ఒక విప్లవ కారుడు. ‘ఊహా జనిత స్వర్గం సృష్టించడానికి ఇంకా పెద్ద ఆలస్యమేమీ కాలేదు’ అని దృఢంగా నమ్మిన వాడు. తన రాజకీయ విశ్వాసాల కారణంగా ఆయనను స్వదేశమైన కొలంబియానుంచి అనేకసార్లు బహిష్కరించారు. వియత్నాం దురాక్రమణ నుంచి, చిలీ ఘటనల వరకూ అమెరికా సైనిక జోక్యంపై సునిశితమైన, సుస్పష్టమైన ఆయన విమర్శల కారణంగా అమెరికా వీసా నిరాకరించింది.

మార్క్వెజ్ క్యూబా విప్లవాన్ని అచంచలంగా బలపరిచిన వ్యక్తి. ఫైడెల్ కాస్ట్రోతో ఆయనకు ప్రగాఢ వ్యక్తిగత సాన్నిహిత్యం వుండేది. 2008లో తాను రాసిన జ్ఞాపకాలలో కాస్ట్రో ఈ విషయాలు గ్రంథస్తం చేశాడు. 1959లో విప్లవం విజయం సాధించిన తర్వాత చే గువేరా సలహా మేరకు ప్రెస్నా లాటినా పేరుతో ఒక వార్తా సంస్థ స్థాపించారు. ఆ సమయంలో గేబ్రియల్ గార్షియా మార్క్వెజ్ అనే కొలంబియన్ జర్నలిస్టును ఆ ఏజన్సీ కోసం తీసుకున్నారు. మార్క్వెజ్ కొలంబియాలోని ఒక చిన్న పట్టణంలో టెలిగ్రాఫర్ కుమారుడు. అమెరికా యాంకీ పళ్ల కంపెనీ అరటితోటలలో ఎక్కడో చిక్కుకుపోయిన ఒక కుర్రాడు. అలాటి నేపథ్యం గల ఆ వ్యక్తి తన బ్రహ్మాండమైన వూహాశక్తితో భవిష్యత్తులో నోబెల్ పురస్కారం పొందగలడనీ, అలాటి వాడిని తాము వుద్యోగంలోకి తీసుకుంటున్నామనీ ఎంతమాత్రం తెలియదని కాస్ట్రో రాశాడు.

కొలంబియాలో కరిబియన్ తీరానికి సమీపాన గల చిన్న పట్టణం అర్కాటాలో మార్క్వెజ్ 1927 మార్చి 6న మార్క్వెజ్ జన్మించాడు. లూసియా శాంటిగా మార్క్వెజ్ గేబ్రియల్, ఎలిజో గార్షియాల పదకొండు మంది సంతానంలో మొదటి వాడు గాబే. గేబ్రియల్ టెలిగ్రాఫర్‌గా పనిచేసేవాడు. హోమియపతి వైద్యుడుగా సంచార సేవలందించేవాడు. అతను బాగా చిన్నవాడిగా వున్నప్పుడే తాతగారింట వదలిపెట్టారు. ఆ తాతగారు ఒక వైద్యశాల ప్రారంభించాడు. ఆయన సైన్యంలో పనిచేసి పదవీ విరమణ చేశాడు. వెయ్యి రోజుల పాటు జరిగిన కొలంబియా యుద్ధంలో ఆయన పోరాడాడు కూడా. ఆ సమరంలోనే అది పనామియన్ ఇస్తమస్ అనే భూభాగం కోల్పోయింది కూడా.

నాయనమ్మ చెప్పిన కథలు మార్క్వెజ్‌లో కాల్పనిక కథాశైలి పెరుగుదలకు దోహదం చేశాయి. అందులోని అర్కాటకా, తర్వాత కాలంలో మకండోకు నమూనాగా మారింది. సిరియా నెవడా పర్వత సానువుల దగ్గర అరటి తోటల మధ్య వుండే ఈ గ్రామం హండ్రెడ్ ఇయర్స్ ఆఫ్ సాలిట్యూడ్ నవల కథాక్షేత్రం. ఈ మహానవల 25కు పైగా భాషలలో అయిదు కోట్ల ప్రతులు అమ్ముడయ్యాయి. భారత దేశంలోకూడా మళయాలం, బెంగాలీ, పంజాబీ, హిందీ, కన్నడ భాషల్లో ఆయన రచనలు అనువాదమయ్యాయి.

మార్క్వెజ్ నిరంతరం వామపక్ష భావాలతోనే రచనలు చేస్తూ వచ్చారు. 1928లో అర్కటకా దగ్గర సమ్మె చేస్తున్న యునైటెడ్ ఫ్రూట్ కంపెనీ అరటితోటల కార్మికులపై సాగిన సైనిక నరమేధం నేపథ్యంలో ఆ భావాలు రూపొందాయి. ఆ తర్వాత రెండు దశాబ్దాలకు అధ్యక్ష ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థిగా పోటీ చేసిన జార్జి ఎల్సియర్ గైటాన్ హత్య కూడా ఆయనపై చాలా ప్రభావం చూపించింది. తన తొలి రాజకీయ ఆలోచనలు రూపొందిన ఆ కాలంతో పాటు క్యూబా విప్లవ ప్రకంపనల వరకూ మార్క్వెజ్

(మిగతా 35వ పేజీలో)

# ఈ సంచికలో...


**1. మహారచయిత, పాత్రికేయుడు, విప్లవ భావుకుడు గార్షియా గాబ్రియెల్ మార్క్వెజ్**
– సోనియా సురభి గుప్త 2

**2. సిపిఐ(ఎం) కార్యక్రమం రూపుదిద్దుకున్న తీరు**
– కీ॥శే॥ మాకినేని బసవపున్నయ్య 4

**3. పాలక వర్గాల చేత, పాలక వర్గాల కోసం**
– ఆనంద్ తెల్తుంబ్డే 12

**4. ఎన్నికల తరువాత....?**
– ఎస్. వీరయ్య 14

**5. ఉక్రెయిన్ పరిణామాలు : ఫాసిస్టు ప్రమాద సూచికలు**
– ప్రొ॥ ఐజాజ్ అహ్మద్ 17

**6. వలసకార్మికులు: మారుతున్న ప్రభావాలు**
– అర్చనా ప్రసాద్ 25

**7. రెండు విభిన్న సంస్కృతులు**
– మగ్జీమ్ గోర్కీ 27

**8. *మారిన పరిస్థితుల్లో వర్గపోరాట వ్యూహాలను కమ్యూనిస్టు పార్టీలు అభివృద్ధిచేసుకుంటున్నాయి***
– బి.వి. రాఘవులు 27



**ఎడిటర్:**
ఎస్. వెంకట్రావు

**ఎడిటోరియల్ బోర్డు:**
పాటూరు రామయ్య
బి.వి. రాఘవులు
తమ్మినేని వీరభద్రం
ఎస్. వీరయ్య
తెలకపల్లి రవి



**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరుపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్–20
**ఫోన్: ఎడిటోరియల్ 0866–2573822**
**మేనేజర్: 040–27673787**
EMail:svenkatarao_1958@yahoo.com
Visit cpi(m) site at: cpim.org


# వాగ్దానాలు

16వ లోక్‌సభ ఎన్నికలు, రాష్ట్రంలో (రెండు ప్రాంతాల శాసనసభలకు) ఎన్నికలు ముగింపుకొచ్చాయి. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారం కోసం పోటీ పడుతున్న పార్టీలు ఎన్నికల ప్రణాళికల్లో ప్రజలకు అనేక వాగ్దానాలు చేశాయి. రైతులకు రుణ మాఫీలు ప్రకటించాయి. డ్వాక్రా మహిళలకు రుణాలు మాఫీ చేస్తాం అని కొందరంటే, వడ్డీలేని రుణాలిస్తామని కొన్ని పార్టీలు చెప్పాయి. ఇక రాచితాలకూ, రాయితీలకూ, సంక్షేమ కార్యక్రమాలకూ, పథకాలకూ కొరతే లేదు. ఎడాపెడా హామీలు ఇచ్చి పారేశాయి.

ఎన్నికల హామీలు బాగానే ఉన్నాయి కానీ వీటిని అమలు పరచడానికి డబ్బెక్కడిది అని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఆర్థికవేత్తలు, రాజకీయ విశ్లేషకులే కాదు వాగ్దానాలు చేసిన రాజకీయ పార్టీలు కూడా ఎదుటి పార్టీ హామీలు అమలు పరచడానికి డబ్బెక్కడినుండి వస్తుందని ప్రశ్నిస్తున్నాయి. అంటే ఈ హామీల అమలుపై ఎవరికీ నమ్మకం లేదన్నమాట. ప్రజల చెవుల్లో పూలు పెట్టడానికి ఎక్కడలేని ఎన్నికల వాగ్దానాలు చేస్తున్నామని అవి చెప్పకనే చెబుతున్నాయి.

అయితే ఇక్కడ సమస్య వాగ్దానాల అమలుకు డబ్బెక్కడిది అని కాదు. వాటిని అమలు చేయాలన్న రాజకీయ చిత్తశుద్ధి ఉంటే నిధులు సమకూర్చడానికి అనేక మార్గాలున్నాయి. పేద ప్రజలపై భారాలు వేయకుండా కార్పొరేట్ లాభాలనుండి పన్నుల రూపంలో నిధులు సమకూర్చవచ్చు. నిజానికి కార్పొరేట్ సంస్థలపై అదనంగా పన్నులు వేయాల్సిన అవసరం కూడా లేదు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకిచ్చే రాయితీలను నిలిపేస్తే నిధులు చాలా వరకు సమకూర్చవచ్చు.

కానీ అసలు సమస్య అది కాదు. ఈ పార్టీలు అనుసరించే విధానాలే అవి ప్రకటించే ఎన్నికల వాగ్దానాల అమలుకు ఆటంకంగా ఉన్నాయి. నయా–ఉదారవాద విధానాలు, ప్రభుత్వం అన్ని ప్రజా సంక్షేమ రంగాలనుండి తప్పుకుని వాటిని మార్కెట్‌కు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నాయి. అలాంటప్పుడు ఎన్నికైన ప్రభుత్వాలు నయా–ఉదారవాద విధానాలనైనా వదులుకోవాలి, లేకుంటే ప్రజా సంక్షేమాన్నయినా వదులుకోవాలి. ఎన్నికల ప్రణాళికల్లో ప్రజలకు భారీగా సంక్షేమ పథకాలు ప్రకటించిన ఈ పార్టీలేవీ తాము నయా–ఉదారవాద విధానాలను వదులుకుంటున్నట్లు ప్రకటించలేదు. పైగా కాంగ్రెస్‌గానీ, బిజెపీగానీ గతంలో కంటే ఈ విధానాలు మరింత ఉధృతంగా అమలు చేస్తామని చెబుతున్నాయి. బిజెపీతో జతకట్టిన తెలుగు దేశం పార్టీకానీ తెలంగాణా, సీమాంధ్ర ప్రాంతాల్లో అధికారం కోసం పోటీపడుతున్న తెరాస, వైసీపీలు గానీ సంస్కరణలను మరింత బాగా అమలు చేస్తామంటున్నాయేగాని వాటికి తాము వ్యతిరేకమని చెప్పలేదు.

కాబట్టి ఈ పార్టీల వాగ్దానాలన్నీ శుష్కప్రియాలనేనని అర్థమవుతోంది. అంతేకాదు వాగ్దానాలు అమలు పరచకపోగా ఎన్నికల తరువాత ప్రజలపై మరిన్ని భారాలు వేసి పీడించే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. రానున్నది ఆర్థికంగా సంక్షోభ కాలమని నిపుణులంతా చెబుతున్నారు. ఇప్పటికే అభివృద్ధి సన్నగిల్లింది. సమీప భవిష్యత్తులో కోలుకునే సూచనలు కనిపించడం లేదు. అటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఆదాయాల కోసం కార్పొరేట్ లాభాలమీద పన్నులపైన అయినా ఆధారపడాలి, లేకుంటే సామాన్య ప్రజలపై భారాలైనా వేయాలి. నయా–ఉదారవాద విధానాలు అమలు పరిచే ఏ ప్రభుత్వం కూడా కార్పొరేట్ల జోలికి పోలేదు. పైగా ప్రస్తుత ఎన్నికల్లో బూర్జువా పార్టీలన్నిటికీ పెట్టుబడి పెడుతున్నది కార్పొరేట్ రంగమే. ఎన్నికల తరువాత అవి తమ పెట్టుబడిపై లాభాలను కోరుకునే ఈ పెట్టుబడులు పెట్టాయన్నది జగమెరిగిన సత్యం. కాబట్టి ఎన్నికల తరువాత ప్రభుత్వాలు ప్రజలపై భారాలు వేయడం ద్వారా వారి మూల్గులు పిండడానికి సిద్ధమవుతాయి. ఎదిరించే వారిపై నిర్బంధానికి కూడా సిద్ధమవుతాయి.

వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు ఎన్నికల పోరాటాలకే కాదు, ఎన్నికల అనంతర ప్రజా పోరాటాలకు కూడా సిద్ధం కావాలి.


**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**


పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**

**మేనేజర్,**
**మార్క్సిస్టు**
**(సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.హెచ్ భవన్ (ప్రజాశక్తి కార్యాలయం),**
**అజామాబాద్, హైదరాబాద్- 20**

ఈ మాసం ముఖ్యాంశం

# సిపిఐ(ఎం) కార్యక్రమం రూపుదిద్దుకున్న తీరు



**- కీ॥శే॥ మాకినేని బసవపున్నయ్య**

## పార్టీ ఏడవ మహాసభలో ముసాయిదా కార్యక్రమాన్ని ప్రవేశపెడుతూ చేసిన ప్రసంగం

**గత ఏడాది డిసెంబర్ 14 నుండి కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్య శతజయంతి దేశవ్యాపితంగా జరుగుతోంది. కమ్యూనిస్టు పార్టీ కీలక నేతల్లో కామ్రేడ్ బసవపున్నయ్య ఒకరు. ఆంధ్ర ప్రదేశ్‌లో కమ్యూనిస్టు ఉద్యమాభివృద్ధిలో ఆయన ప్రముఖ పాత్ర నిర్వహించారు. వీరతెలంగాణా సాయుధ రైతాంగ పోరాట నాయకుల్లో ఆయన ఒకరు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) వ్యవస్థాపనలో ఆయన ముఖ్య భూమిక నిర్వహించారు. సిపిఐ(ఎం) సైద్ధాంతిక వైఖరిని నిర్ణయించడంలో ఆయన కీలకమైన పాత్ర పోషించారు. 1964లో పార్టీ 7వ మహాసభలో పార్టీ కార్యక్రమాన్ని ప్రవేశపెడుతూ కామ్రేడ్ బసవపున్నయ్య చేసిన ప్రసంగపాఠాన్ని ఆయన శతజయంతిని పురస్కరించుకుని ప్రచురిస్తున్నాం. ఈ వ్యాసం ఇంతకు ముందు ఎన్నడూ ప్రచురించబడలేదు. ఈ వ్యాసం కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్య రాజకీయ-సైద్ధాంతిక సామర్థ్యాన్ని మనకు విడమరుస్తుంది.**

పార్టీ ముసాయిదా కార్యక్రమాన్ని మహాసభలో చర్చకుపెట్టే బాధ్యతను పార్టీ సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ నామీద పెట్టింది. నేను ఆ అంశాన్ని ప్రస్తావించడానికి ముందుగా ఈ నివేదికకు సంబంధించిన కొన్ని ప్రాథమిక పరిశీలనలను మీ ముందు ఉంచేందుకు ప్రయత్నిస్తాను. ఈ ముసాయిదా కార్యక్రమాన్ని ఆరు నెలల క్రితమే మీకు అందించాం. దేశ వ్యాప్తంగా దీనిమీద పార్టీలో తీవ్రమైన అంతర్గత చర్చ నడిచింది. ఆ చర్చలో వచ్చిన వివిధ సూత్రీకరణలు, సవరణలను ఒక నివేదికగా కూర్చి ఈ ముసాయిదాతోపాటు అందించడంతో మేం విఫలం అయ్యాం. అలాంటి నివేదికను అందించలేకపోవడం మూలంగా అన్ని జిల్లా, రాష్ట్ర మహాసభల్లో ముసాయిదా డాక్యుమెంట్ గురించి వివరించడం మినహా వేరే గత్యంతరం లేకపోయింది. పార్టీ సమిష్టి అవగాహనను సభ్యులందరికీ అందించడానికి ఇదొకమార్గం అని సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ భావించింది. సహజంగానే ఇందులో ఉండే లోటుపాట్లు కూడా ఈ కార్యక్రమంలో చోటు చేసుకుని ఉండవచ్చు. పార్టీ ముసాయిదా కార్యక్రమానికి సంబంధించిన ఉమ్మడి అవగాహనను బాధ్యులందరూ ఏకరీతిలో వివరించి ఉండలేకపోవచ్చు. అంతమాత్రాన ఘోరమైన తప్పులు జరిగిపోయాయనీ, పూర్తిగా లోపభూయిష్టంగా సాగిందనీ చెప్పడం నా ఉద్దేశంకాదు. నేనిక్కడ చెప్పదలుచుకున్న విషయం ఏమిటంటే సెంటర్ నుండి వివరణాత్మక నివేదిక రాతపూర్వకంగా ఇచ్చి ఉండాల్సిన అవసరాన్ని, ఆవశ్యకతను గురించి నొక్కి చెప్పడమే నా ఉద్దేశం. పార్టీని రాజకీయంగా, సైద్ధాంతికంగా పార్టీ కార్యక్రమంలో ఏకాభిప్రాయానికి తీసుకురాగలిగిన మార్గం అదొక్కటే. ఈ దిశగా చెయ్యాల్సిన కృషిలో భాగంగానే నేనిప్పుడు ఈ వివరణాత్మక నోట్‌ను మీ ముందు ఉంచుతున్నాను.

ఇప్పటికీ దీన్ని రూపొందించడంలో కొన్ని పొరబాట్లు, లోటుపాట్లు దొర్లి ఉంటాయని నేను భావిస్తున్నాను. ఎందుకంటే ఇప్పటిదాకా జిల్లా, రాష్ట్ర పార్టీ మహాసభల నుండి కేంద్రానికి ఎలాంటి రాతపూర్వక అభిప్రాయాలుగానీ, సవరణలు గానీ అందలేదు. అవి వచ్చివుంటే వీటిని అధ్యయనం చేసి మరింత నిర్దిష్టంగా వివరించేందుకు అవకాశం ఉండేది. ఇక రెండవ కారణం ఏమిటంటే ఇతరత్రా రాజకీయ - నిర్మాణ పనుల ఒత్తిడి రీత్యా సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ కూడా నేను రూపొందించిన ఈ వివరణాత్మక నోట్ మీద చర్చించి తుది

రూపం ఇవ్వలేకపోయింది. వీటికి తోడు గతంలో నేనూ, రామ్మూర్తి, సూర్జిత్‌లం కలిసి 'వాట్ డాంగే ప్రోగ్రాం రివీల్స్' (డాంగే కార్యక్రమం ఏం బయటపెడుతుంది) అన్న డాక్యుమెంట్‌నుగానీ, 'అవర్ వ్యూ ఇన్ ఇ.యం.యస్ క్రిటిక్ ఆఫ్ డ్రాఫ్ట్ ప్రోగ్రాం' (ముసాయిదా కార్యక్రమం మీద ఇ.యం.యస్ విమర్శ – మా అభిప్రాయాలు) పేరిట నేను రూపొందించిన డాక్యుమెంటునుగానీ ఈ నోట్‌లో జతపరచలేదు. ఈ రెండు కరపత్రాలూ మేం ఏయే అంశాల మీద విభేదించాం, భిన్నాభిప్రాయాలతో ఉన్నాం, అన్న విషయాలనే గాక ముసాయిదా కార్యక్రమంలో పొందుపరిచిన అనేక అంశాల మీద మా సానుకూల అభిప్రాయాలను తెలియచెబుతాయి. సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ ఏకాభిప్రాయాన్ని ఆ రెండు డాక్యుమెంట్లూ ప్రతిఫలిస్తాయి. అందుకే వీటిని కూడా పార్టీ మహాసభ డాక్యుమెంట్లుగా మీకు అందచేస్తాం. అందుకే నేను ఇప్పుడు మీ ముందు ఉంచుతున్న వివరణాత్మక నోట్‌లో వాటి పునఃప్రస్థావన ఉండదు. ఇతర విషయాలను తడిమేందుకు ప్రయత్నిస్తా. అందుచేత ఈ నోట్ కూడా సప్లిమెంటరీ రూపంలో ఉంటుందే తప్ప సమగ్రమైంది కాదు. ఇంతకు ముందు చెప్పిన డాక్యుమెంట్‌తో కలిపి అధ్యయనం చేస్తేనే సమగ్రత వస్తుంది. కాబట్టి ప్రతినిధి కామ్రేడ్‌లందరూ మహాసభ ముందుంచబోతున్న ఈ రిపోర్టు పరిమితులు, ఇబ్బందులు అన్నీ అర్థం చేసుకుని నివేదికను అవగతం చేసుకుంటారని ఆశిస్తున్నా.

పార్టీ కార్యక్రమం గురించి వివరించేందుకు కామ్రేడ్ ఇ.యం.యస్ చేసిన సూచనలు, ఉంచిన ప్రతిపాదనల విషయమై రెండు ముక్కలు చెప్పాలి. పార్టీ కార్యక్రమాన్ని ఆమోదించేందుకు ఇంకొంత సమయం తీసుకుందామనీ, ప్రస్తుతానికి దీన్ని వాయిదా వేసి జాతీయ, అంతర్జాతీయ అంశాలపై ఉన్న విభేదాల గురించి మరింత లోతుగా చర్చించటం ద్వారా సాపేక్షంగా ఇంతకన్నా మెరుగైన ముసాయిదాను తీసుకురావచ్చనేది కామ్రేడ్ ఇ.యం.యస్ ప్రతిపాదన.

కాని తెనాలి కన్వెన్షన్‌లోగానీ, ఇతర జిల్లా, రాష్ట్ర పార్టీ మహాసభల్లోగానీ వచ్చిన ఏకాభిప్రాయం రీత్యా చూస్తే ఈ ప్రతిపాదన అనంగీకారమైనదని చెప్పకతప్పదు. పార్టీగా మనం ఒక కార్యక్రమాన్ని ఆమోదించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పుడు మహాసభ ముందు ఉంచబోతున్న ముసాయిదా కార్యక్రమం సంపూర్ణంగా, సమగ్రంగా లేదనేదో, మరింత శ్రమ కోర్చి అధ్యయనం – చర్చ చేసి ఉమ్మడి అనుభవాలు, అవగాహన ఆధారంగా ఇంతకన్నా

**" పార్టీ కార్యక్రమాన్ని ఆమోదించేందుకు ఇంకొంత సమయం తీసుకుందామనీ, ప్రస్తుతానికి దీన్ని వాయిదా వేసి జాతీయ, అంతర్జాతీయ అంశాలపై ఉన్న విభేదాల గురించి మరింత లోతుగా చర్చించటం ద్వారా సాపేక్షంగా ఇంతకన్నా మెరుగైన ముసాయిదాను తీసుకురావచ్చనేది కామ్రేడ్ ఇ.యం.యస్ ప్రతిపాదన. "**



ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్

సాపేక్షంగా మెరుగైన ముసాయిదా తయారు చెయ్యలేమా అనేది ఇక్కడ సమస్యకాదు. ఇవాళ ఉన్న పరిస్థితులలో, భారత కమ్యూనిస్టులు ఎదుర్కొంటున్న తీవ్రమైన క్లిష్ట పరిస్థితుల్లో పార్టీకి తక్షణం ఒక కార్యక్రమం ఉండాల్సిన ఆవశ్యకత ఉందని మేం భావిస్తున్నాం. ఇంతకన్నా మెరుగైన కార్యక్రమం రూపొందించుకునే పేరిట జరిగే ఆలస్యం వల్ల మెరుగైన కార్యక్రమం నుండి ఒనకూడే ప్రయోజనాల కన్నా, ఆలస్యంకావడం వల్ల జరిగే నష్టాలు ఎక్కువకావచ్చు. ఒక పక్కనుంచి 'రివిజనిస్టులు' తమ కార్యక్రమాన్ని అడ్డం పెట్టుకుని చేస్తున్న దాడి, మరో పక్క నుండి దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం మీద రకరకాలుగా జరుగుతున్న దాడుల నేపథ్యంలో మరింత ఆలస్యానికి సిద్ధపడడమంటే మన సైన్యాన్ని రాజకీయంగా, సైద్ధాంతికంగా నిరాయుధంగా ఉంచడమే. తక్షణమే పార్టీ కార్యక్రమాన్ని రూపొందించుకోవాల్సిన అవసరం మీద 'ఇ.యం.యస్ వ్యాఖ్యలకు బదులుగా అందచేసిన పత్రంలో మరిన్ని వివరాలు ఉంటాయి. ఆ కరపత్రం కూడా మీ చేతుల్లోనే ఉందిప్పుడు. కాబట్టి ఆ విషయాలన్నీ నేనిక్కడ మళ్ళీ ఏకరువు పెట్టబోవడంలేదు. అయితే ఆ అంశంతో ముడిపడిఉన్న ప్రాధాన్యత రీత్యా ఒకటి రెండు ముఖ్య విషయాలను వివరించేందుకు మీ అనుమతి తీసుకుంటున్నాను.

ఒకపక్క నుండి మితవాద పత్రికలు పగలూ, రాత్రీ తేడా లేకుండా మనమీద చేస్తున్న విషపు దాడి, మరోవైపున కమ్యూనిస్టు వ్యతిరేక గుత్త పత్రికలు కంకణం కట్టుకుని మరీ చేస్తున్న వ్యతిరేక ప్రచారానికి బదులు చెప్పకుండా కిమ్మన్నాస్తిగా ఉండలేని పరిస్థితి నెలకొనివుంది. వాళ్ళు మన రాజకీయ – సైద్ధాంతిక వైఖరిని కావాలనే వక్రీకరిస్తూ మనల్ని 'పెకింగ్ ఏజెంట్లనీ', 'పార్టీని తిరిగి 1948–కాలం నాటి దుస్సాహసిక రాజకీయ ఎత్తుగడల వైపుకి నడిపిస్తున్నామనీ, 'మనం హింసాత్మక విప్లవాన్ని ఎగదోస్తున్నామనీ' పచ్చి అవాకులు చవాకులు పేలుతున్నారు. అసలు చర్చించాల్సిన కీలక అంశాలను అంటే... ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం, రాజ్యం యొక్క వర్గ స్వభావం ఏమిటి, పెట్టుబడిదారీ మార్గం – దాని భవిష్యత్తు, ప్రస్తుత విప్లవదశ ఏమిటి వ్యూహం – ఎత్తుగడలు ఎలా ఉండాలి... తదితర కీలక అంశాలను పూర్తిగా పక్కదోవ పట్టించి, ఆసలు చర్చకు రాకుండా చేసేందుకు ఈ తప్పుడు ప్రచారం లేవగొట్టి మనల్ని ఒంటరిపాటు చెయ్యాలని చూస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా నికరమైన, విజయవంతమైన పోరాటం చెయ్యాల్సి వుంది. అన్ని మౌలిక అంశాల మీదా మన ఏకోన్ముఖ వైఖరి ఏమిటో విస్పష్టంగా చెప్పగలిగే కార్యక్రమాన్ని మన పార్టీ సభ్యులు చేతుల్లో ఉంచగలిగి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురాగలిగితే మన శత్రువులు చేస్తున్న మోసకారి, తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు ఎంతో ఉపకరిస్తుంది. ఈ దృష్ట్యా కార్యక్రమం యొక్క తక్షణ ఆవశ్యకతను తక్కువ చేసి చూడకూడదని నేను మనవి చేస్తున్నాను. ముసాయిదా కార్యక్రమం మీద ఇప్పటికే మనం చేపట్టిన అంతర్గత చర్చలు, డిబేట్లు ఈ సరికే మన శత్రువులను ఆత్మరక్షణలో పడెయ్యడం ద్వారా తొలివిజయం సాధించింది. ఇప్పుడు మన ఎదురుదాడి నికరంగా కొనసాగాలి.

కార్యక్రమం మీద భేదాభిప్రాయాలు ఉండి,

> “మార్క్సిస్టుపార్టీ కార్యక్రమంలో ఏ విషయం, ఏ రూపంలో, ఏ నిర్మాణ పద్ధతులలో ఉండాలి అనేది ప్రశ్న. కామ్రేడ్ ఇ.యం. యస్ వ్యాఖ్యలపై అందచేసిన వివరణాత్మక విమర్శనాత్మక నోట్‌లో ఈ ప్రశ్నకు జవాబు ఇచ్చేందుకు ప్రయత్నించాను. నిజానికి పార్టీ కార్యక్రమం ఎలా ఉండా లనేది మనలో చాలా మందికి చిరపరిచితమైన అంశ మేమీ కాదు.”

ముసాయిదా కార్యక్రమం పట్ల వ్యతిరేకత ఉన్న ఈ దశలో ముసాయిదాను మహాసభలో చర్చకు తీసుకురావడం వల్ల పార్టీని ఐక్యంగా ముందుకు తీసుకుపోవడానికి బదులు అది పార్టీ ఐక్యతను దెబ్బతీసే ప్రమాదం ఉంది కదా అనే వాదన ఒకటి ముందుబెట్టారు. కాని నేను ఇందుకు సరిగ్గా వ్యతిరేకంగా అభిప్రాయపడుతున్నాను. ఐక్యత సాధించడానికి ఈ చర్చ దోహదపడుతుందని ఆశిస్తున్నాను. అందుకు తగిన మార్గం కూడా ఇదే. 1899లో పార్టీ కార్యక్రమం మీద జరిగిన చర్చ సందర్భంగా లెనిన్ వెలిబుచ్చిన విలువైన అభిప్రాయాలు పరిశీలనలో మనకు మరింత అవగాహన కలిగిస్తాయని భావిస్తూ, లెనిన్ ఏం చెప్పాడో ఉదహరిస్తా:

“కార్యక్రమాన్ని విస్తృత పరచడానికి ఇది తగిన సమయం కాదనీ, ఈ సరికే అభిప్రాయ బేధాలు ఉన్నందున సోషల్ డెమోక్రాట్లలో మరిన్ని వాదనలు చెలరేగే అవకాశం ఉందనీ కొందరు అభ్యంతర పెడుతున్నారు. కానీ ఇందుకు భిన్నంగా ఆలోచించడమే సరైనదని నేను భావిస్తున్నాను. కార్యక్రమ ఆవశ్యకతను పై వాదన తెలియచెబుతుంది. అభిప్రాయ భేదాలంటూ ఉన్నాయి కాబట్టి ముసాయిదా కార్యక్రమం మీద చర్చ జరిగే క్రమంలో అన్ని రకాల అభిప్రాయాలూ, దృక్పథాలూ వ్యక్తీకరించేందుకు అవకాశం ఉంటుంది. నేషనల్ డెమోక్రట్లలో నెలకొన్న అభిప్రాయ భేదాలు ఏం సూచిస్తున్నాయి? – మన ఉద్యమ లక్ష్యం ఏమిటి, తక్షణ కర్తవ్యాలు – ఎత్తుగడలు ఏమిటి వంటి విస్తృతమైన ప్రశ్నల మీద రకరకాల ఆసక్తులు ప్రేరేపించబడుతున్నాయనేకదా. ఇవన్నీ తీరాలంటే ముసాయిదా కార్యక్రమం మీద చర్చ అవసరమనేకదా. ఈ అభిప్రాయ భేదాలు అర్థం, పర్థం లేనివి కాకుండా ఉండాలన్నా, మన దృక్పథంలో గందరగోళం లేకుండా ఉండాలన్నా మన మిత్రులకూ, శత్రువులకూ మరింత స్పష్టత ఇవ్వాలన్నా – ఎన్ని అభిప్రాయ భేదాలున్నా కార్యక్రమాన్ని మహాసభ ముందుంచడం అనివార్యం. అభిప్రాయ భేదాలు మనకు ప్రయోజనం చేకూర్చాలంటే ఆ అభిప్రాయ భేదాల్లో సరుకుందా లేక పాక్షిక అంశాలపై మనం ఏర్పరుచుకున్న అభిప్రాయాలా అనేది తేలాలి. ఆ అభిప్రాయ బేధాలు మన కార్యకర్తల యంత్రాంగం యావత్తూ ఐక్యంగా పనిచేసేందుకు ఆటంకమో, కాదో తేల్చేసుకోవాలి. కార్యక్రమాన్ని మహాసభ ముందుంచితేనే అభిప్రాయభేదాలు తలెత్తుతాయా, లేదా అభిప్రాయ భేదాలున్న రెండు శక్తులూ కార్యక్రమం మీద నిర్దిష్టంగా చర్చించుకోవడం ద్వారా ఆ అభిప్రాయ భేదాలు సమసిపోతాయా – ఈ అన్ని ప్రశ్నలకు జవాబు దొరకాలన్నా, జవాబులు కావాలని డిమాండ్ చేస్తున్న ఈ ప్రశ్నలు సమసిపోవాలన్నా కార్యక్రమాన్ని మహాసభలో చర్చకు పెట్టడమే సరైందని నేను భావిస్తున్నాను. పార్టీ ఉమ్మడి కార్యక్రమాన్ని విస్తృతపరచుకోవడం మన అభిప్రాయ భేదాలను సర్దిపుచ్చటం కోసం మాత్రం కాదు. మన ఉద్యమం లక్ష్యం, లక్షణం, మన ఉద్యమ కర్తవ్యాలను మౌలికంగా, నికరంగా నిర్ధారించుకోవడమే అసలు లక్ష్యం. తద్వారా అటువంటి ఉమ్మడి కార్యక్రమం మన ఉద్యమ పార్టీ కేతనమై ఎగరాలి. తద్వారా మనలో అభిప్రాయ భేదాలున్నా ఆచరణాత్మక ఐక్యత పెరగాలి.” (లెనిన్ కలెక్టెడ్ వర్క్, 4వ వ్యాసం, పేజీలు 230-231 నుండి)

నేను పైన ఉదహరించిన లెనిన్ వ్యాఖ్యలను మన పరిస్థితులకు తగినట్లుగా అన్వయించుకుంటే ఇప్పుడు మనం ఏం చెయ్యాలో స్పష్టత వస్తుంది. ఇప్పుడు మన ముందున్న ప్రశ్నలన్నింటి మీదా మనం చాలా కాలంగా చర్చ చేస్తూనే వచ్చాం. దానికి తోడు మనకు రెండు దశాబ్దాల అనుభవం కూడా ఉంది. మన ముందు రకరకాల ముసాయిదా కార్యక్రమాలు ఉన్నాయి. ముసాయిదా కార్యక్రమం మీద వివిధ వివరణాత్మక ‘నోట్’లూ ఉన్నాయి. వీటి ఆధారంగా దేశ వ్యాప్తంగా పార్టీ అన్ని శాఖల లోనూ గత ఆరు నెలలుగా చర్చ జరుగుతోంది. కాబట్టి చర్చించడానికి తగినంత సమయం లేకుండా పోయింది అన్న ఆరోపణ నిరాధారమైనది. అయితే మరింత చర్చ జరిగితే ఇంకా లోతైన అధ్యయనం జరిగి అనేక అంశాల మీద మన అవగాహన మరింత పదును తేలుతుంది అనడంలో కూడా ఎలాంటి సందేహమూ లేదు. దాన్ని కొట్టిపారెయ్యడం లేదు. పార్టీ కార్యక్రమం అనేది ప్రధానమైనది కాబట్టి ఈ మహాసభ అమోదం కోసం దాని మీద చర్చిదాం. వివాదాస్పద అంశాలను పరిష్కరించుకుందాం. ఆ తర్వాత కూడా ఇంకేమన్నా అభిప్రాయ భేదాలు ఉంటే వాటిని పరిష్కరించుకునేదానికీ కృషి చేద్దాం.

ఈ ప్రశ్నలన్నింటికీ తోడు మనకు ఎదురయిన ఇంకో ప్రధాన ప్రశ్న ఏమిటంటే – మార్క్సిస్టుపార్టీ కార్యక్రమంలో ఏ విషయం, ఏ రూపంలో, ఏ నిర్మాణ పద్ధతులలో ఉండాలి అనేది. కామ్రేడ్ ఇ.యం.యస్ వ్యాఖ్యలపై అందచేసిన వివరణాత్మక విమర్శనాత్మక నోట్‌లో ఈ ప్రశ్నకు జవాబు ఇచ్చేందుకు ప్రయత్నించాను. నిజానికి పార్టీ కార్యక్రమం ఎలా ఉండాలనేది మనలో చాలామందికి చిరపరిచితమైన అంశమేమీ కాదు. మార్క్సిస్టు కార్యక్రమం ఎలా ఉండాలనే దానిమీద లెనిన్ చేసిన ఒక సంక్షిప్త ప్రకటనను మనం ఇక్కడ గుర్తుకు తెచ్చుకోవడం అవసరం అని నేను భావిస్తున్నాను. 1899లో సోషల్ డెమోక్రాట్ పార్టీ కార్యక్రమంపై తుది వ్యాఖ్యలు చేస్తూ లెనిన్ ఇలా అన్నాడు:

“రష్యన్ సోషల్ డెమోక్రాట్ వర్కింగ్ క్లాస్ పార్టీ కార్యక్రమంలో ఏ అంశాలు ఉండాలంటే....

(1) రష్యా ఆర్థికాభివృద్ధి మౌలిక లక్షణం మీద ఒక ప్రకటన.

(2) పెట్టుబడిదారీ విధానం అనివార్య పర్యవసానాలు – పేదరికం పెరుగుదల, కార్మిక వర్గం జీవన ప్రమాణాలు దిగజారిపోవడం వంటి అంశాలపై ప్రకటన.

(3) మనం చేపట్టిన ఉద్యమం పునాదిగా శ్రామికవర్గం యొక్క వర్గ పోరాటాల ఆవశ్యకతపై ఒక ప్రకటన.

(4) సోషల్ డెమోక్రాట్ కార్మికవర్గ ఉద్యమం అంతిమ లక్ష్య ప్రకటన – రాజకీయాధికారం దక్కించుకోగానే నిర్దేశిత లక్ష్యాల సాధన గురించి – అలాగే ఉద్యమం యొక్క అంతర్జాతీయ స్వభావం గురించిన ప్రకటన.

(5) వర్గపోరాటం యొక్క అనివార్యమైన రాజకీయ స్వభావం గురించిన ప్రకటన.

(6) రష్యన్ నియంతృత్వం వల్ల ఎలాంటి హక్కులు లేని పరిస్థితి, ప్రజలపై కొనసాగుతున్న

దోపిడీ, పీడనలు, దోపిడిదార్లకు వత్తాసుగా వాన్న పాలన గురించి ఒక ప్రకటన అలాంటి నియంతృత్వం కార్మికవర్గ వాద్యమ పురోగతికి ఏ రకంగా ఆటంకంగా నిలుస్తుందీ, రాజకీయ స్వాతంత్ర్య సాధన సమగ్ర సామాజిక అభివృద్ధి ప్రయోజనాలకు ఎలా తోడ్పడుతుంది, అందు రీత్యా పార్టీ తక్షణ రాజకీయ కర్తవ్యంగా ఎలా మారుతుంది అనే విశదీకరణ.

(7) నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడే అన్ని తరగతుల ప్రజానీకానికి, అన్ని రాజకీయ పక్షాలకు మన పార్టీ ఏరకంగా తోడ్పాటుగా నిలుస్తుందీ, ప్రభుత్వ మూర్ఖపు విధానాలను తిప్పికొట్టడానికి ఏ మేరకు సంసిద్ధంగా వాందో తెలియచెప్పే ప్రకటన.

(8) కనీస ప్రజాస్వామిక డిమాండ్లను రూపొందించడం.

(9) కార్మికవర్గ ప్రయోజనాలను డిమాండ్ చెయ్యడం.

(10) రైతాంగ కోర్కెలను రూపొందించడం. – ఈ డిమాండ్ల జనరల్ స్వభావం ఎలాంటిదో వివరించడం (లెనిన్ కలెక్టెడ్ వర్క్, వాల్యూం– 4, పేజీ 253)

మన ముసాయిదా కార్యక్రమాన్ని, అందులోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే దాదాపుగా ఈ కార్యక్రమం లెనిన్ ప్రతిపాదించిన జనరల్ సూత్రీకరణలకు లోబడి వాండాలి. మన ముసాయిదా కార్యక్రమంలో ఏం పేర్కొన్నామో చూద్దాం ఇప్పుడు...

1) మన దేశం రాజకీయ స్వాతంత్ర్యం ఎలా సంపాదించుకుంది, ప్రస్తుత జాతీయ – అంతర్జాతీయ పరిణామాలు, పరిస్థితులలో దాని ప్రాధాన్యత ఎమిటి అన్న అంశాలపై ప్రకటన.

2) నూతనంగా ఏర్పాటయిన ప్రభుత్వ వర్గ స్వభావం ఏమిటనే అంచనాపై ప్రకటన, బడా బూర్జువాల నాయకత్వంలో బూర్జువా, భూస్వామ్య రాజ్యం లక్షణాలు ఏమిటనే దానిపై వివరణ.

3) ప్రపంచ పెట్టుబడిదారీ విధానం తృతీయదశ సాధారణ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన రాజ్యం, ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను పెట్టుబడిదారీ అభివృద్ధి పంథాలో నడిపించడానికి చూస్తున్నదన్న ప్రకటన, దానితోపాటు విదేశీ పెట్టుబడులకు స్వస్తిచెప్పి, భూస్వామ్య విధానాన్ని రద్దు చెయ్యడానికి బదులుగా విదేశీ ద్రవ్య పెట్టుబడి – భూస్వామ్య విధానాలను ఆలంబనగా చేసుకుని ఆధునిక పెటుబడిదారీ వ్యవస్థను ఎలా నిర్మించదలసిందో వివరణ.

4) ప్రభుత్వ జాతీయ, అంతర్జాతీయ విధానాలపై సునిశిత విమర్శ. అంటే గత రెండు దశాబ్దాలుగా వ్యవసాయం, పారిశ్రామికరంగం, అంతర్జాతీయ విధానాలపై ప్రభుత్వ పనితీరును నిర్దిష్టంగా అంచనావేసి చెప్పడం.

**❝ పార్టీ కార్యక్రమం వంటి కీలకమైన డాక్యుమెంట్‌ను చర్చకు పెట్టి దానికి తుదిరూపం ఇవ్వబోతున్నాం అంటే ఇది శాస్త్రీయమైన పార్టీ (కార్యక్రమ) డాక్యుమెంట్‌గా నిలిచిపోవడానికి తగిన కనీస ప్రాతిపదికలన్నీ వుండేలా మన నిర్ణయం వుండాలి. అంటే విప్లవ సాధనకు పట్టే కాలమంతా, జనతా ప్రజాస్వామిక విప్లవం పరిపూర్తి అయ్యేంతదాకా మనకు ఈ డాక్యుమెంట్ మార్గదర్శకంగా వుండాలి. ❞**



**సిపిఎం వ్యవస్థాపక పొలిట్‌బ్యూరో సభ్యులు పి. రామ్మూర్తి, హరికిషన్ సింగ్ సూర్జిత్**

5) రాజ్యాంగ యంత్ర స్వభావం ఎలా వాండింది, బూర్జువా – భూస్వామ్య పరిపాలనలో మెజారిటీ ప్రజానీకాన్ని ప్రజాస్వామ్యానికి ఎలా దూరం చేసిందీ, తత్ఫలితంగా విచ్ఛిన్నకర, వేర్పాటు వాద్యమాలు వెర్రితలలు వేసి దేశ సమగ్రత పునాదులు ఎలా దెబ్బతినిపోతాయనే అంశంపై ప్రకటన.

6) భారత కమ్యూనిస్టుపార్టీ కోరుతున్న తక్షణ లక్ష్యమైన జనతా ప్రజాస్వామిక కార్యక్రమంపై ఒక ప్రకటన అందులో భాగంగానే కార్మికులు, రైతాంగం, మధ్య తరగతి జనాభా ఇతర ప్రజాస్వామిక తరగతుల కోర్కెలను వ్యక్తీకరించడం.

7) భారత విప్లవ దశ, విప్లవ వ్యూహాలపై సంక్షిప్త నిర్వచనం, అంటే దేశంలోని వర్గ బలాబలాల పొందికపై వివరణ. ఏ శక్తులు విప్లవాన్ని వ్యతిరేకిస్తాయి, ఏ శక్తులను విప్లవ సాధనలో కలుపుకు పోవచ్చు అనే అంశాలపై అంచనా గురించిన ప్రకటన.

8) మర్క్సిజం – లెనినిజం, శ్రామిక వర్గ అంతర్జాతీయ పునాదులపై బలమైన కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి పిలుపు. శాంతి, ప్రజాస్వామ్యం, సోషలిజం సాధనకోసం అంతర్జాతీయంగా జరిగే పోరాటాలకు తోడ్పాటు. సాంఘిక దోపిడీ నుండి జన సామాన్య విముక్తి కోసం చేసే పోరాటాల గురించి ప్రకటన.

మన ముసాయిదా కార్యక్రమంలో పేర్కొన్న ఈ అంశాలన్నీగానీ, విడి విడి అంశాలు గానీ సమగ్రత లోపించినా, అస్పష్టతతో వాన్నా వాటన్నింటిని సరిదిద్ది ముసాయిదా కార్యక్రమాన్ని మరింత పరిపుష్టం చేసే కర్తవ్యం ఈ మహాసభదే.

**ముసాయిదా కార్యక్రమం – ముఖ్యాంశాలు**

ప్రస్తుతం మీ ముందుంచుతున్న ముసాయిదా కార్యక్రమం గత మౌలిక పద్ధతిని వదిలిపెట్టి, సరైన రీతిలో కార్యక్రమాన్నీ, ఎత్తుగడల పంథానూ వేర్వేరుగా ఇస్తున్న అంశాన్ని ప్రత్యేకంగా గమనంలో వుంచుకోవాలి. ఈ విషయాన్ని నేనిక్కడ ప్రత్యేకంగా ప్రస్తావించడంలో నా వాద్దేశ్యం ఏంటంటే కార్యక్రమం మీద క్షుణ్ణమైన, అర్థవంతమైన చర్చ జరిగి ముసాయిదాను మరింత పరిపుష్టం చేస్తారన్న ఆలోచన. పార్టీ కార్యక్రమం వంటి కీలకమైన డాక్యుమెంట్‌ను చర్చకు పెట్టి దానికి తుదిరూపం ఇవ్వబోతున్నాం అంటే ఇది శాస్త్రీయమైన పార్టీ (కార్యక్రమ) డాక్యుమెంట్‌గా నిలిచిపోవడానికి తగిన కనీస ప్రాతిపదికలన్నీ వుండేలా మన నిర్ణయం వుండాలి. అంటే విప్లవ సాధనకు పట్టే కాలమంతా, జనతా ప్రజాస్వామిక విప్లవం పరిపూర్తి అయ్యేంతదాకా మనకు ఈ డాక్యుమెంట్ మార్గదర్శకంగా వుండాలి. కాబట్టి పార్టీ కార్యక్రమం రాజ్యం యొక్క ప్రభుత్వం యొక్క– వర్గ స్వభావాన్నీ, విప్లవ స్వభావాన్నీ, వ్యూహాన్నీ, ఎత్తుగడలనూ, విప్లవ సాధనలో కార్మికవర్గం, కార్మికవర్గ పార్టీల కర్తవ్యాలనూ, పాత్రనూ తదితర కీలక అంశాలన్నింటినీ వివరించాలి. పార్టీ కార్యక్రమాన్నీ, ఎత్తుగడలనూ కలగాపులం చేసేసి తలకు మించిన భారంగా చేసుకోకూడదు. ఎత్తుగడలనేవి విప్లవోద్యమంలో ఎదురయ్యే ఆటుపోట్లు, పాలకశక్తుల వ్యూహం, ప్రతివ్యూహాలు, జాతీయంగా, అంతర్జాతీయంగా శరవేగంగా మారుతున్న పరిస్థితులు వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటూ ఎప్పటికప్పుడు సమయానుకూలంగా చేసే నిర్ణయాలు. కార్యక్రమాన్నీ, ఎత్తుగడలనూ కలగాపులం చేసేసుకుంటే

> **❝ కార్యక్రమంలో చేసిన రెండవ సవరణ అత్యంత కీలకమైంది. రాజ్యం యొక్క ప్రభుత్వం యొక్క ప్రస్తుత వర్గ స్వభావం, రాజ్యాధికార మార్పిడి ప్రత్యేకత, దాని స్వభావాలకు సంబంధించినది. ఇది రెండు విధాలా కీలక సవరణ. స్వాతంత్ర్యానంతర కాలంమీద మన పార్టీ ఇంతవరకూ తీసుకున్న తప్పుడు, పిడివాద అవగాహనకు స్వస్తి పలుకుతుంది. ❞**

ఈ రెండింటికీ వున్న ప్రత్యేకతలను కోల్పోతాయి. అప్పుడది కార్యక్రమం-రాజకీయ తీర్మానాల వామ్మడి ప్రతిగా తయారై, ఎప్పటికప్పుడు మార్పు లు, చేర్పులు చేసుకుంటూ పోవాల్సి వస్తుంది. రోజువారీ మార్పులు, పరిస్థితులలో మార్పులు ఎత్తుడలను కూడా అంతే వేగంగా మార్చుకునే పరిస్థితులు కల్పిస్తాయి. అందుకే లెనిన్ ఇలా అంటాడు:

"కార్మికవర్గ పార్టీ రూపొందించుకొనే పార్టీ కార్యక్రమంలో ఎత్తుగడల పంథాకు సూచన ప్రాయంగానైనా చోటు వుండదు. కార్యక్రమం అనేది విప్లవ సాధనకు వుండే మార్గాలను చర్చించుకునేందుకు అవకాశాలు కల్పించేదిగా వుండాలి. ఆ మార్గాలను అట్టే పెట్టుకోవడమంటే సమరశీలమైన పార్టీ, పార్టీ మహాసభ చర్చించి పార్టీ ఎత్తుగడలను నిర్ణయిస్తుందని.

ఎత్తుగడలను అత్యంత అనివార్యమైన పరిస్థితులలో తప్పితే కార్యక్రమంతో జతకలప కూడదు. (ఒక్క మినహాయింపు ఏమిటంటే (మార్క్సిస్టు) సూత్రాలకు సంబంధించిన ప్రశ్నలు, రాజరిక పాలనను వ్యతిరేకించే ఇతరేతర శక్తుల పట్ల మనం అవలంబించాల్సిన వైఖరులను చెప్పుకోవచ్చు). ఎత్తుడలను పార్టీ అధికారిక పత్రిక ఆ పరిస్థితులను బట్టి పార్టీ మహాసభ నిర్ణయాలకు అనుగుణంగా చర్చిస్తుంది" (లెనిన్ కలెక్టెడ్ వర్క్స్, వాల్యూం 4 పేజీ 238)

లెనిన్ చేసిన ఈ సూత్రీకరణ మన చర్చకు వాపకరించేది. జనరల్‌గా వర్తించేది కూడా. సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న మన పార్టీ గంపగుత్త రాజకీయ తీర్మానాలు చెయ్యడానికి అలవాటు పడిపోయింది. ఎప్పటికప్పుడు కార్యక్రమానికి సంబంధించిన అంశాలనూ, ఎత్తుగడలకు సంబంధించిన సమస్యలనూ కలగలిపేసి చూసేవాళ్ళం. 1951లో ఆమోదించుకున్న కార్యక్రమంలో ఇతరత్రా లోటుపాట్లతో పాటు ఈ పొరబాటూ వుంది. వాదాహరణకు భారత ప్రభుత్వ ఆర్థిక విధానాలను ఆ నిర్దిష్ట



రివిజనిస్టు నేత శ్రీపాద అమృత దాంగే

కాలంలో ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న నిర్దిష్ట సంక్షోభం ఆధారంగా అంచనా వేయడం, అలానే ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ నీతిని కూడా ఒక నిర్దిష్ట పరిస్థితిని బట్టి అంచనా వేయడం ఇవన్నీ కార్యక్రమ మౌలిక అంశాల స్థాయిలో ఈ ముసాయిదా కార్యక్రమంలో పొందుపరిచాం. నేనీ మహాసభకు విచ్చేసిన ప్రతినిధులకు చేసే విజ్ఞప్తి ఏమిటంటే పార్టీ కార్యక్రమాన్ని ఆమోదించే క్రమంలో దీన్ని మళ్ళీ కార్యక్రమం - రాజకీయ తీర్మానాల జమిలి రూపంలో లేకుండా చూడండి. కాబట్టి మన పాత అలవాట్లను వదిలిపెట్టి ఈ ముసాయిదాను నికరమైన పార్టీ కార్యక్రమం డాక్యుమెంట్‌గా మెరుగుపరిచేందుకు తగిన కృషి పెట్టండి. లేదంటే మళ్ళీ మనం గతంలో చేసిన తప్పులు పునరావృతం చేసినట్లవుతుంది.

కార్యక్రమంలో చేసిన రెండవ సవరణ అత్యంత కీలకమైంది. రాజ్యం యొక్క ప్రభుత్వం యొక్క ప్రస్తుత వర్గ స్వభావం, రాజ్యాధికార మార్పిడి ప్రత్యేకత, దాని స్వభావాలకు సంబంధించినది. ఇది రెండు విధాలా కీలక సవరణ. స్వాతంత్ర్యానంతర కాలంమీద మన పార్టీ ఇంతవరకూ తీసుకున్న తప్పుడు, పిడివాద అవగాహనకు స్వస్తి పలుకుతుంది. మౌంట్ బాటన్ అవార్డ్ మీద 1947 నాటి కేంద్రకమిటీ తీర్మానం, 1948లో జరిగిన పార్టీ రెండవ మహాసభ సైద్ధాంతిక పత్రం, 1950ల నాటి వామపక్ష 'డీవియేషన్' నివేదిక ఆ మాటకు వస్తే 1951లో రూపొందించిన పార్టీ కార్యక్రమం... వీటన్నింటా ఈ పొరబాటు అవగాహనలు దొర్లాయి. ఇవాళ మనం 1951నాటి పార్టీ కార్యక్రమాన్ని తిరగరాసుకుంటున్నాం. కాబట్టి లోపభూయిష్టమైన ఒంటెద్దు పోకడలు, పిడివాదాలకు చోటు లేకుండా చూసుకోవడం మన ముందున్న అనివార్యత అని గ్రహించాలి. అలాగే డాంగేయిస్టులు ప్రచురించిన కార్యక్రమంలో మాదిరి మితవాద అవకాశవాదానికీ, వర్గ సంకర విధానాలకూ చోటు లేకుండా చూసుకోవాలి. 1956 నుండి మొదలైన ఈ పెడ ధోరణులు 62 నాటికి వచ్చేసరికి ఈ రకమైన 'రివిజనిస్టు' ధోరణిగా స్థిరపడిపోయాయి.

ఇలాంటి తప్పులు దొర్లడానికి మూలం ఏమిటి, వాటి స్వభావం ఏమిటి? పార్టీ కార్యక్రమంలో నిర్దిష్టంగా చేపట్టిన సవరణలు ఏమిటి?

స్వాతంత్ర్యానంతర కాలంలో రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత బలాబలాల పొందికలో వచ్చిన మార్పులను సరిగా అంచనా వెయ్యలేకపోవడం మన ప్రధాన లోపం. దీనివల్ల అనేక పొరబాటు వైఖరులు దొర్లాయి. సోవియట్ సోషలిస్టు రష్యా చేతిలో హిట్లర్ ఫాసిజం చావు దెబ్బతినడం, తూర్పు యూరప్ దేశాల్లో అనేక చోట్ల జనతా ప్రజాస్వామిక విప్లవాలు రావడం, చైనా విప్లవం చారిత్రకంగా విజయం సాధించడం... ఇవన్నీ శక్తివంతమైన ప్రపంచ సోషలిస్టు శిబిరం ఆవిర్భావానికి దారితీసాయి. దానితోపాటే ప్రపంచం నలు చెరుగులా జాతీయ విముక్తి పోరాటాలు వెలువెత్తాయి. దాంతో ప్రపంచ రాజకీయ చిత్రపటంలో శరవేగంగా మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రపంచ సామ్రాజ్యవాద శిబిరానికి చుక్కెదురయ్యింది. శాంతి-ప్రజాస్వామ్యం-సోషలిస్టు శిబిరం బలోపేతమైంది. ప్రపంచ సామ్రాజ్యవాదం అందునా ప్రధానమైన అనేక దేశాలపై వలసాధిపత్యం చలాయిస్తున్న బ్రిటీష్ సామ్రాజ్యవాదం ఆర్థికంగా, సైనికంగా, రాజకీయంగా చాలా బలహీనపడింది. అలాంటి బలహీనపడిన బ్రిటీష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా మన జాతీయోద్యమం సాగుతోంది. వర్గ బలాబలాల పొందికలో ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ మార్పును సరిగా అంచనా వెయ్యలేకపోవడం, అర్థం

చేసుకోలేకపోవడంతో మన రాజకీయ పంథాను – ఎత్తుగడలను మారిన ఈ బలాబలాల పొందిక పునాదిగా మార్చుకోవడంలో విఫల మయ్యాం. దాంతో యుద్ధానికి ముందు మనం అంచనా ఏదైతే వుందో, దేని ఆధారంగా మనం సైద్ధాంతిక–రాజకీయ తీర్మానాలు చేసామో ఆ తప్పుడు ప్రాతిపదికకే కట్టుబడి వుండిపోయి పిడివాద పోకడలు పోయాం.

అలాగే రాజకీయ అధికార మార్పిడి విషయం తీసుకోండి. ఈ రకమైన అధికార మార్పిడి వర్గ స్వభావం ఏమిటి? నూతనంగా ఏర్పడిన రాజ్యం స్వభావం ఏమిటి? మనకు వచ్చిన స్వాతంత్ర్యం అసలైనదా కాదా? భారత బూర్జువా వర్గం సామ్రాజ్యవాదాన్ని ఎదిరిస్తూ పోషించిన పాత్ర అంతమైపోయిందా, ఇంకముందూ కొనసాగిస్తుందా? బూర్జువా నాయకత్వాన స్వతంత్ర్య ఆర్థికాభివృద్ధి సాధ్యమా కాదా? అయితే దాని పరిధి, పరిమితులు ఏమిటి?.... అనే అంశాలపై ఎడతెగని చర్చలు జరిగాయి. ఈ ప్రశ్నలు వీటికి అనుబంధంగా తలెత్తిన అనేక ఇతర ప్రశ్నలకు మనం కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ద్వితీయ సదస్సు 'జాతీయత–వలసవాదం' మీద ఆమోదించిన సైద్ధాంతిక–రాజకీయ డాక్యుమెంట్లను ఆధారం చేసుకొని జవాబులు వెతికే పనిలో పడ్డాం. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఆమోదించిన సిద్ధాంత పత్రంలో ఏమని పేర్కొని వుందంటే – "దేశదేశాల కష్టజీవులకు మరీ ముఖ్యంగా వెనుకబడిన దేశాల్లోని కష్టజీవులకు సామ్రాజ్య వాద శక్తులు చేసే మోసపు ఎత్తుగడల గురించి నిరంతరం విప్పి చెబుతుండాలి. రాజకీయంగా స్వాతంత్ర్యం ప్రసాదిస్తూ ఆర్థికంగా, సైనికంగా, ద్రవ్య విధానపరంగా తనమీదే ఆధారపడేట్టు చేస్తుంటుంది ప్రపంచ సామ్రాజ్యవాదం. కాబట్టి నూతన అంతర్జాతీయ పరిస్థితులలో బలహీన దేశాల విముక్తికి తోడ్పాటునిచ్చేది సోవియట్ సోషలిస్టు రష్యన్ రిపబ్లిక్ మినహా వేరొకటి కాదు" అని.

మనం ఏం చేశామంటే ఆధునిక అంతర్జాతీయ పరిస్థితులలో వచ్చిన రాడికల్ మార్పులను గమనంలోకి తీసుకోకుండా పై సిద్ధాంతాన్ని యథాతథంగా అన్వయించుకొని బ్రిటీష్ సామ్రాజ్యవాదం భారతదేశానికి ఇచ్చిన రాజకీయ స్వాతంత్ర్యాన్ని అంచనా కట్టాం. ఈ పొరబాటు అంచనా వల్ల తర్వాతికాలంలో ఒకదానిమీద ఇంకొకటి తప్పులు దొర్లుకుంటూ పోయాయి. 1920–30ల నాటి అంతర్జాతీయ పరిస్థితులకూ, రెండవ ప్రపంచ యుద్ధానంతర అంతర్జాతీయ పరిస్థితులకూ మధ్య చాలా మార్పులు

**" మనం ఏం చేశామంటే ఆధునిక అంతర్జాతీయ పరిస్థితులలో వచ్చిన రాడికల్ మార్పులను గమనంలోకి తీసుకోకుండా పై సిద్ధాంతాన్ని యథాతథంగా అన్వయించుకొని బ్రిటీష్ సామ్రాజ్యవాదం భారతదేశానికి ఇచ్చిన రాజకీయ స్వాతంత్ర్యాన్ని అంచనా కట్టాం. ఈ పొరబాటు అంచనా వల్ల తర్వాతికాలంలో ఒకదానిమీద ఇంకొకటి తప్పులు దొర్లుకుంటూ పోయాయి. "**


వి.ఐ. లెనిన్

చోటు చేసుకున్నాయనే నిర్దిష్ట వాస్తవాన్ని మనం విస్మరించాం.

అందుకే స్వాతంత్ర్యానంతర భారతదేశ రాజ్య స్వభావాన్ని అంచనా వేసేటప్పుడు అది మౌంట్‌బాటన్ అవార్డ్‌లో పేర్కొన్న 'డొమినియన్ ప్రతిపత్తి' మినహా వేరొకటి కాదనీ, రెండవ మహాసభ సైద్ధాంతిక పత్రంలో ఈ అధికార మార్పిడిని 'సామ్రాజ్యవాదం ఎదురు దాడికి దిగడానికి ముందు వేసిన వెనుకడుగని, ఇది 'ప్రత్యక్ష పాలనకు బదులు మనమీద రుద్దిన పరోక్ష పాలన' అని అభివర్ణించాం. అలాగే 1951లో రాసుకున్న పార్టీ కార్యక్రమంలో దేశంలో అధికారంలో వున్న జాతీయ బూర్జువా ప్రభుత్వం బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి జూనియర్ పార్ట్‌నర్‌గానో, సీనియర్ పార్ట్‌నర్‌గానో కొనసాగు తుందనీ ఈ ప్రభుత్వం తన రథచక్రాన్ని బ్రిటీష్ పెట్టుబడికి పూనిందని బ్రిటీష్ 'కామన్‌వెల్త్' చేతిలో కీలుబొమ్మలా దాని ఇష్టారాజ్యంగా ఆడుతుందనీ, ఈ ప్రభుత్వం అనివార్యంగా బ్రిటీష్ సామ్రాజ్యవాద విదేశాంగ విధానాలకు అనుగుణంగా పనిచేస్తుందనీ అంచనా వేశాం. అంతర్జాతీయంగా బలాబలాల పొందికలో వచ్చిన మార్పులను క్షుణ్ణంగా అధ్యయనం చేసి నిర్దిష్టంగా అంచనాకు రాలేకపోవడం వల్ల ఇలాంటి జనరల్ సూత్రీకరణలకూ, అతి సాధారణీకరించిన సూత్రీకరణలకూ, తల్లకిందులు సూత్రీకరణలకూ వచ్చాం. ఈ పరిణామాలు 1947–49 ప్రాంతంలో చోటు చేసుకున్నాయి. కాబట్టి ఆ సమయంలో మనం ఒక అంచనాకు రాలేకపోయాం అంటే అర్థం వుంది. కాని చైనా విప్లవం చారిత్రాత్మక విజయం సాధించాక అయినా, ఆ తరువాత ప్రపంచవ్యాప్తంగా వేగంగా చోటు చేసుకున్న మార్పుల తరువాత అయినా మనం ఈ పరిణామాలను పరిగణనలోకి తీసుకోలేక పోయాం. దానికి వున్న ఆర్థిక, రాజకీయ, సైనిక బలంతో మనకు ఇచ్చిన రాజకీయ స్వాతంత్ర్యాన్ని నామ్‌కే వాస్తేగా మార్చెయ్యగలదనీ, తన ఇష్టారాజ్యంగా ప్రవర్తించగలదనే అంచనా వల్ల ప్రపంచ సోషలిస్టు శిబిరం రాజకీయంగా పోషించగల అత్యంత ప్రాముఖ్యతగల పాత్రను అర్థం చేసుకోవడంలోనూ, జాతీయ విముక్తి ఉద్యమాలు వెల్లువెత్తుతూ, పెట్టుబడిదారీ దేశాల్లోకూడా బలమైన కార్మికవర్గ పోరాటాలు జరుగుతున్న వాస్తవాలను తక్కువగా అంచనా కట్టాం.

### వర్గ విప్లవం: బూర్జువా వర్గం లొంగుబాటు

నిస్సందేహంగా మన పార్టీ చేసిన పెద్ద తప్పిదం ఇది. మన పార్టీ కార్యక్రమంలో ఈ పొరబాటును సరిదిద్దుకోవాలి. అంతేకాకుండా ఇప్పటిదాకా దొర్లిన పొరబాట్లకు గాన్న ఒకే ఒక మూలం ఏమిటో పసిగట్టి, మన పొరబాటు ధోరణులను వదిలించుకోవాలంటే మన ఆలోచనలను, ఓరియంటేషన్ (అవగాహన)ను సరైన మార్క్సిస్టు–లెనినిస్టు పంథాకు అనుగుణంగా మలచుకోవాలి. నా దృష్టిలో వున్న కొన్ని తీవ్రమైన పొరబాట్లను మీ ముందు వుంచుతాను. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి తగు దిద్దుబాటు చెయ్యగలరని ఆశిస్తున్నా, అవేమి టంటే....

బూర్జువా వర్గం శక్తినీ, జనంమీద దాని ప్రభావాన్నీ మనం ఇప్పటిదాకా తక్కువగా అంచనా వేస్తూ వచ్చాం. అలాగే వర్గ విప్లవ చైతన్యం మీద అతిగా అంచనా వేశాం. నామమాత్రపు, కుహనా స్వాతంత్ర్యం వచ్చింది అన్న అంచనాకు రావడానికి రెండవ ప్రపంచ

**“ వర్గ పోరాటం మీద అతిగా అంచనాలు వేసుకొని ఉండడం, వర్గ విప్లవ బలం, దాని పెరుగుదలను ఎక్కువగా ఊహించుకోవడం వల్ల భారత బూర్జువా వర్గం బలాన్ని తక్కువగా అంచనా వెయ్యడం జరిగింది. దాని పర్యవసానంగానే భారత బూర్జువా వర్గం స్వభావం మీదా, నూతనంగా ఆవిర్భవించిన రాజ్యంమీదా, దేశానికి లభించిన రాజకీయ స్వాతంత్ర్యం మీదా, అధికారం చేపట్టిన బూర్జువా ప్రభుత్వం అనుసరించే జాతీయ అంతర్జాతీయ విధానాల మీదా మన అంచనాలు తప్పాయి. ”**

యుద్ధం తరువాత సామ్రాజ్యవాద శక్తిని అతిగా అంచనా వెయ్యడం ఆ అతి అంచనాలతో జాతీయ విముక్తి ఉద్యమాల మీద కూడా పొరబాటు అంచనాకు రావడంతో పాటుగా భారత బూర్జువా వర్గం యొక్క రాజకీయ–సంస్థాగత శక్తిని, జాతీయోద్యమంలో అది పోషించదగిన పాత్రనూ, జాతీయోద్యమం మీద దాని పట్టునూ మనం తక్కువగా అంచనా వేశాం. అలాగే సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా బూర్జువా వర్గం – అది కూడా నూతన పరిస్థితులలో, నూతన తరహాలో, రాజ్యాధికారాన్ని చేతిలో పెట్టుకొని – పోషించగల పాత్రనూ తక్కువగా అంచనా వేశాం. బూర్జువా నాయకత్వం ఒక పక్క విప్లవకర కార్మికవర్గానికీ, ప్రజల ప్రజాస్వామిక ఉద్యమాలకు వ్యతిరేకంగా ఎంత క్రూరంగా విరుచుకుపడుతుందో, మరోప్రక్కనుండి సామ్రాజ్య వాదంతో ఘర్షణ పడుతూ బేరాలు సాగించు కోవడం, ఆర్థిక సహకారం, భాగస్వామ్యాలతో అదే సామ్రాజ్యవాదంతో రాజీపడిపోవడం దాని దైనందిన స్వభావంగా మన అనుభవంలోకి వచ్చింది. కాని మనం ‘వర్గ విప్లవమనే ప్రమాదం పెరుగుతున్న కొద్దీ జాతీయ బూర్జువా వర్గం లొంగుబాట్లు, రాజీలకు సిద్ధపుతుంది’ ‘సామ్రా జ్యవాదంతో అంటకాగుతుంది’ ‘సామ్రాజ్యవాదా నికి జూనియర్ భాగస్వామి కావడానికి అంగీకరిస్తుంది’ అని అతి సాధారణంగా సూత్రీ కరించాం.

భారత బూర్జువా వర్గానికీ, సామ్రాజ్య వాదానికీ మధ్య రాజీ కుదిరి రాజకీయంగా ఒక ఒప్పందానికి రావడం నిర్దిష్ట పద్ధతులలో, నిర్దిష్ట పరిస్థితులలో రాలేదు. రెండవ ప్రపంచ యుద్ధంలో ఘోరంగా దెబ్బతిన్న బ్రిటీష్ సామ్రాజ్యవాదం భారత జాతీయ విముక్తి పోరాటం ఉధృతంగా సాగుతున్న నేపథ్యంలో ఏం జరగనున్నదో గ్రహించి ఆర్థిక–రాజకీయ విదేశాంగ రంగాల మీద తగినంత పట్టునిలుపుకుంటూ రాజకీయాధికారాన్ని జాతీయ బూర్జువా నాయకత్వానికి బదిలీ చేసేందుకు ఒక ఒప్పందానికి రావడానికి వేగిరపడింది. జాతీయ విముక్తి పోరాటానికి నాయకత్వం వహిస్తున్న జాతీయ బూర్జువా వర్గం కూడా సామ్రాజ్యవాద షరతులకు లోబడి రాజ్యాధికారం బదలాయింపుకు సిద్ధపడడం లాభసాటిగా వుంటుందని తలపోసింది. వాస్తవానికి ఇది సామ్రాజ్యవాదంతో రాజీపడిపోవడమే, జాతీయ విముక్తి పోరాటపు కొన్ని కీలక లక్ష్యాలకు ద్రోహం చేయడమే. ఈ లొంగుబాటు ఒప్పందం ద్వారా విదేశీ ద్రవ్య పెట్టుబడితో షరీకవడానికి భారత బూర్జువా వర్గం సిద్ధపడింది. స్వాతంత్ర్య సాధన కోసం సమరశీలంగా సాగిన విశాల ప్రజా ఉద్యమాన్ని భారత బూర్జువా వర్గం ఏదో ఒక దశలో ఉపసంహరించుకుంది. ఉద్యమ సమరశీలత పట్ల బెంగటిల్లేది. ఉద్యమం తన చేతులు దాటిపోతుందని భయపడేది. అయితే ఇక్కడ మనం కీలకంగా అర్థం చేసుకోవాల్సింది. అంచనా వెయ్యాల్సింది ఏమిటంటే– భారత బూర్జువా వర్గం సామ్రాజ్యవాదంతో రాజీపడిపోవడానికి ప్రధానకారణం అప్పటి పరిస్థితుల్లో అది లాభసాటి బేరంగా భావించడమా లేక దాని వర్గ ప్రయోజనాలరీత్యా ఆ నిర్ణయానికి వచ్చిందా అనేదే. మామూలుగా చెప్పుకోవాలంటే ఈ రెండు అంశాలూ భారత బూర్జువా వర్గంమీద ప్రభావం చూపాయి. కాని ఇది పైకి కనిపించేంత మామూలు వ్యవహారం కాదు. వర్గపోరాటాల ఉధృతి పెరుగుతున్న దృష్ట్యా ఆ అంచనాతో చూస్తే బూర్జువా వర్గం అనివార్యంగా సామ్రాజ్యవాదం ముందు లొంగుబాటు ప్రదర్శించిందనీ, రాజ్యాధికారాన్ని నామమాత్రంగా దక్కించుకొని సామ్రాజ్యవాదం తోలుబొమ్మలా ఆడించే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందన్న నిర్ధారణకు వస్తాం. నిజానికి ఇది పొరబాటు అంచనా. వర్గ పోరాటం మీద అతిగా అంచనాలు వేసుకొని ఉండడం, వర్గ విప్లవ బలం, దాని పెరుగుదలను ఎక్కువగా ఊహించుకోవడం వల్ల భారత బూర్జువా వర్గం బలాన్ని తక్కువగా అంచనా వెయ్యడం జరిగింది. దాని పర్యవసానంగానే భారత బూర్జువా వర్గం స్వభావంమీదా, నూతనంగా ఆవిర్భవించిన రాజ్యంమీదా, దేశానికి లభించిన రాజకీయ స్వాతంత్ర్యం మీదా, అధికారం చేపట్టిన బూర్జువా ప్రభుత్వం అనుసరించే జాతీయ అంతర్జాతీయ విధానాల మీదా మన అంచనాలు తప్పాయి.

మనం గతాన్ని ఆబ్జెక్టివ్‌గా, ఆత్మ విమర్శనా పూర్వకంగా అధ్యయనం చెయ్యాల్సిన అవసరం దృష్ట్యానే ఈ విశ్లేషణనూ, మన పొరబాట్లనూ మీ దృష్టికి తీసుకురావాల్సి వచ్చింది. మన తప్పుల నుండి మనం సరైన గుణపాఠాలు తీసుకోకపోతే అదే పొరబాట్లు భవిష్యత్తులోనూ పునరావృతం అవుతాయి. మనం మరోసారి దెబ్బతింటాం. గతంలో చేసిన పొరబాట్లు మనలో కొన్ని ప్రమాదకర ధోరణులను అవశేష మాత్రంగా పట్టి వుంటాయి. అవి పెరిగి పెద్దవైతే మన విప్లవదశ, విప్లవ వ్యూహం, విప్లవోద్యమం పట్ల మన ఎత్తుగడలూ అన్నీ దారితప్పిపోతాయి. మళ్ళీ మనం ఒంటెద్దువాద పోకడలకు బలయ్యే ప్రమాదం వుంటుంది.

**ఆర్థిక పరాధీనత – రాజకీయ స్వాతంత్ర్యం**

రాజకీయాధికారం బదిలీ, నూతన రాజ్య స్వభావాలను మనం అంచనా కట్టేటప్పుడు దొర్లిన తీవ్రమైన మూడో తప్పిదం నా దృష్టిలో ఏమిటంటే ఆర్థికాంశాలకు మనం ఇవ్వదగిన ప్రాధాన్యత కన్నా అవసరమైన అత్యధిక వొక్కాణింపు నిచ్చాం అని.

లెనిన్ సూత్రీకరణ మేరకు ఏ దేశాలైతే ఆర్థికంగా, సైనికంగా, ద్రవ్యపరంగా సామ్రాజ్య వాదం మీద ఆధారపడి వుంటాయో అవి వాటి రాజకీయ స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకోలేవు అనేది సరైనదే. కానీ మన చర్చల్లో, పార్టీలో మన వ్యతిరేకుల చర్చల్లో దీనిమీద పొరబాటు అంచనాకు వచ్చాం. పార్టీలో మన వ్యతిరేకులు దేశానికి సిద్ధించిన రాజకీయ స్వాతంత్ర్యాన్ని అసలు సిసలైన రాజకీయ స్వాతంత్ర్యం అని అతిగా చేసి చూపితే మనమేమో రాజకీయ స్వాతంత్ర్యాన్ని తక్కువగా అంచనా వేశాం. మనం ఇలాంటి పొరబాటు నిర్ధారణకు రావడానికి కారణం అంతర్జాతీయంగా మారిన పరిస్థితులు సరిగా అంచనా వెయ్యకపోవడం వల్ల నూతనంగా జాతీయ విముక్తి సాధించిన దేశాలకు – అది బూర్జువా నాయకత్వాన సాధించినదయినప్పటికీ ఆ రాజకీయ స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకునేందుకు నూతన అవకాశాలు కలిసి వచ్చాయనేది మనం గ్రహించలేకపోయాం. ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద శక్తుల

> **"ఆర్థికాంశాలను కూడా మనం పరిగణనలోకి తీసుకోవాల్సిందేగానీ అంతిమ విశ్లేషణలో రాజకీయ స్వాతంత్ర్యం అనే అంశాన్ని విస్మరించే పరిస్థితికి దారి తియ్యకూడదు. ఈ రాజకీయ స్వాతంత్ర్యం ఆర్థికాభివృద్ధి క్రమం మీద ప్రభావం చూపిస్తుంది."**

బలం క్షీణించడం, శక్తివంతమైన సోషలిస్టు శిబిరం ఏర్పడడం వల్ల నూతన అవకాశాలు అందివచ్చాయి. ఈ నూతన పరిస్థితులను సక్రమంగా అంచనా వెయ్యకపోవడం, ఆర్థికాంశాల ప్రాతిపదికన రాజకీయ స్వాతంత్ర్యాన్ని తక్కువచేసి చూడడంతో మనం పొరపాటు నిర్ధారణకు వచ్చాం. గతంలో దొర్లిన ఈ పొరబాట్లకు నేనూ – కొద్దో గొప్పో నా సహచర కామ్రేడ్స్, మేమే కారణం. పాల్ఘాట్‌లో జరిగిన పార్టీ నాల్గవ మహాసభలో ప్రవేశపెట్టిన చర్చా పత్రాలను చూస్తే మీకు ఇది అర్థమౌతుంది. నాడు పార్టీ ప్రధాన కార్యదర్శిగా వున్న దివంగత నేత అజయ్ ఘోష్ పార్టీ కార్యక్రమం – విధానాల్లో పెను మార్పులు తీసుకు రావాలని వొత్తిడి చేస్తుంటే పొరబాట్లను సవరించుకునే పేరిటా, లోటుపాట్లను అధిగమించే పేరిటా ప్రమాదకరమైన సంస్కరణవాద ధోరణులను పార్టీలో నాటేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనీ, ఇది అంతిమంగా మార్క్సిస్టు–లెనినిస్టు మౌలిక సూత్రాలకు చెల్లు చీటీ చెప్పి మితవాద పంథాకు దారితీసే ప్రమాదముందనీ మాలో కొంతమందిమి సరిగానే గ్రహించాం. తదనంతర కాలంలో చోటు చేసుకున్న పరిణామాలు మా అంచనాలు సరైనవని నిర్ధారించాయి. డాంగే అండ్ కో మితవాద నాయకత్వాన్ని ధిక్కరిస్తూ పార్టీ మహాసభను ఏర్పాటు చేసేదాకా పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది పైకి కనిపించే దానిలో ఒక పార్శ్వం మాత్రమే. ఈ సమస్యను రెండోవైపు నుండి పరిశీలిస్తే సంస్కరణ వాదానికి వ్యతిరేకంగా ఆ దశలో మేం చేసిన పోరాటంలో సరైన మార్క్సిస్టు–లెనినిస్టు సూత్రాలను అన్వయించుకొని పనిచేశామా లేదా అనేది కూడా పరిశీలించుకోవాల్సి వుంది. మౌలికంగా మేం నిర్దిష్ట మార్క్సిస్టు–లెనినిస్టు సూత్రాలకు కట్టుబడి పనిచేశాం గానీ అంతిమంగా ఈ సూత్రాల అన్వయింపులో ఆర్థికాంశాన్ని నిర్ణయాత్మక ప్రాతిపదికగా తీసుకున్నాం. ఇంకా చెప్పాలంటే ఆర్థికాంశానికి కుదించాం. నూతన అంతర్జాతీయ పరిస్థితుల వెలుగులో కొత్తగా సముపార్జించుకున్న రాజకీయ స్వాతంత్ర్యం వంటి అత్యంత ప్రాసంగిక అంశాలను పరిగణనలోకి తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించాం. తత్ఫలితంగా బూర్జువా నాయకత్వం ఈ రాజకీయ స్వాతంత్ర్యాన్ని వినియోగ పెట్టుకొని ఏదో ఒక మేరకు ఆర్థిక పునాదిని బలోపేతం చేసుకోగలుగుతుందనే వాస్తవిక అంశాన్ని గుర్తించడంలో విఫలమయ్యాం. ఆ రకంగా మనమితవాద ప్రత్యర్థులు తొక్కిన సంస్కరణవాద పంథాను



కారల్ మార్క్స్, ఫెడరిక్ ఏంగెల్స్

సంపూర్ణంగా, సమగ్రంగా బట్టబయలు చెయ్యడంలో ఈ రకమైన వామపక్ష ఒంటెద్దువాదం వల్ల వెనుకపట్టుపట్టాం. ఈ పొరబాట్లను చైతన్యపూర్వకంగా అర్థం చేసుకొని వాటిని సంపూర్ణంగా సరిదిద్దుకోవాల్సిన అవసరం వుందని ప్రతినిధి కామ్రేడ్స్‌కు తెలియచెబుతున్నా.

ఆర్థికాంశాలను కూడా మనం పరిగణనలోకి తీసుకోవాల్సిందేగానీ అంతిమ విశ్లేషణలో రాజకీయ స్వాతంత్ర్యం అనే అంశాన్ని విస్మరించే పరిస్థితికి దారితియ్యకూడదు. ఈ రాజకీయ స్వాతంత్ర్యం ఆర్థికాభివృద్ధి క్రమం మీద ప్రభావం చూపిస్తుంది. ఈ అంశంమీద ఇంకా మనలో ఏమన్నా సందేహాలు ముసురుకొని వుంటే వాటి నివృత్తికోసం ఏంగెల్స్ ఉదహరించిన ఈ క్రింది విషయాన్ని మన సందేహాల నివారిణిగా పరిగణనలోకి తీసుకుందాం:

"కుర్రకారు అవసరానికి మించి ఆర్థికాంశాలకు ప్రాధాన్యత ఇవ్వడానికి పాక్షిక కారణం మార్క్స్, నేనూ–ఇద్దరిమీ అని భావిస్తున్నా. మేం మా విమర్శకులకు సమాధానంగా ప్రధాన అంశాలు, మౌలిక సూత్రాల వివరణ మీదే దృష్టి పెట్టడంతో ఇతరేతర అంశాల్లోకి సవివరంగా పోయే అవకాశంగానీ, సమయంగానీ లేకుండా పోయాయి"

పై అంశాన్ని ఏంగెల్స్ మరింతగా ఇలా వివరించాడు:

"చరిత్రను భౌతికవాద దృక్పథంతో పరిశీలిస్తే చరిత్రను నిర్ధారించే అంతిమ మూలకం నిజ జీవితంలో సాగుతున్న ఉత్పత్తి, పునరుత్పత్తులే. మార్క్సగానీ, నేనుగానీ ఇంతకు అదనంగా ఏమీ నిర్ధారించలేదు. కాబట్టి దీన్ని అడ్డం పెట్టుకొని ఆర్థికాంశాలు మాత్రమే ఏ మార్పునైనా నిర్దేశిస్తాయి. అని అర్థం తీస్తే అంతకన్నా అర్థం లేని మాట, అమూర్తమైన మాట, పనికిమాలిన పదబంధం వేరొకటి వుండదు. ఆర్థిక వ్యవస్థ పునాదిగా నిలుస్తుంది. అయితే ఉపరితలంలో అనేక అంశాలు– వర్గపోరాటాల రాజకీయ రూపాలు, వాటి పర్యవసానాలు, పైచెయ్యి సాధించడానికి సాగిన యుద్ధాల్లో విజేతగా నిలిచిన వర్గం ఏర్పాటు చేసే రాజ్యాంగం, న్యాయ సంస్కరణలు, వర్గ పోరులో భాగస్వాములైనవారి ఆలోచనల ప్రతిఫలనాలు – రాజకీయ, న్యాయ, సైద్ధాంతిక, మతపర అంశాలు – అవి కాలక్రమంలో వ్యవస్థీకృతంగా మారి పిడివాదంగా మారడం.... ఇవన్నీ చారిత్రాత్మక పోరాటాల మీద ప్రభావం చూపిస్తాయి. ఫలితాన్ని నిర్ణయించడంలో కీలకపాత్ర పోషిస్తాయి. ఈ అంశాలన్నింటి మధ్య అంతర్గత సంబంధాలు వుంటాయి. వీటికి తోడు అసలు లేవనుకున్నవో, పరిగణనలోకి తీసుకోనివో అంశాలు కూడా ప్రమాదవశాత్తూ మధ్యలో ఎదురవుతాయి. అమితంగా ఆర్థికాంశం నిర్ణయాత్మకంగా ప్రభావం చూపిస్తుంది. చరిత్రకు సంబంధించి ఏ కాలానికైనా సిద్ధాంతాన్ని అన్వయించి విశ్లేషించడం, నిర్ధారించడం అందుకే అంత కఠినతరమైనదిగా వుంటుంది. లేకుంటే భౌతికవాద దృక్పథంతో చరిత్రను అధ్యయనం చేయడం అనేది డిగ్రీ చదువుల్లో తొలి ఏడాదిలో చెప్పే సాధారణ సూత్రీకరణ అంత తేలికైపోయి వుండేది కాదు."


(మార్క్స్ఏంగెల్స్, సెలెక్టెడ్ వర్క్స్, వాల్యూం2, పేజీ442)

పైన ఉదహరించిన పేరాకు వివరణ ఇవ్వాల్సిన అవసరం వుందని నేను భావించడం లేదు. దీన్నించి మనం తీసుకోవాల్సిన గుణపాఠం ఏమిటంటే ఆర్థికాంశాల యొక్క విశిష్టతనూ, అంతిమంగా అవి నిర్ణాయాత్మక

(మిగతా 30వ పేజీలో)

**ఈ మాసం ప్రత్యేకం**

# పాలక వర్గాల చేత పాలక వర్గాల కోసం



**రచయిత, రాజకీయ విశ్లేషకుడు, పౌరహక్కుల కార్యకర్త. ముంబయికి చెందిన ప్రజాతంత్ర హక్కుల పరిరక్షణ కమిటీ నాయకుడు. హిందూ దిన పత్రికలో ఇటీవల ఆయన రాసిన వ్యాసాన్ని మార్పిస్తు పాఠకులకు అందిస్తున్నాం.**

**ఆనంద్ తెల్తుంబ్డే**

మరికొద్ది రోజుల్లో భారత దేశంలో ఎన్నికల నిర్వహణ అనే మహా యజ్ఞం ముగుస్తుంది. ఓటరు మహారాజులు తిరిగి పొట్టకూటి కోసం పనులు వెదుక్కుంటుంటారు. మరోవైపు జాతి యావత్తూ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యంలో నాన్నందుకు తనవీపు తానే చరుచుకుంటుంది. సుదీర్ఘ ప్రజాస్వామ్య ప్రక్రియ ముగింపుకొస్తుంది. గెలిచిన అభ్యర్థులు పెట్టిన భారీ పెట్టుబడిని తిరిగి సంపాదించుకునే పనిలో పడిపోతారు. అమెరికాతో సరితూగేంత సంపదను ఎన్నికల నిర్వహణకోసం భారత్‌లో ఖర్చు చేస్తున్నారు. (ఈ ఎన్నికల్లో భారత రాజకీయ నాయకులు 500 కోట్ల డాలర్లు (సుమారు 30,000 కోట్ల రూపాయలు) ఖర్చు చేస్తున్నట్లు అంచనా. 2012లో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో 700 కోట్ల డాలర్లు ఖర్చయిందని అంచనా). ఎన్నికలను ఎదుర్కొనేందుకు కావలసిన డబ్బు కోసం అన్ని రకాల కుట్రలూ, కుతంత్రాలూ పన్నుతారు. ఎలా ఆలోచించినప్పటికీ ఈ డబ్బంతా ధనిక పాలక వర్గాలనుండి వచ్చేదే, నేరాలు చేసి సంపాదించిందే అయుంటుందని అర్థమవుతుంది. ఇదే నిజమైనప్పుడు ఈ ఎన్నికలు భారత దేశానికి పట్టిన జబ్బుగా పరిగణించాల్సి వస్తుంది.

**అవినీతి తీరుతెన్నులు**

నాదారవాద వ్యవస్థలో ప్రత్యక్ష ప్రజాస్వామ్యం సాధ్యం కాదు. ప్రజాస్వామ్యం పనిచేయాలంటే ప్రజా ప్రతినిధులు కావాలి. కావాలంటే ఎన్నికలు జరగాలి. అయితే రాజకీయ పార్టీలు నిలబెట్టిన అభ్యర్థులు లేకుంటే ఇండిపెండెంటు అభ్యర్థులను ఎన్నుకోవడం మినహా ప్రజలకు మరో మార్గం లేదు. ఇండిపెండెంట్లలో కూడా ఎక్కువ మంది ఎన్నికల వ్యూహాల్లో భాగంగా రాజకీయ పార్టీలు నిలబెట్టే డమ్మీ అభ్యర్థులే. దీనివల్ల ఏం జరుగుతోంది? వారు ఎంతబాగా పనిచేస్తున్నారు అన్న దానితో నిమిత్తం లేకుండా, ప్రతి ఎన్నికలోనూ ఒకే రకమైన వ్యక్తులు ఎన్నికవుతున్నారు. ఈ మొత్తం క్రమం చూస్తే ఇతరులు ప్రవేశించడానికి వీల్లేకుండా ఒక పెద్ద గోడకట్టేసినట్లు తయారయ్యింది. నాదాహరణకు లోక్‌సభకు పోటీచేసే అభ్యర్థి అధికారికంగా ఖర్చు చేయాల్సిన పరిమితి రూ. 70 లక్షలుగా నిర్ణయించారు. ప్రధాన రాజకీయ పార్టీలు మాత్రమే ఈ ఖర్చును భరించగలవు. కానీ నిజానికి పెట్టుబడి పెడుతున్నది దీనికి అనేక రెట్లు ఎక్కువ. ఒక వ్యక్తి ఇంత పెట్టుబడి పెట్టి రిస్క్ తీసుకుంటున్నాడంటే సిద్ధాంత రీత్యా చూస్తే దానిమీద అంతకంతా లాభం రావాలి. కానీ లాభం అనేది ఇక్కడ లేదు కాబట్టి అది మరింత అవినీతి కింద మారిపోతోంది. ఇది రాజకీయాలను అందరికన్నా ఎక్కువ లాభాలు గడించే ఒక పెద్ద వ్యాపారంగా మార్చేసింది. ఎన్నికైన ప్రతినిధి ఒక ఫ్యూడల్ ప్రభువుగానూ, నియోజక వర్గం ఆయన రాజ్యంగానూ మారిపోయింది. కండబలం, ధన బలంతో ఒక కోట కట్టేస్తున్నారు.

అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) కృషి వల్ల ఎన్నికల్లో పాల్గొంటున్న రాజకీయ నాయకుల వివరాలు ఇప్పుడు ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయి. అభ్యర్థులు ఎన్నికల కమిషన్‌కు సమర్పించే అఫిడవిట్లనుండి ఈ సంస్థ వివరాలను సేకరించి ప్రజలకు సుబోధకంగా నాండేట్లు సమర్పిస్తోంది. అభ్యర్థులు స్వచ్ఛందంగా ఇచ్చే ఈ వివరాలు వాస్తవ సంఖ్యలకంటే చాలా చాలా తక్కువ. అయినప్పటికీ ఈ వివరాలను పరిశీలిస్తే ఎంతమంది అభ్యర్థులు కోటీశ్వరులయిపోతున్నారో తెలియజేస్తుంది. 15వ లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థుల్లో 1,249 మంది కోటీశ్వరులు. వారిలో 300 మంది పార్లమెంటుకు ఎన్నికైనారు. వీళ్ల డబ్బుతోబాటు నేరాల రికార్డు కూడా పెరుగుతూ వచ్చింది. ప్రధాన పార్టీలన్నిటిలోనూ ఈ రెండూ పెరుగుతూ వచ్చాయి. రెండు ప్రధాన పార్టీలయిన కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలల్లో 2004లో 24, 29 మంది చొప్పున క్రిమినల్ కేసులున్న పార్లమెంటేరియన్లుండేవారు. 2009 నాటికి రెండు పార్టీల్లో వీరి సంఖ్య 44 మంది చొప్పున పెరిగింది. వీళ్లు మన ప్రజా ప్రతినిధులు. రోజుకు రూ. 20తో బతికేస్తున్న మన ప్రజల ప్రతినిధులు!

ఇంకా ఆసక్తికరమైన విషయం ఏమంటే, ప్రతి ఎన్నికలకూ వారి సంపద ఇబ్బడిముబ్బిడిగా పెరిగిపోతున్నది. మళ్లీ పార్లమెంటుకు పోటీచేసిన 304 మంది ఎంపీల సంపద 289 శాతం పెరిగిందని ఎడిఆర్, జాతీయ ఎన్నికల వాచ్ (ఎన్ఇడబ్ల్యు) కనుగొన్నాయి. ఇంత పెద్ద శాతం పెరుగుదల కార్పొరేట్ వ్యాపార ప్రపంచంలో కూడా కనిపించదు. పేద ప్రజల సేవలో తరించిపోయే ఒక సామాన్య తెలివితేటలుగల వ్యక్తి అత్యుత్తమ ఫండ్ మేనేజర్లను కూడా తలదన్నేస్తున్నాడు. ఎంత విచిత్రం! మామూలుగా అయితే ఇటువంటి ఆధారాలు ఇన్‌కమ్ టాక్స్ వాళ్లనూ, అవినీతి వ్యతిరేక అధికారులనూ పరుగులెత్తిస్తాయి. కానీ ఈ గొప్పవారి రాజకీయ

సంబంధాలు ఇటువంటి గాలి కూడా వారికి సోకకుండా చేస్తాయి. ఈ డబ్బంతా వారికి ఎక్కడి నుండి వస్తోంది అని తెలుసుకోడానికి బుర్ర బద్దలు కొట్టుకోనక్కర్లేదు. మొత్తం అధికార యంత్రాంగం ప్రజల పేరుతో కార్పొరేట్ సంస్థలూ, డబ్బు సంచుల సేవలో తరించిపోతున్నప్పుడు వారికి డబ్బు ఎలా వస్తుందో తెలుసుకోవడం పెద్ద సమస్యేమీ కాదు.

> **❝ పాలక వర్గాలు తమ రాజకీయాధికారాన్ని పటిష్ట పరుచుకోడానికి మెజారిటీ ఓట్లు వచ్చిన వారు గెలుపొందే పద్ధతిని ఎంపిక చేసుకున్నారు. ఈ పద్ధతిని బ్రిటిష్ సామ్రాజ్యవా దులు తమ వలసలన్నిటిపై రుద్దినట్టే మన నెత్తిన కూడా రుద్దారు. కానీ మన భారత దేశ పరిస్థితులకు అనుగుణమైన పద్ధతిని మనం ఏర్పాటు చేసుకోడానికి మనకు తరువాత అడ్డం వచ్చిన అంశం ఏమీ లేదు. ❞**

### ఎన్నికల పద్ధతి

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు పాలకులకు ఎదురైన ప్రధాన సమస్య ప్రజల ఆశలను ఎలా నెరవేర్చడం అనేది. స్వాతంత్ర్య పోరాటంలో వారే ప్రజల్లో అటువంటి ఆశల కోటలు నిర్మించారు. విప్లవానంతర సోవియట్ యూనియన్ కళ్లు చెదిరే అభివృద్ధి సాధించడం, యుద్ధానంతర ప్రపంచంలో సంక్షేమ రాజ్యాలు ఏర్పడ్డం, పొరుగున ఉన్న చైనాలో విప్లవం జరుగుతుండడం... ఇవన్నీ కూడా ప్రజల్లో ఆశలను మరింత రేకెత్తించాయి. అధికార మార్పిడి సమయంలో చెలరేగిన మతకలహాలు, విడివిడిగా ఉన్న 600 సంస్థానాలు భారత దేశంలో విలీనం కావడం, దేశంలోని కొన్ని ప్రాంతాల్లో కమ్యూనిస్టుల నాయకత్వంలో సాయుధ పోరాటాలు జరగడం, కింది కులాలవాళ్లలో చైతన్యం రావడం... ఇవన్నీ కూడా కొత్త పాలకులకు ఒక పెద్ద సవాలు విసిరాయి. వాళ్లు నిర్మించిన గణతంత్ర రాజ్యాంగం ఈ ఆశలను ప్రతిఫలించింది. కానీ, వాస్తవంగా చూస్తే అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీ బూర్జువా వర్గ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తోంది. అది చాలా చాకచక్యంగా వారి ప్రయోజనాలను ముందుకు తీసుకుపోతోంది. ప్రజల ఆశలు నెరవేర్చేట్లు కనిపించాల్సిన అవసరం – కానీ వాస్తవంగా పెట్టుబడి యొక్క ప్రయోజనాలు నెరవేర్చడం... ఈ రెంటి మధ్య ఏర్పడిన ఘర్షణ అది చేపట్టిన అనేక మోసపూరిత చర్యల్లో మనకు కనిపిస్తుంది. ఒకవైపు సోషలిస్టు దృక్పథాన్ని ప్రదర్శించేందుకు పంచవర్ష ప్రణాళికలు ప్రారంభించడం, రెండోవైపు ఆనాడు ఎనిమిది మంది అతి పెద్ద పెట్టుబడిదారులు తయారు చేసిన బొంబాయి ప్రణాళికను రహస్యంగా ఆమోదించడం, లేక ఒకవైపు భూ సంస్కరణలు ప్రారంభించడం, మరోవైపు వాటి పీక నులిమేసి దేశంలో తమకు గ్రామీణ ప్రాంతాల్లో మిత్రులుగా ఉపయోగపడే ధనిక రైతు వర్గాన్ని సృష్టించడం లేక ఆకలి నిర్మూలించే పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో పెట్టుబడిదారీ సంబంధాలను పెంపొందించేందుకు హరిత విప్లవాన్ని ప్రోత్సహించడం... ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. అధికారాన్ని పూర్తిగా తమ చేతుల్లో ఉంచుకుంటూ ప్రజాస్వామ్య ప్రక్రియను కొనసాగించాలంటే వారు రాజకీయంగా ఇటువంటి పద్ధతులు అనుసరించక తప్పలేదు.

పాలక వర్గాలు తమ రాజకీయాధికారాన్ని పటిష్ట పరుచుకోడానికి మెజారిటీ ఓట్లు వచ్చిన వారు గెలుపొందే పద్ధతిని ఎంపిక చేసుకున్నారు. ఈ పద్ధతిని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తమ వలసలన్నిటిపై రుద్దినట్టే మన నెత్తిన కూడా రుద్దారు. కానీ మన భారత దేశ పరిస్థితులకు అనుగుణమైన పద్ధతిని మనం ఏర్పాటు చేసుకోడానికి మనకు తరువాత అడ్డం వచ్చిన అంశం ఏమీ లేదు. ఈ రోజు మనం ఎదుర్కొంటున్న అనేక దుష్పరిణామాలన్నీ కూడా ఈ 'మెజారిటీ వచ్చిన వ్యక్తి ఎన్నికయ్యే పద్ధతి' వల్లనే ఏర్పడుతున్నాయి. మన దేశంలో ఉన్నంతటి వైవిధ్య భరితమైన రాజకీయ రంగంలో మెజారిటీ పార్టీ మద్దతు లేకుండా ఒకవ్యక్తి ఎన్నిక కావడం కష్టం. దాని వల్ల స్వప్రయోజనాలు గల అనేక గ్రూపులు మెజారిటీ పార్టీ చెప్పినట్లు చేయాల్సి వస్తోంది. దీనివల్ల గెలుపొందిన వారిని తమలో కలిపేసుకోవడం, ఇంకా ఇతర రకాల జిత్తులు వేయడం జరుగుతోంది. మన దేశంలోని ప్రయోజనాల్లో వైవిధ్యం ఇప్పటికీ అనేక పార్టీల ఏర్పాటుకు దారితీస్తోంది. దాంతో 'మెజారిటీ వచ్చిన వ్యక్తి ఎన్నికయ్యే పద్ధతి'లో పోటీ మరింత పెరిగి పరిస్థితిని మరింత తీవ్రం చేస్తోంది. దీనివల్ల ఎన్నికల వ్యయం మరింత భారీగా పెరిగి ఒక్క బడా వ్యాపార వర్గాలు మాత్రమే ఖర్చు చేయదగ్గ స్థాయికి పోతోంది. దాంతోపాటు ఎన్నికల్లో కుల,మత తత్వాలను ఉపయోగించుకునే అనాకారి తనం కూడా ఎక్కువవుతోంది. ఇది రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ఒకరకమైన గుత్తాధికార వ్యవస్థను నిర్మించింది. దానికి కాపలాగా పోలీసులు, సైన్యం వంటి బహుళ వరుసల రక్షణ కుడ్యాలు ఏర్పాటు చేయడం జరిగింది.

### మరో రకం నమూనా

'మెజారిటీ వచ్చిన వ్యక్తి ఎన్నికయ్యే పద్ధతి'కి ప్రత్యామ్నాయం లేదా? విభిన్నమైన మన రాజకీయ వ్యవస్థ మరో భిన్నమైన రకం ఎన్నికలను కోరుకుంటోంది. అది దామాషా పద్ధతి. ఈ పద్ధతి అనేక ఐరోపా దేశాల్లో ఉంది. మన కన్నా ప్రజాస్వామ్యం బాగా వర్ధిల్లుతున్నట్లు రికార్డులున్న అనేక దేశాల్లో ఈ పద్ధతి అమలవుతోంది. దామాషా పద్ధతిలో చాలా రకాలున్నాయి. కాని ప్రధానంగా ఇది (వ్యక్తులకు కాకుండా) పార్టీలకు గానీ, సామాజిక గ్రూపులకు గానీ ఓటు వేసే పద్ధతిగా ఉంటుంది. ఆ పార్టీలు లేక సామాజిక గ్రూపులకు వచ్చిన ఓట్ల నిష్పత్తికి అనుగుణంగా ప్రతినిధులు ఎన్నికవుతారు. ఉదాహరణకు, భారత దేశంలో దళితులు 17 శాతం మంది ఉన్నారు. కానీ ప్రతి నియోజకవర్గంలో వారు మైనారిటీగా ఉన్నందున 'మెజారిటీ వచ్చిన వ్యక్తి ఎన్నికయ్యే పద్ధతి'లో వాళ్లలో ఒక్కడు కూడా ఎన్నిక కావడం కష్టం. చివరికి రిజర్వుడు నియోజకవర్గాలుగా చెప్పబడుతున్న వాటిలో కూడా వాళ్లు ఎన్నిక కావడం కష్టం. దామాషా పద్ధతి వల్ల పార్లమెంటు, శాసన సభల్లో వారి వాటా ప్రాతినిధ్యం వారికి లభిస్తుంది. చివరికి వారి నియోజకవర్గాన్ని విస్తరించుకోడానికి కూడా అవకాశాలేర్పడతాయి. ఈ క్రమం ద్వారా నేడు బహుజనులుగా చెప్పబడుతున్న దాన్ని సృష్టించడం అప్పుడు సాధ్యం అవుతుంది. ఈ సామాజిక అస్తిత్వాలు వర్గ స్పృహను పెంచడానికి దారితీసి మొత్తం రాజకీయాలకు ఒక వర్గ దృక్పథాన్ని కల్పిస్తాయి. ఈ పద్ధతిలో కుత్తుకలు కోసుకునేంత పోటీ ఉండదు, ఎందుకంటే ప్రతి సామాజిక గ్రూపుకూ తన వంతుకు తగ్గ ప్రాతినిధ్యం తప్పక లభిస్తుంది. అప్పుడు పోటీ అనేది పార్లమెంటు గోదాలోకి వెళ్లిపోతుంది. మెజారిటీ ప్రజల ప్రయోజనాలను

(మిగతా 16వ పేజీలో)

నేటి భారతం

# ఎన్నికల తరువాత....?



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ సభ్యుడు, సిఐటియు నాయకుడు.

ఎస్. వీరయ్య

కొత్త రాష్ట్రాల ప్రయాణం ఎటువైపు?

పాలకులు ప్రజల ఆశలు నెరవేర్చగలరా?

ఒంటరైన బిజెపికి మిత్రులను సమకూరుస్తున్నదెవరు?

లౌకిక విలువలకు టిడిపి నీళ్ళొదిలిందెందుకు?

వైసిపి ఒంటరిగానే ఎందుకు బరిలోకి దిగింది?

కాంగ్రెస్, టిఆర్ఎస్‌ల మధ్య బంధం ఎందుకు చెడింది?

ఇలాంటివే ఎన్నో ప్రశ్నలు తెలుగునాట ప్రజానీకాన్ని వేధిస్తున్నాయి. వీటికి సమాధానం వెతకటం అవసరం.

దేశవ్యాపితంగా ప్రజల్లో అసంతృప్తి విస్తరించింది. కాంగ్రెస్ పరిస్థితి అదుగుజారింది. పెరుగుతున్న ధరలు, అవినీతి, నిరుద్యోగం, సామాజిక సమస్యలే ఇందుకు కారణం. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలన్నీ గత ఆరు సంవత్సరాలకు పైగా సంక్షోభ బాట పట్టాయి. కార్మిక పోరాటాలు వెల్లువెత్తాయి. ఈ సంక్షోభం ఇప్పుడు మన దేశాన్ని కూడా అంటుకున్నది. మూడు సంవత్సరాల కాలంగా తయారీ రంగం క్షీణిస్తున్నది. ఇప్పటికే ప్రజల్లో నిండిన అసంతృప్తికి ఇది ఆజ్యం పోయనున్నది. అందుకే పెద్దపెట్టుబడిదారులంతా ముందే మేల్కొన్నారు. పోరాటాలను అణిచివేయగల ప్రభుత్వం కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

అధికార కాంగ్రెస్‌తోపాటు ప్రధాన ప్రతిపక్షమైన బిజెపి కూడా భ్రష్టుపట్టింది. ఆర్థిక విధానాలు, అవినీతి, ఆశ్రిత పక్షపాతాల్లో ఈ రెంటికీ తేడాలేదని రుజువు చేసుకున్నాయి. ఈ పరిస్థితుల్లో అధికారంలోకొచ్చేదెవరన్న ప్రశ్న ముందుకొచ్చింది. పాలకుల ముందు ఉన్నవి రెండే మార్గాలు. సంక్షేమం వైపు దృష్టి సారించి ప్రజల అసంతృప్తిని చల్లార్చాలి. లేదా పోరాటాలను నిర్దాక్షిణ్యంగా అణిచివేయాలి. సంక్షేమం వైపు పోవటాన్ని ప్రపంచీకరణ యుగంలో పెట్టుబడిదారులు అంగీకరించరు. పోరాటాలను అణిచివేసి అయినా తమ ప్రయోజనాలను కాపాడే సుస్థిర ప్రభుత్వం వారికి కావాలి. అందుకే వస్తే రాహుల్ లేదా మోడీ ప్రధాని కావాలి. సంకీర్ణ యుగంలో కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఎ, లేదా బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ రావాలని కోరుకుంటున్నారు. ప్రాంతీయ పార్టీలతో కూడిన ఫ్రంటు కూడా అవే ఆర్థిక విధానాలు కొనసాగిస్తుంది. కానీ అది సాపేక్షంగా అస్థిర ప్రభుత్వం. పైగా గత అనుభవాన్ని బట్టి ఇలాంటి ప్రభుత్వం మీద వామపక్షాల ప్రభావం ఉండే అవకాశం ఉంది. అస్థిర ప్రభుత్వం కార్మిక పోరాటాలకు తలొగ్గే అవకాశం ఉంటుంది. అందుకే ప్రాంతీయ పార్టీల ఫ్రంటును వీరు కోరుకోరు. రాహుల్‌కు ఎంత వెన్నుదన్నుగా నిలిచినా ప్రస్తుత పరిస్థితుల్లో పుంజుకునే అవకాశం లేదు. అందుకే మోడీ భజన. ఏ కారణం చేతనైనా మోడీ అధికారంలోకి రానట్లైతే కనీసం వామపక్షాల పాత్ర లేని ప్రాంతీయ పార్టీల సంకీర్ణాన్ని పెట్టుబడిదారులు కోరుకుంటున్నారు. అందుకే ఫెడరల్ ఫ్రంటు నినాదం ముందుకొచ్చింది.

పార్లమెంటు, ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం స్థానంలో ఏక వ్యక్తి పాలనకు దారితీసేందుకు వీలుగా ప్రధాని అభ్యర్థి నినాదం ముందుకు తెచ్చారు. నియంతృత్వ లక్షణాలకు అనుగుణంగా ప్రజాభిప్రాయాన్ని మలిచే ప్రయత్నమే ఇది. తమ స్వార్థ ప్రయోజనం కోసం పెట్టుబడిదారీ వర్గం లౌకిక తత్వానికి కూడా నీళ్ళొదిలింది. కార్పోరేట్ మీడియా ఇందుకు వెన్నుదన్నుగా నిలిచింది. ప్రాంతీయ మీడియా సైతం జాతీయస్థాయి కార్పోరేట్ మీడియాతో అనుసంధానమైంది. మీడియా రంగంలో కార్పోరేట్ బడా సంస్థలు ఆవిర్భవిస్తున్నాయి. వెరసి గుజరాత్ నమూనా అభివృద్ధి పేరుతో మోడీ భజనకు ఊతమిస్తున్నాయి.

మారిన ప్రాంతీయ పార్టీల స్వభావం బడా పెట్టుబడిదారులకు కలిసి వచ్చింది. ప్రాంతీయ పార్టీల్లో పెరిగిన అవకాశవాదాన్ని సమర్థవంతంగా వినియోగించుకోగల్గుతున్నారు. క్రమంగా ఒంటరిపాటవుతున్న బిజెపికి మిత్రులను సమకూర్చిపెట్టే పనిలో కార్పోరేట్ సంస్థలు నిమగ్నమై ఉన్నాయి. మన రాష్ట్రంలో కూడా ఇంతకాలం మిత్రులు దొరకని బిజెపికి మిత్రులను సమకూర్చిపెట్టడంలో అంబానీ, ఆదానీ వంటి బడా పారిశ్రామికవేత్తలు జయప్రదం అయ్యారు. తెలంగాణలోనూ, సీమాంధ్రలోనూ బిజెపితో పొత్తుకు వ్యతిరేకంగా టిడిపిలో నిరసనలు వెల్లువెత్తాయి. లౌకిక విలువలు దెబ్బతింటాయన్న ఆందోళనకు స్థానిక కార్యకర్తలు, నాయకులు గురయ్యారు. అంతర్గత సమస్యలు, అన్ని బూర్జువా పార్టీల్లో లాగానే టిడిపిలో కూడా అవకాశవాద ధోరణులు వ్యక్తమైనప్పటికీ బిజెపితో పొత్తు మింగుడు పడకపోవటం కూడా ఒక ముఖ్యమైన కారణం. అంతిమంగా కిందిస్థాయి కార్యకర్తలు, నాయకుల ఒత్తిడికి విలువ లేదు. కార్పోరేట్ శక్తుల, టిడిపి నాయకత్వం స్వప్రయోజనాలే ప్రధాన పాత్ర వహించాయి. మోడీకి అత్యంత సన్నిహితుడు అమిత్‌షా ఉత్తరప్రదేశ్‌లో మత వైషమ్యాలు ఉసిగొల్పుతున్నారు. ఎన్నికల కమిషన్ కూడా ఆయన ఉపన్యాసాలపైన ఆంక్షలు విధించవలసి వచ్చింది. బిజెపి మాజీ అధ్యక్షుడు

**❝ వైసిపి నాయకత్వం కూడా కేంద్ర రాజకీయాల పట్ల తన వైఖరి స్పష్టం చేయడానికి సిద్ధంగా లేదు. కేంద్రంలో ఎవరొచ్చినా మిత్రత్వం నెరపడానికి వీరికి అభ్యంతరం లేదు. ఎన్నికలయ్యేంత వరకు మాత్రమే వీరి జాగ్రత్తలు. సిపిఎంతో ఘర్షణాత్మక వైఖరి తీసుకోకుండానే మరో వైపు వామపక్షాలు లేని ఫెడరల్ ఫ్రంటు కోసం వైసిపి నాయకత్వం మమత బెనర్జీతోనూ, జయలలితతోనూ మంతనాలు జరుపుతున్నది. ❞**

నితిన్ గడ్కరి కూడా ఎద్దుమాంసం ఎగుమతిని ప్రోత్సహిస్తున్నారనీ, ఆవుల పెంపకం మీద మాత్రం పన్నులు వేస్తున్నారనీ రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు.  బీహార్‌లో బిజెపి అభ్యర్థి గిరిరాజ్ సింగ్ మరో అడుగు ముందుకేసి మోడీ వ్యతిరేకులంతా పాకిస్తాన్‌కు పోవాల్సిందేనన్నారు. విశ్వహిందూ పరిషత్ నాయకుడు తొగాడియా హిందూ కాలనీల్లో ముస్లింలు ఇళ్లు కొనరాదని బెదిరించారు. రాజీవ్‌ను హత్య చేసినవారికే ఉరి శిక్ష పడలేదని, దాడులు చేయండని పిలుపునిచ్చారు. తన అనుయాయులతో చేయవలసిందంతా చేయిస్తూ నరేంద్రమోడీ మాత్రం నోరు మెదపడంలేదు. అధికార లాలసతో అర్రులు చాస్తున్న తెలుగుదేశం నాయకత్వానికి ఇవేవీ కనిపించడం లేదు. వినిపించడంలేదు. ఈ ప్రమాదకరమైన పరిణామాలను గమనించడానికి వీరు సిద్ధంగా లేరు.

వైసిపి నాయకత్వం కూడా కేంద్ర రాజకీయాల పట్ల తన వైఖరి స్పష్టం చేయడానికి సిద్ధంగా లేదు. కేంద్రంలో ఎవరొచ్చినా మిత్రత్వం నెరపడానికి వీరికి అభ్యంతరం లేదు. ఎన్నికలయ్యేంత వరకు మాత్రమే వీరి జాగ్రత్తలు. సిపిఎంతో ఘర్షణాత్మక వైఖరి తీసుకోకుండానే మరోవైపు వామపక్షాలు లేని ఫెడరల్ ఫ్రంటు కోసం వైసిపి నాయకత్వం మమత బెనర్జీతోనూ, జయలలితతోనూ మంతనాలు జరుపుతున్నది. అదీ సాధ్యం కాకపోతే ఎన్‌డిఎతో సహకరించడానికి కూడా విధానపరమైన అభ్యంతరాలు వీరికేమీ లేవు. ఏ అవకాశాన్నైనా వినియోగించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు.

తెలంగాణ కోసం గొంగళిపురుగునైనా ముద్దాడుతానన్నారు కెసిఆర్. తెలంగాణా ఇస్తే కాంగ్రెస్‌లో టిఆర్ఎస్ విలీనానికి కూడా సిద్ధమేనన్నారు. తీరా తెలంగాణా ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతుండగానే విలీనం కాదుగదా పొత్తు కూడా లేదని తెగేసి చెప్పారు. కంగు తిన్న కాంగ్రెస్ పార్టీ నేతలు పొత్తు కోసం గొంగళిపురుగునైనా ముద్దాడవలసిన స్థితికి నెట్టబడ్డారు. కెసిఆర్ దృష్టిలో నిన్నటి దాకా సోనియా దైవం. ఉన్నట్టుండి దయ్యంగా ఎందుకు మారింది? పొత్తుకోసం చివరి నిమిషం వరకు ప్రయత్నాలు జరిగాయనీ, బెడిసి కొట్టిన తరువాతే పరస్పరం వ్యతిరేకంగా పోటీ పడుతున్నారనేది స్పష్టమే. ముఖ్యమంత్రి స్థానమే వీరి మధ్య పీటముడికి దారి తీసిందన్నది అందరికీ అర్థమైన విషయమే. దేశంలో కనుమరుగవుతున్న కాంగ్రెస్‌తో ముఖ్యమంత్రి పదవికూడా లేకుండా సహకరించవలసిన అగత్యం తమకు లేదని టిఆర్ఎస్ చెప్పకనే చెప్పింది. ఎన్నికల వేళ స్థానికంగా టిడిపి బిజెపితో జట్టుకట్టింది. అందుకే ప్రస్తుతానికి టిఆర్ఎస్ కేంద్రంలో మూడవ ఫ్రంటు గురించి మాట్లాడుతున్నది. ఇంత వరకు మంచిదే. కానీ 2009 ఎన్నికల అనంతరం ఫలితాలు కూడా రాకముందే టిఆర్ఎస్ నాయకత్వం బిజెపి పంచన చేరిన విషయం మరువలేం.

ఏమైనా జూన్ 2న రెండు కొత్త రాష్ట్రాలు ఆవిర్భవించనున్నాయి. కొత్త రాష్ట్రాల్లో తమ భవిష్యత్తు గురించి ప్రజలు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. ఎన్నికల సందర్భంగా తెలంగాణ పునర్నిర్మాణం, సామాజిక తెలంగాణ, బంగారు తెలంగాణ వంటి ముద్దుముద్దు నినాదాలు ముందుకొచ్చాయి. కాంగ్రెస్ నాయకత్వం తమ పార్టీకి బిసి, ఎస్.సిల నుండి నాయకులుగా ఎన్నుకున్నామని ప్రకటించుకున్నది. తెలంగాణకు బిసినే ముఖ్యమంత్రిని చేస్తానని చంద్రబాబునాయుడు ప్రకటించారు. సీమాంధ్రకు మాత్రం బిసి ముఖ్యమంత్రి అవసరం లేదా అన్న ప్రశ్నకు మాత్రం సమాధానం దాటవేస్తున్నారు. తమ పార్టీలకు ఎవరు నాయకులైనా, ఎవరు ముఖ్యమంత్రులు, మంత్రులైనా కోట్లాది బడుగు, బలహీనవర్గాలకు ఒరిగేదేమిటన్నదే అసలు ప్రశ్న. తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నదేమిటి? దొరల రాజ్యం పోవాలనీ, సాగు భూమి కావాలనీ కోరుతున్నారు. ఈ ఎన్నికల్లో పోటీ పడిన ప్రధాన పార్టీలన్నీ రాష్ట్రాన్ని లేదా దేశాన్ని పాలించినవే. అప్పుడు వీరు చేసిందేమీ లేదు. వీరంతా దొరల వారసులే. ఈ మధ్య కేంద్ర ప్రభుత్వం భూమి సమస్యపై విడుదల చేసిన ముసాయిదా పత్రం మీద చర్చకు అఖిలపక్ష సమావేశం జరిగింది. భూ పరిమితిని తగ్గించడానికి వామపక్షాలు మినహా ఏ ఒక్క బూర్జువా పార్టీ అంగీకరించలేదు. ఇదీ వీరి స్వభావం. భూస్వామ్య అగ్రకుల పెత్తందారీతనాన్ని నిర్మూలించకుండా కులవివక్షను రూపుమాపగలరా? తెలంగాణలో 2001 నాటికి సాగుదార్ల సంఖ్య 34.79 లక్షలు కాగా 2011 నాటికి అది 31.71 లక్షలకు తగ్గింది.  అంటే 3 లక్షలకు పైగా పేద రైతులు భూములు కోల్పోయి కూలీలుగా మారారు. అదే కాలంలో వ్యవసాయ కార్మికుల సంఖ్య 47.16 లక్షల నుండి 59.85 లక్షలకు పెరిగింది. 2010-11 వ్యవసాయ సర్వే ప్రకారమే 3.29 శాతం కుటుంబాల చేతుల్లో 19శాతం సాగు భూమి ఉన్నది. ఇది బినామీలు కాకుండానే సుమా! ఇవన్నీ ప్రభుత్వ లెక్కలే.

సీమాంధ్రలో కూడా భూమి సమస్య పరిష్కారం కాలేదు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే కోనేరు రంగారావు కమిటీ ఉ

**'మార్క్సిస్టు' పై**

**మీ అభిప్రాయాలు తెలపండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తు న్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించా ల్సిన అంశాలున్నా, అదనపు సమాచార మున్నా క్లుప్తంగా రాసి పంపండి

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

**❝ మభ్యపెట్టే వాగ్దానాలతో ప్రయోజనం లేదు. సరళీకృత విధానాల పరిధిలో మౌలిక సమస్యలు పరిష్కారం కావు. రెండు రాష్ట్రాల్లోనూ కొత్త ప్రభుత్వాలు పాత విధానాలకే కట్టుబడి పని చేస్తాయి. అందుకే నూతన రాష్ట్రాలలో ప్రజల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత ప్రజల మీదనే ఉన్నది. ❞**

మ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదలందరికీ భూమి పంచవచ్చని తేల్చింది. 1991 లెక్కల ప్రకారమే భూమి లేని వ్యవసాయ కూలీల సంఖ్య 1.1 కోట్లకు చేరింది. అటవీహక్కుల చట్టం ప్రకారమే 30 లక్షల ఎకరాల భూమి అందుబాటులో ఉన్నది. ఇందులో 80శాతం తెలంగాణలోనే. 2007లో జరిగిన సమరశీల భూపోరాటం భూమి సమస్య తీవ్రతను సూచిస్తున్నది. ఎన్నికల సందర్భంగా సీమాంధ్ర అభివృద్ధి చర్చనీయాంశమైంది. సీమాంధ్రను సింగపూర్ చేస్తానన్నాడు చంద్రబాబునాయుడు. సింగపూర్‌లు, సైబరాబాద్‌లు తప్ప పూరిగుడిసెలు ఆయనకు కనిపించవు. సింగపూర్ మోజులో ఉన్నవారు వెనుకబడ్డ ప్రాంతాలను ఏం చేస్తారు? రాష్ట్ర విభజన సందర్భంగా చర్చ అంతా హైదరాబాద్ చుట్టే ఎందుకు తిరిగింది? పెట్టుబడిదారుల అభివృద్ధిని ప్రజల అభివృద్ధిగా చూపించే ప్రపంచబ్యాంకు అభివృద్ధి నమూనా ఫలితమది. ఒకవైపు హైదారాబాదు మహానగరం అభివృద్ధి, మరో వైపు రాయలసీమ, ఉత్తరాంధ్ర, తెలంగాణ వెనుక బాటుతనం ఏకకాలంలో జరిగాయి. గిరిజన ప్రాంతాలను ఎక్కడా పట్టించుకోలేదు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, తెలంగాణ సాగునీటి సమస్యలను పట్టించుకున్న నాధుడు లేడు. విడిపోయిన తరువాత కూడా రెండు ప్రాంతా ల్లోనూ ప్రాంతీయ అసమానతలు కొనసాగే అవకాశం ఉంది. మండల ప్రాతిపదిక పైన అభివృద్ధి సూచికలను పరిగణలోకి తీసుకోవ డానికి పాలకులు సిద్ధపడతారా?

ఎన్నికల సందర్భంగా ప్రధాన పార్టీలు అనేక సంక్షేమ పథకాలు ప్రకటించాయి. నిజంగా అమలు జరుపుతాయా? సరళీకృత ఆర్థిక విధానాలకు, సంక్షేమ పథకాలకు పొసగదు. అస్థిర రాజకీయ పరిస్థితులలో తమ అస్థిత్వం కాపాడుకోవడం కోసమైనా కొన్ని సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చు. కానీ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంతో ప్రజల సంక్షేమం సాధ్యమా? సంక్షేమ పథకాలు కూడా అవినీతి కూపాలుగా మారడం సహజమేకాదా! సంక్షేమం కోసం కేటాయించిన సొమ్ములో కూడా సింహభాగం అవినీతిపరుల కైంకర్యం కావడం చూస్తూనే ఉన్నాం. రైతులకు గిట్టుబాటు ధరలు, పరపతి సౌకర్యాలు, కౌలు రైతుల హక్కులు, కూలీల సమస్యలు, కార్మిక చట్టాలు, సమగ్రాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, వృత్తిదారులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి అవకాశాలు కల్పించడం ముఖ్యమైన సమస్యలుగా ముందుకొస్తాయి. కులవివక్ష, మహిళలకు భద్రత వంటి సమస్యలు పరిష్కరించవలసి ఉంటుంది. మతోన్మాద శక్తులు పుంజుకొని లౌకికతత్వానికి, మత సామరస్యానికి ముప్పు ఏర్పడవచ్చు. అందుకే మభ్యపెట్టే వాగ్దానాలతో ప్రయోజనం లేదు. సరళీకృత విధానాల పరిధిలో మౌలిక సమస్యలు పరిష్కారం కావు. రెండు రాష్ట్రాల్లోనూ కొత్త ప్రభుత్వాలు పాత విధానాలకే కట్టుబడి పని చేస్తాయి. అందుకే నూతన రాష్ట్రాలలో ప్రజల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత ప్రజల మీదనే ఉన్నది. ●

# పాలక వర్గాల చేత, పాలక వర్గాల కోసం

(12వ పేజీ తరువాయి)

రక్షించే విధానాలను రూపొందించేందుకు అక్కడ పోటీ ఏర్పడుతుంది. 'మెజారిటీ వచ్చిన వ్యక్తి ఎన్నికయ్యే పద్ధతి'లో ఒకసారి గనుక ఎన్నిక ముగిస్తే పార్లమెంటులో విధానపరమైన అంశాలపై చర్చించేందుకు ప్రజా ప్రతినిధులను ఒప్పించే అంశం ఏమీ లేదు. ప్రభుత్వం ప్రజలపై పెద్దగా ప్రభావం చూపించే విధానాలను (ఎమర్జెన్సీ విధించడం, నయా-ఉదారవాద విధానాలు అమలు చేయడం వగైరా) పార్లమెంటులో ఎన్నడూ చర్చించకుండానే అమలు జరిపేస్తున్నాయి.

'మెజారిటీ వచ్చిన వ్యక్తి ఎన్నికయ్యే పద్ధతి'లో ఎన్నికైన అభ్యర్థికి కనీసం సగం ఓట్లు కూడా రావు. సైద్ధాంతికంగా ఇదో వికృతి. దమాషా పద్ధతిలో దీన్ని అధిగమించవచ్చు. ప్రధానమైన అనేక గ్రూపులకు ఇందులో తమ వంతు ప్రాతినిధ్యం లభిస్తుంది. 'మెజారిటీ వచ్చిన వ్యక్తి ఎన్నికయ్యే పద్ధతి'లో తీవ్రమైన పోటీ, దానివల్ల భారీగా ఖర్చుచేయడం, దాని వల్ల అవినీతి పెరగిపోవడం అనేది దామాషా పద్ధతిలో ఉండదు. మరీ ముఖ్యమైనదేమంటే, భారత దేశ పరిస్థితుల్లో ప్రజలను కులం, మతం పేరుతో విభజించాలన్న పాలక వర్గాల దుష్ట తలంపులకు ఇది కళ్లెం వేస్తుంది.

ఉదాహరణకు దామాషా పద్ధతిలో దళితులకు రిజర్వు నియోజకవర్గాల అవసరం ఉండదు, అందువల్ల దళిత్ అనే టాగ్ అవసరం కూడా ఉండదు. దీనివల్ల రాజకీయాల్లో కులం ప్రధాన పాత్ర పోషించే పరిస్థితి మారుతుంది. అయితే ఏ పద్ధతిలోనైనా తప్పులు చేసేవారికి అవకాశాలు లేకుండా పోతాయని చెప్పలేం గానీ, దామాషా పద్ధతిలో వారికి వారి వాటా ప్రాతి నిధ్యం లభిస్తుంది కాబట్టి ఈ పద్ధతిలో అటువంటి వనులకు అవకాశాలు కుంచించుకుపోతాయి. పూనా ఒప్పందంలో గాంధీ బ్లాక్‌మెయిల్ చేశా రని దళితులు అనేక సంవత్సరాలుగా చెబుతున్నా రుగానీ, 'మెజారిటీ వచ్చిన వ్యక్తి ఎన్నికయ్యే పద్ధతి'లో అదే తిరిగి వచ్చి చేరిందని అర్థం చేసుకోవడం లేదు. దామాషా పద్ధతిలో అది తన ప్రాసంగికతను కోల్పోతుంది. దీన్ని ఇంకా కొనసాగిస్తే కుల అస్థిత్వాలనూ, వాటివల్ల వచ్చే అనేక సమస్యలనూ కాపాడుకోవాల్సిన అవసరా న్ని కూడా లేకుండా చేస్తుంది.

నిజానికి దామాషా పద్ధతి వల్ల భారత దేశం చాలా లాభపడుతుంది. కాని అప్పుడు పాలక వర్గాల సంగతేమవుతుంది? ●

**ప్రపంచ గమనం**

# ఉక్రెయిన్ పరిణామాలు ఫాసిజం ప్రమాద సూచికలు



రచయిత ప్రఖ్యాత మార్క్సిస్టు సిద్ధాంత వేత్త, రాజకీయ వ్యాఖ్యాత. ప్రస్తుతం ఆయన న్యూఢిల్లీ లోని నెహ్రూ స్మారక మ్యూజియంలో వర్తమాన అధ్యయన కేంద్రం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

**ఐజాజ్ అహ్మద్**

*1919లో ... లెనిన్ (ఉక్రెయిన్‌ను సంతుష్టపర్చటానికి) రష్యాకు చెందిన అనేక భూభాగాలను వదులుకున్నారు. చారిత్రకంగా చూసినపుడు ఉక్రెయిన్ భూభాగాలు నిజానికి ఉక్రెయిన్‌కి చెందినవే కాదు. నేటి ఉక్రెయిన్‌లోని దక్షిణ, తూర్పు ప్రాంతాల గురించి మాట్లాడు తున్నాను... 1954లో కృశ్చేవ్ క్రిమియాను ఉక్రెయిన్‌కు బహుమతిగా ఇచ్చేశారు... ఈ విధంగా పరస్పరం కలిసిమెలిసి జీవిస్తున్న స్లావిక్ ప్రజలను హఠాత్తుగా చీల్చడం వల్ల కొత్తగా ఏర్పడిన సరిహద్దులు లక్షలాది కుటుంబాల మధ్య సంబంధ బాంధవ్యాలను తెగ్గొట్టాయి. ఇది ఆమోదయోగ్యమైనదేనా? నేను స్వయంగా సగం ఉక్రెయిన్ జాతీయుడిని. ఉక్రెయిన్ ఉపన్యాసాలు వింటూ పెరిగాను.*

**– అలెగ్జాండర్ సొల్జెనిట్సిన్, నోబెల్ బహుమతి గ్రహీత, 1994, మే 9న ఇచ్చిన ఇంటర్వ్యూ నుండి.**

*అమెరికాలో కొందరు ప్రయోగశాలలో కూర్చుని ప్రయోగాలు చేస్తుంటారు. ఆ ప్రయోగాల పర్యవసానాలు ఏమిటన్నది వారికి సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తారని నాకు అప్పుడప్పుడూ అనిపిస్తుంది.*

**– వ్లదిమీర్ పుతిన్, రష్యా అధ్యక్షులు, మార్చి 4, 2014 ప్రకటన**

అలెగ్జాండర్ సొల్జెనిట్సిన్ పేరు మోసిన కమ్యూనిస్టు వ్యతిరేకి. స్టాలిన్ కాలం నాటి చర్యల గురించి ప్రస్తావించటానికి 'గులగ్' అన్న పదాన్ని అంతర్జాతీయ పదకోశంలో చేర్చిన వ్యక్తి ఇతను. సోవియట్ వ్యతిరేక చర్యల్లో భాగంగా నవలా రచయిత అయిన అలెగ్జాండర్ సొల్జెనిట్సిన్‌కు 1994లో నోబెల్ బహుమతికి అభించింది. అయితే ఆయన సృజనాత్మకతను బోరిస్ పాస్టర్నాక్, ప్రఖ్యాత మార్క్సిస్టు తత్వవేత్త జార్జి లూకాస్ గుర్తించారు. సోవియట్ రష్యా పతనం అనంతరం 1994లో అలెగ్జాండర్ సొల్జెనిట్సిన్ ఇచ్చిన ఇంటర్వ్యూ నుండి పైన ఉదహరించిన వాక్యాలు సంగ్రహించబడ్డాయి. సదరు ఇంటర్వ్యూలో రష్యా పతనం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. అప్పటికి ఉక్రెయిన్ ఇంకా సోవియట్ రిపబ్లిక్‌లో అంతర్భాగంగానే ఉంది. అప్పటికే గణనీయమైన స్థాయిలో రష్యా మాట్లాడే ప్రజలు నివశిస్తున్న ప్రాంతాలనూ, రష్యా భూభాగాన్నీ ఉక్రెయిన్‌కు బదలాయించటం ద్వారా ఉక్రెయిన్ భూభాగాన్ని పొరపాటున విస్తరించారని ఆయన విచారం వ్యక్తం చేశారు. తదనంతరం రష్యాలో కమ్యూనిస్టు ప్రభుత్వం పతనం కావటంతో రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య అనవసరంగా సరిహద్దులు చీలిపోయాయి. (దాంతో స్లోవిక్ తెగ ప్రజల మధ్య హఠాత్తుగా మూర్ఖంగా విభజన ఏర్పడింది. తద్వారా లక్షలాది మంది కుటుంబ సంబంధాలు, స్నేహ సంబంధాలు ఒక్కసారిగా తెగిపోయాయి)

క్రిమియా రాష్ట్రంలో తాజాగా ప్రజాభిప్రాయం సేకరించిన తర్వాత ఈ ప్రాంతం రష్యాలో తిరిగి విలీనం అయ్యాక ఒక చారిత్రక తప్పిదాన్ని సరిచేయటం జరిగిందని రష్యా మాజీ అధ్యక్షుడు మిఖాయిల్ గోర్బచెవ్ వ్యాఖ్యానించాడు. ఈయన సోవియట్ యూనియన్ విధ్వంసానికి పునాదులు వేసిన వ్యక్తి మనకు తెలుసు.

సోవియట్ రష్యా పతనం తర్వాత స్లావిక్ ప్రజలను ఎలా 'కలగలిపేశారు', సరిహద్దులనూ, ప్రజలనూ ఎలా 'ముక్కలు చేశారు' అన్న విషయాలు తర్వాత పరిశీలిద్దాం. 2014 ఫిబ్రవరిలో అమెరికా సహాయ సహకారాలతో యూరో–నాజీ కుట్రద్వారా ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో అధికారం చేతులు మారితే, దానికి సమాధానంగా మార్చిలో క్రిమియా ప్రాంతాన్ని తిరిగి రష్యాలో విలీనం చేయటం సోవియట్ అనంతర చరిత్రలో ఒక చారిత్రక పరిణామం అని మాత్రం చెప్తే సరిపోతుంది.

ముందుగా ఈ వినూత్న పరిణామాల్లోని మౌలిక అంశాలను ప్రస్తావించి తర్వాత వాటిపై వ్యాఖ్యానిస్తాను.


1. చైనా చుట్టూ చక్రబంధం బిగించే లక్ష్యంతో అమెరికా అధ్యక్షులు బరాక్ ఒబామా ఆసియా వ్యూహాన్ని ప్రకటించిన తదనంతరం రష్యాను కట్టడిచేసే లక్ష్యంతో యూరోపియన్ చక్రవ్యూహం పేరుతో అత్యవసరంగా మరో భౌగోళిక వ్యూహానికి అమెరికా తెరతీసింది. ఈ వ్యూహంలో భాగంగా నాటో పలుకుబడిని రష్యా సరిహద్దుల వరకు విస్తరించటానికి ప్రయత్నించింది. దీనికి అడ్డుగా నిలిచిన ఉక్రెయిన్‌ను కలుపుకోవడం ద్వారా పాత వార్సా ఒప్పందం పరిధిలోని భూభాగాలకూ, కొన్ని చోట్ల రష్యా భూభాగాలకూ నాటో కార్యకలాపాలు విస్తరింపచేసే ప్రయత్నానికి తెరతీసింది.

2. వాషింగ్టన్ అధికార యంత్రాంగంలో శామ్యూల్ హంటింగ్టన్ ప్రతిపాదించిన 'నాగరికతల మధ్య సమరం' సిద్ధాంతం ప్రభావం మెండుగా ఉంది. ఈ సిద్ధాంతంలో భాగంగా హంటింగ్టన్ పిలిచే 'పాశ్చాత్యీకరించబడిన క్రైస్తవానికీ' (పశ్చిమ యూరప్ కేంద్రంగా ఉన్న ప్రొటెస్టెంట్, కాథలిక్ ధోరణులకూ) 'తూర్పు ప్రాంత దేశాలు అనుసరించే క్రైస్తవానికీ' (రష్యా, గ్రీస్, లెవాంటైన్‌లల్లో అనుసరించే ఛాందస క్రైస్తవానికీ) మధ్య అంతరం ఉందని ప్రతిపా

> **"ప్రధానమైన యూరోపియన్ దేశాల్లో అత్యున్నత స్థానాలకు ఈ నయా-నాజీ శక్తులు ఎగబాకటం, దీనికి పాశ్చాత్య దేశాల సంపూర్ణ మద్దతు ఉండటం, యూరప్‌లోని మిగిలిన దేశాల్లో గల ఫాసిస్టు శక్తులకు పెద్ద ఊతమిచ్చే అంశంగా మారింది. మరోవైపున ఈ మితవాద శక్తులను అడ్డు పెట్టుకుని రష్యాను నియంత్రించటానికి ప్రజాస్వామ్య పునరుద్ధరణ పేరుతో అమెరికా ఆడుతున్న నాటకం కొత్త దశకు చేరుకుంది."**

దించాడు. పూర్వపు యుగోస్లోవియాలో సెర్బో-క్రొయేషియా భూభాగం సరిహద్దుగా ఉన్నట్లే యూరప్‌లో ఈ రెండు రకాల క్రైస్తవ ధోరణులకూ ఉక్రెయిన్ సరిహద్దుగా ఉంది. ఈ దేశంలో రెండు ధోరణులూ ఉన్నాయి. కాథలిక్ ఆధిపత్యం ఉన్న క్రోయేషియా ప్రాంతం ఛాందస క్రైస్తవం ఆధిపత్యం ఉన్న సెర్బియా ప్రాంతం నుండి వేరు పడటానికి (అమెరికా నేతృత్వంలో) ఏ విధంగా మద్దతు పలికారో, తద్వారా ఎటు వంటి మారణహోమం సృష్టించబడిందో మనం చూశాము. ఉక్రెయిన్‌ను రష్యాకు వ్యతిరేకంగా... నాటో సైనిక స్థావరాలు ఏర్పాటు చేసే ప్రథమ రంగంగా మార్చటానికి ప్రయత్నం చేయటం ద్వారా అమెరికా ఉద్దేశ్యపూర్వకంగా గానీ, ఉద్దేశ రహితంగా గానీ సెర్బియా-క్రొవేషియా తరహా భ్రాతృహత్యాకాండకు తెరతీయటానికి సిద్ధమైంది. ఒకానొక సమయంలో వీళ్లు ఆఫ్ఘనిస్తాన్‌లో కమ్యూనిస్టు ప్రభావాన్ని నియంత్రించేందుకు అంతర్జాతీయ జీహాదీ సైనాన్ని తయారు చేసిన విషయాన్ని కూడా మనం ఇక్కడ గుర్తుచేసుకోవాలి. ఈ చర్యల పర్యవసానాల నుండి ప్రపంచం ఇంకా బయటపడలేదు. యూరప్‌లోనే తూర్పు, పశ్చిమ ప్రాంతాల మధ్య ఉక్రెయిన్‌లో మరో ఆఫ్ఘనిస్థాన్‌ను సృష్టిస్తే ఏమి జరుగుతుంది?

3. ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ గతం నుండి పతనావస్థలో ఉంది. మూడి రేటింగ్ ఏజెన్సీ అంచనాల ప్రకారం ఉక్రెయిన్ బడ్జెట్ లోటు పూడ్చుకోవటానికీ, గ్యాస్ కొనుగోళ్లకూ, రుణ చెల్లింపులకూ, పెన్షన్‌లకూ కేవలం 2014లోనే 2400 కోట్ల డాలర్లు కావాలి. గత రెండు దశాబ్దాలుగా ఉక్రెయిన్ చేసే గ్యాస్ చమురు కొనుగోళ్లకు గాను రష్యా 20,000 కోట్ల డాలర్ల సబ్సిడీ భరించింది. అంతేకాక కేవలం ఉక్రెయిన్ తటస్థతను కాపాడటం కోసం, దీర్ఘకాలంగా చారిత్రకంగా, భాషా పరంగా, జాతీయత పరంగా భావోద్వేగపూరితమైన సంబంధాలు కలిగిన తన పొరుగున ఉన్న దేశానికి సహాయం చేయటం కోసం రష్యా అనేక రకాలైన



నోబెల్ బహుమతి గ్రహీత అలెగ్జాండర్ సోల్జెనిట్సిన్

రాయితీలు, ఆర్థిక సహకారాలు అందించింది. దీనికి బదులుగా పశ్చిమ దేశాలు అందించింది నామమాత్రపు సాయమే. అది కూడా లాత్వియా, స్లొవేనియా, గ్రీస్ దేశాల తరహాలో ఐఎంఎఫ్ ప్రతిపాదించిన పొదుపు చర్యలు అమలు జరిపితేనే ఆ మాత్రం కుక్క బిస్కెట్లయినా వేయటానికి అమెరికా సిద్ధపడింది. లాత్వియాలో ఐఎంఎఫ్ ప్రతిపాదించిన పొదుపు చర్యల పర్యవసానంగా ఆ దేశ జనాభాలో 10 శాతంగా ఉన్న వృత్తిపరమైన నిపుణులు, మేధావులు ఇతర దేశాలకు వలస పోయి ఆర్థిక నిరాశ్రయులుగా జీవితాలు వెళ్ల దీస్తున్నారు. రష్యా దాతృత్వం లేకుంటే ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ ఏనాడో శిథిలమై ఉండేది. ఈ మధ్య జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో 70 శాతం మంది ఉక్రెయిన్ పౌరులు తమ దేశం నాటోలో అంతర్భాగం కావటాన్ని వ్యతిరేకిస్తూ ఓటు వేశారు. ఈ పరిస్థితుల్లో ఉక్రెయిన్‌లో ఐఎంఎఫ్ ఆదేశిత పొదుపు చర్యలు, నాటో భాగస్వామ్యంతో చోటుచేసుకునే ఆయుధీకరణ, పొరుగు దేశమైన రష్యాతో కలహం వంటి పరిస్థితులు అక్కడ అంతర్యుద్ధానికో, ప్రాంతీయ యుద్ధానికో లేక మరే యుద్ధానికో దారితీయదని ఎవరనుకుంటారు?

### మంచి నాజీలు, చెడ్డ నాజీలు

4. ఒకరిని నాజీ అని గానీ, ఫాసిస్టు అనిగానీ పిలవటం ఇకపై ఏ మాత్రం ఫాషన్ కాబోదు. ఎందుకంటే నాజీ, ఫాసిస్టు శక్తులు యూరప్ రాజకీయ చట్రంలో భాగస్వాములుగా మారారు. తమను తాము ఇప్పుడు వాళ్లు జాతీయ వాదులు అని పిలుచుకుంటున్నారు. మీడియా కూడా వారి వాదనను మన్నించి 'మితవాద జాతీయ వాదులు', 'తీవ్రవాదులు' 'జాతీయ ఛాందసవాదులు' అని గౌరవంగా పిలుస్తోంది. ఏదో సామెత చెప్పినట్టు గులాబికి ఎన్ని రంగులున్నా గులాబియే. క్రొయేషియా, హంగరి, స్లొవేనియా ఇంకా అనేక మాజీ సోషలిస్టు దేశాల్లో ఏర్పడిన ప్రభుత్వాల్లో ఫాసిస్టు వారసత్వం కలిగిన రాజకీయ శక్తులు భాగస్వాములు అయ్యాయి. ఫ్రాన్స్, ఆస్ట్రియా, డెన్మార్క్ వంటి ముఖ్యమైన దేశాల్లో కూడా ఫాసిస్టు ధోరణులు కలిగిన రాజకీయ శక్తులు గణనీయమైన స్థానం ఆక్రమించి ఉన్నాయి. ఇదిలా ఉండగా నాజీ పలుకుబడి కలిగిన శక్తులు జాతీయ భద్రతా వ్యవహారాలను నియంత్రిస్తూ, అమెరికా, యూరోపియన్ యూనియన్ సంపూర్ణ మద్దతు పొందుతున్నాయి. మూడు రకాల నాజీ వారసత్వం కలిగిన వారు ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న తొలి దేశంగా ఉక్రెయిన్ రికార్డు కెక్కింది.

5. ప్రధానమైన యూరోపియన్ దేశాల్లో అత్యున్నత స్థానాలకు ఈ నయా-నాజీ శక్తులు ఎగబాకటం, దీనికి పాశ్చాత్య దేశాల సంపూర్ణ మద్దతు ఉండటం, యూరప్‌లోని మిగిలిన దేశాల్లో గల ఫాసిస్టు శక్తులకు పెద్ద ఊతమిచ్చే అంశంగా మారింది. మరోవైపున ఈ మితవాద శక్తులను అడ్డు పెట్టుకుని రష్యాను నియంత్రించటానికి ప్రజాస్వామ్య పునరుద్ధరణ పేరుతో అమెరికా ఆడుతున్న నాటకం కొత్త దశకు చేరుకుంది. ఆఫ్ఘనిస్తాన్‌లో సోవియట్ వ్యతిరేక పోరాటం సాగించిన 'మంచి జీహాదీ'లను మనం చూశాము. నికరాగువా, ఎల్ సాల్వెడార్, లాటిన్ అమెరికా వామపక్ష శక్తుల్లో 'మంచి మాదకద్రవ్య నియంత్రణ సేనలు'లనూ చూశాము. సిరియాలో శివాలెత్తిన 'మంచి అల్ ఖైదా'లను కూడా చూశాము. వీటన్నింటికీ పరాకాష్టగా ఇప్పుడు యూరోపియన్ నేలమీదనే 'మంచి నాజీలు'ను చూస్తున్నాము.

6. ఉక్రెయిన్‌లో క్రిమియా అంతర్భాగంగా ఉన్నపుడే ఉక్రెయిన్‌లోని సగానికి పైగా జనాభాకు రష్యన్ భాష ప్రథమ ప్రాధాన్యత కలిగిన భాషగా ఉంది. క్రిమియా రష్యాలో విలీనం అయిన తర్వాత కూడా ఉక్రెయిన్‌లో, రష్యా ప్రథమ ప్రాధాన్యత భాషగా ఉన్న ప్రజల సంఖ్య మూడోవంతు ఉంటుంది. వీరు తూర్పు, దక్షిణ ప్రాంతంలో కేంద్రీకరించబడి ఉన్నారు. రష్యన్ అన్న ప్రతిదీ... అది రష్యన్ భాష గానీ,

సంస్కృతి గానీ, ప్రజలు గానీ... ఉక్రెయిన్ పాలకులకు కంటగింపుగా మారింది. దాంతో ఆ దేశంలోని మూడోవంతు ప్రజానీకం నిరంతరం భయాందోళనలతో జీవనం సాగించాల్సిన పరిస్థితులకు నెట్టబడ్డారు. దానివల్ల క్రిమియా ప్రజల మాదిరిగా వీరు కూడా ఉక్రెయిన్ నుండి బయటకు వెళ్లే ప్రత్యామ్నాయాలను వెతుక్కునే స్థితికి నెట్టబడుతున్నారు.. అది శాంతియుతంగా ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా కావచ్చు. భ్రాతృ హింస ద్వారా కావచ్చు. అమెరికా వెనకడుగువేసి తన ఉక్రెయిన్ వ్యూహాన్ని పునఃసమీక్షించుకుంటే తప్ప ఈ పరిణామానికి అంతం ఉండదు. అలా జరగాలంటే ఉక్రెయిన్ ప్రాంతీయ ప్రభుత్వాలకు విస్తృతమైన అధికారాలు అప్పగించాలి. అదొక్కటే సరిపోదు. ఉన్నఫళంగా ఉక్రెయిన్‌కు భారీ ఆర్థిక సహాయం అందాలి. ఇప్పటి వరకు ఉక్రెయిన్ ఆర్థిక భారాన్ని రష్యా మోస్తూ వచ్చింది. ఈ స్థితి నుండి ఐఎంఎఫ్ ఆధారిత పశ్చిమ దేశాల నిధులపై ఆధారపడే స్థితికి నెట్టబడటం అంటే ఆర్థిక సంక్షోభాన్ని పెంచి పోషించటమే అవుతుంది. అటువంటి పరిస్థితుల్లో ఉపప్రాంతీయ స్థాయిలో ఉన్న సామాజిక ప్రాంతీయ సంబంధాలు కూడా తెగిపోయే ప్రమాదం ముంచుకొస్తుంది.

**పశ్చిమ దేశాల రెండు అబద్ధాలు**

7. పశ్చిమ దేశాల్లోని పెద్ద పెద్ద నాయకులు చెప్పే అబద్ధాలను తిరుగు ప్రశ్నించకుండా భుజాన వేసుకుని ప్రచారం చేస్తున్న పాశ్చాత్య మీడియా పట్ల రోనాల్డ్ రీగన్ ప్రభుత్వం అమెరికా ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా పని చేసిన పాల్ క్రెయిగ్ రాబర్ట్స్ లాంటివారే నిర్వేదం వ్యక్తం చేశారు. అటువంటి మీడియా సాధనాలను 'వ్యభిచార మీడియా'గా ('ప్రాస్టిట్యూట్' తరహాలో 'ప్రెస్టిట్యూట్' అని) సంబోధిస్తాడు. తాజా పరిణామాల గురించి మనం అమెరికా ముందుకు తెచ్చిన రెండు అబద్ధాలను చిన్న చిన్న టాబ్లాయిడ్ పత్రికల మొదలు గార్డియన్ వంటి ప్రఖ్యాత పత్రికల వరకు భుజాన వేసుకుని మోయటాన్ని చూడవచ్చు. ఉదారవాద వామపక్ష వాదిగాచెప్పుకునే బిల్ మెహర్ ఫాక్స్ ఛానల్ వ్యాఖ్యానంలోకూడా ఇదే మనకు కనిపిస్తుంది. ఉక్రెయిన్‌లో నూతన ప్రభుత్వం కుట్ర పూరిత తిరుగుబాటు ద్వారా అధికారానికి రాలేదు, రాజ్యాంగ బద్ధంగానే అధికారానికి వచ్చింది అనేది అమెరికా ప్రచారం చేస్తున్న మొదటి అబద్ధం. రష్యా క్రిమియాను ఆక్రమించుకుంది. అక్కడ జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ చట్ట బద్ధం కాదు అనేది రెండో అబద్ధం. ఈ వాదనల్లో

> ❝ మొత్తంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, ప్రత్యేకించి పశ్చిమ దేశాల ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లకుండా రష్యాపై ఆర్థిక పరమైన ఆంక్షలు విధించటం సాధ్యం కాదు అన్నది మన నమ్మకం. ప్రస్తుతం రష్యా ఒక ముఖ్యమైన ఆర్థిక శక్తి. పెద్ద ఆర్థిక శక్తి. యూరోపియన్ దేశాలకూ, రష్యాకూ మధ్య ప్రత్యేకించి రష్యా-జర్మనీల మధ్య ఆర్థిక సంబంధాలు గాఢంగా పెనవేసుకు పోయాయి. అందువల్ల వీటన్నింటినీ కాదని అమెరికా ఏకపక్షంగా రష్యాపై ఆర్థికపరమైన ఆంక్షలు విధించే పరిస్థితి లేదు. ❞




ఉక్రెయిన్‌లో భాగమైన క్రిమియా ప్రజలు రిఫరెండమ్ ద్వారా రష్యాలో కలిసిపోవాలని నిర్ణయించుకున్నారు. ఉక్రెయిన్ దక్షిణ ప్రాంతంలో రష్యన్లు ఎక్కువగా నివసించే అనేక ప్రాంతాలు స్వయం నిర్ణయాధికారం ప్రకటించుకుంటున్నాయి.

వాస్తవాలు అవాస్తవాల గురించి తర్వాత చర్చించుకుందాం. ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సింది ఏమంటే ఈ రెండు అబద్ధాల కారణంగా రష్యాపై ఆంక్షలు విధించాలన్న డిమాండ్లు ముందుకు వచ్చాయి. క్రిమియాలో తాజా పరిణామాలకు పుతిన్‌ని బాధ్యుడిని చేయాలన్న మరో వాదన కూడా కట్టలు తెంచుకొంటోంది.

8. పుతిన్ దేవత ఏమీ కాదు. అదే సమయంలో స్టాలిన్ తర్వాత మరే రష్యా నేతా.. అతను కమ్యూనిస్టు కావచ్చు, కమ్యూనిస్టు వ్యతిరేకి కావచ్చు... ఇంతగా దుష్ప్రచారానికి గురికాలేదంటే ఆశ్యర్యపడాల్సిన పని లేదు. ఈ విషయాన్ని తర్వాత విపులంగా పరిశీలిద్దాం. మొత్తంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, ప్రత్యేకించి పశ్చిమ దేశాల ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లకుండా రష్యాపై ఆర్థిక పరమైన ఆంక్షలు విధించటం సాధ్యం కాదు అన్నది మన నమ్మకం. ప్రస్తుతం రష్యా ఒక ముఖ్యమైన ఆర్థిక శక్తి. పెద్ద ఆర్థిక శక్తి. యూరోపియన్ దేశాలకూ, రష్యాకూ మధ్య ప్రత్యేకించి రష్యా-జర్మనీల మధ్య ఆర్థిక సంబంధాలు గాఢంగా పెనవేసుకుపోయాయి. అందువల్ల వీటన్నింటినీ కాదని అమెరికా ఏకపక్షంగా రష్యాపై ఆర్థికపరమైన ఆంక్షలు విధించే పరిస్థితి లేదు.


9. ఈ వెసులుబాటు లేని అమెరికా ప్రస్తుతం ఏమిచేయనుంది? రెండు చర్యలకు పాల్పడే అవకాశం ఉంది. రష్యా దాడి అన్న అబద్ధాన్ని మరింత మసిపూసి మారేడు కాయ చేసి దురాక్రమణ దారుగా మారిన రష్యా వల్ల ఇరుగు పొరుగు దేశాల భద్రతకు ముప్పు ఉంది అన్న వాదన ముందుకు తెచ్చే అవకాశం

> **❝రష్యా చైనాల మధ్య మైత్రి అమెరికా సామ్రాజ్యవాదానికి పెద్ద దెబ్బ. ప్రపంచంలో అత్యంత విస్తారమైన ఇంధన వనరులు రష్యా ఆధీనంలో ఉన్నాయి. ఏరకమైన మార్కెట్‌నైనా పాదాక్రాంతం చేసుకోగల పెట్టుబడి శక్తి చైనా చేతుల్లో ఉంది. మామూలుగా అయితే ఈ రెండు శక్తుల మధ్య ఇవాళ కాక పోతే రేపు ఏకాభిప్రాయం రావల్సిందే. కలిసి పని చేసుకోవాల్సిందే. కానీ అమెరికా దురహంకారం వల్ల రేపు జరగాల్సిన పరిణామాలు ఈ రోజే జరుగుతున్నాయి.❞**

ఉంది. ప్రత్యేకించి మధ్య ఆసియా ప్రాంతంలోని 'స్థాన్‌లకు' (కజికిస్థాన్, కిర్గిజిస్థాన్, ఉజ్బెకిస్థాన్ వగైరాలకు) ముప్పు వాంది అని భయపెట్టవచ్చు. ఇవన్నీ ఒకప్పుడు సోవియట్ రష్యాలో అంతర్భాగమే. ఈ దేశాల విషయంలో అమెరికాకు మరో అనుకూలమైన అంశం ఏమిటంటే ఇవి భౌగోళికంగా చైనాకు దగ్గరగా ఉన్నాయి.

10. పుతిన్‌ను అడాల్ఫ్ హిట్లర్, స్టాలిన్, ఖొమైనీ, సద్దాం హుస్సేన్, మహ్మద్ గడ్డాఫి, బషర్ అల్ అసద్ వంటి నాయకుల సరసన చేర్చి ప్రజాస్వామ్యం కోసం, నియంతృత్వానికీ, అవినీతికీ వ్యతిరేకంగా... కొన్ని ప్రాంతాల్లో రంగు విప్లవాలకు ఆజ్యం పోసినట్లు రష్యాలో అంతర్గత తిరుగుబాట్లు లేవనెత్తే అవకాశం ఉంది. పోలండ్, రుమేనియా దేశాల్లోకి ఒకవైపు అణ్వాయుధాలు వచ్చి చేరుతుంటే మరోవైపు మాస్కో వీధుల్లో కనిపించే ప్రజా నిరసనల కోసం మనం ఎదురుచూద్దాం. ఎవరికి తెలుసు, ఈ అణ్వాయుధాలు ఉక్రెయిన్ వీధుల్లోకి కూడా చేరవచ్చు.

11. రష్యాలోని ఆధిపత్య వర్గపు సాంస్కృతిక చరిత్రలో ఒక వైరుధ్యం అపరిష్కృతంగా ఉండిపోయింది. ఈ వైరుధ్యం భారతదేశ పరిస్థితులకు దగ్గరగా ఉంటుంది. రష్యా ప్రజలు తమ ఛాందస చర్చి సాంప్రదాయాల పట్ల అపరిమిత గర్వం వ్యక్తం చేస్తుంటారు. స్లావిక్ ప్రత్యేకత పట్ల, భౌగోళిక వైశాల్యం, ఆ దేశపు నగరాలకు వాన్న విశిష్టమైన చరిత్ర, మధ్య యుగాల నాటి కళలు, భిన్నత్వంలో ఏకత్వం వంటి ఇంకా అనేక లక్షణాలు, ప్రత్యేకతల పట్ల ఆ దేశపౌరులు గర్వపడుతుంటారు. అదే సమయంలో ఈ గర్వానికి గల కారణాలన్నీ యూరోపియన్ ప్రాంతంలోని రష్యాలోనే కేంద్రీకృతమై ఉన్నాయి. అయినప్పటికీ తాము పూర్తిగా యూరోపియన్ వాసులం కాలేక పోయామన్న కించిత్ బాధ వాళ్లను వెన్నాడుతూ ఉంటుంది. రష్యా మొత్తం భూభాగంలో గణనీయమైన ప్రాంతం ఆసియా/ప్రాచ్యంగానే పరిగణించబడుతుంది. వీళ్లు యూరోపియన్లయిన



రష్యా అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్

ఫ్రెంచివాసుల వలె బాధపడుతుంటారు. తమను తాముగా గుర్తించాలనే కోరిక ఒక వైపు వెన్నాడుతూనే ఉండగా మరోవైపున పొరపాటున తమను తాము పారిస్ వాసులుగా భావించుకుంటూ ఉంటారు. ఆధునిక పెట్టుబడిదారీ విధానం వాద్భవించిన అనేక జాతీయవాద దేశాలకు ఉన్న విలక్షణమైన లక్షణం ఇది. తాము తక్కువ వాళ్లైనందునే అధికులమనే భావనకు తొందరగా గురవుతారు. ఇదే పరిస్థితి పతాక స్థాయిలో కెమాలిజం, (టర్కీలో ముస్తాఫా కెమాల్ అటాటుర్క్ ప్రవేశపెట్టిన పాలనా విధానం) నెహ్రూవియనిజం (జవహర్‌లాల్ నెహ్రూ పాలనా విధానం) మొదలు పరిమిత స్థాయిలో జాతీయ ఛాందసవాదం మనకు ఎల్లెడలా కనిపిస్తుంది. అయితే దీనికి కొన్ని దేశాల విషయంలో రష్యా, టర్కీ, భారత దేశాలకు ఉన్న గొప్పదనంతో పోలిక లేక పోవచ్చు. ఈ ధోరణి జారిస్టు రష్యాలోని ఉన్నత వర్గాల్లో నిద్రాణంగా, సిగ్గుపడుతూ దాగి ఉంది. కార్మికవర్గం, రైతాంగానికి పెద్దపీట వేసిన బోల్షివిక్ ప్రాబల్యం పెరిగిన సమయంలో ఈ ధోరణులు అదుపులో ఉంచబడ్డాయి. బోల్షివిక్కులు యూరోపియన్ పెట్టుబడిదారీ వ్యవస్థపై రాజకీయంగా తిరగబడడమే కాదు సాంస్కృతికంగా కూడా తిరగబడ్డారు. సోవియట్ పతనంతో ఒక నూతన వర్గం ఆవిర్భవించే దశలో తిరిగి ఈ జాతీయ ఛాందసవాదం ముందుకొచ్చింది. దీనికి సంబంధించిన తొలి సంకేతం గోర్బచెవ్ ప్రతీఘాత విప్లవ కాలంలోనే తెరమీదకు వచ్చింది. అప్పట్లో గోర్బచెవ్ "మన ఉమ్మడి యూరోపియన్ నివాసం" అన్న నినాదం ఇచ్చాడు. పుతిన్ సమస్య కూడా అదే. ఇప్పటికీ ఆయన 'మన అమెరికా, యూరప్ భాగస్వాములు' అని వ్యాఖ్యానిస్తూ ఉంటారు. 19వ శతాబ్దపు రష్యన్ బూర్జువావర్గం ప్రభావం ఇంకా పుతిన్‌ను వెంటాడుతూనే ఉంది.

12. రష్యా తమలో ఒకటి కాదనీ, తమకంటే దిగువ స్థాయికి చెందినదనీ, దానికి గుణపాఠం నేర్పాలనీ అమెరికా నిర్ణయించుకున్నప్పుడు ఏమవుతుంది? తాను యూరోపియన్ వాసినే అని పుతిన్ తనను తాను గుర్తించుకున్నప్పటికీ రష్యా నిజానికి యూరోపియన్ కుటుంబానికి చెందినది కాదు. నిజానికి రష్యా సాంస్కృతికంగా సెంట్ పీటర్స్‌బర్గ్, వ్లదివోస్టోక్‌ల మధ్య చీలిపోయి ఉంది. జి-8 దేశాల కూటమి నుండి రష్యా చీత్కారానికి గురైంది. ఈ కూటమి తమను తాము ఏడు సంపన్న దేశాల కూటమిగానే పునర్నిర్వచించుకుంటోంది. మరో వైపు 20 దేశాల కూటమిలో రష్యా సభ్యత్వానికి బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా దేశాలు, అలీనోద్యమ దేశాలు మద్దతిస్తున్నాయి. ఇలాంటి స్థితిలో పుతిన్ షాంఘై సహకార మండలి సమావేశాలను గుర్తు తెచ్చుకుంటాడా అన్నది ప్రశ్న? పశ్చిమ దేశాలు రష్యా చెంపఛెళ్లు మనిపించినా ఆ దేశ బూర్జువావర్గం మాత్రం తమను తాము పాశ్చాత్య దేశాలకు దగ్గరి వాళ్లుగా చూసుకుంటూ ఉంటారు. ప్రస్తుతం పలుకుబడితగ్గిపోతూ, ఏదో ఒకటి చేయాలన్న రందీలో వాన్న సామ్రాజ్యవాదం రష్యా స్వాభిమానాన్ని దారుణంగా దెబ్బతీసింది. అదే సమయంలో అపరిమితమైన చమురు, సహజవాయువు నిల్వలతో రష్యా కొత్త ఆర్థిక శక్తిగా ఎదుగుతోంది. మరోవైపు దాని పొరుగునే సుదీర్ఘ సరిహద్దు కలిగిన చైనా విస్తారమైన పెట్టుబడినిల్వలలు కలిగి వాంది. అయితే అది ఇంధన వనరుల ప్రపంచ మార్కెట్లపై అదుపు కలిగిన శక్తుల చేత ఇబ్బందులకు గురవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పుతినూ, యూరో-రష్యన్ బూర్జువా వర్గమూ తూర్పు దేశాలవైపు (చైనా వగైరాల వైపు) నిర్ణయాత్మకంగా, వ్యూహాత్మకంగా దృష్టి సారిస్తుందా అన్నదే ప్రశ్న.

**భారతదేశం, చైనాల పట్ల ప్రశంసలు**

13. రష్యా పార్లమెంట్ అయిన డ్యూమాను ఉద్దేశించి మార్చి 18న పుతిన్ చేసిన ప్రసంగంలో ఆచితూచి పదాలు ఉపయోగించాడు. "చైనా ప్రజలకు ధన్యవాదాలు. ఉక్రెయిన్, క్రిమియా పరిస్థితులను పరిగణించేటపుడు చైనా ప్రజలు

పూర్తి చారిత్రక, రాజకీయ నేపథ్యంలో పరిశీలించి స్పందించారు. భారతదేశం అనుసరించిన నిష్పాక్షిక వస్తుగత ధోరణికి వారిని అభినందిస్తున్నాను." అన్నారు. వేరే ఏ దేశం గురించీ తన ఉపన్యాసంలో ప్రస్తావించలేదు. భారతదేశం తటస్థతట పాటించినందుకు ప్రశంసలు, చైనాపై పూర్తి స్థాయి ప్రశంసల వర్షం కురిపించటం తప్ప వేరే ఏ దేశానికీ ధన్యవాదాలు చెప్పలేదు. రష్యాలోని ఇంధన వనరులు పైప్‌లైన్ల ద్వారా చైనా పారిశ్రామికప్రాంతాలకు సరఫరా చేయాలని అప్పటికే రష్యా-చైనాలు అంగీకారానికి వచ్చాయి. ఈ సంవత్సరం మేలో పుతిన్ చైనా పర్యటనకు వెళ్లనున్నారు. ఉక్రెయిన్‌లో ఐఎంఎఫ్ తాబేదారులు, నయా-నాజీ శక్తుల కూటమిని గద్దెనెక్కించిన తర్వాత అమెరికా వేగంగా పావులు కదిపినా క్రిమియా ప్రజల నిర్ణయాత్మక ఓటు, రష్యా ప్రభుత్వం కృతనిశ్చయం నేపథ్యంలో ఎలా ముందడుగు వేయాలో తెలీని స్థితికి చేరింది. దీనికి తోడు యూరోపియన్ ప్రభుత్వాలు గతంలో ఎన్నడూ లేని విధంగా రష్యా తమ పట్ల ఏ విధంగా వ్యవహరించనుందో అన్న భయాందోళనలకు లోనుకావటంతో అమెరికా పరిస్థితి మరింత సంకటంగా మారింది. 600 జర్మనీ కంపెనీలు రష్యాలో వాణిజ్య కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. వందల బిలియన్ డాలర్ల జర్మనీ పెట్టుబడులు రష్యాలో ఉండటంతో జర్మనీ అధ్యక్షులు మర్కెల్ పరిస్థితి గొంతులో వెలక్కాయ పడ్డట్టు అయ్యింది. మాట రావటం లేదు. జర్మనీ ఎలా ప్రవర్తిస్తుందో చూశాక తాము స్పందించవచ్చని మిగిలిన యూరోపియన్ దేశాలు మిన్నకుండిపోయాయి.

**❝ తన ఆర్థిక శక్తి నానాటికీ దిగజారుతున్నప్పటికీ అమెరికా నేటికీ భూమ్మీద సైనికంగా, ఆయుధీకరణ పరంగా అత్యంత శక్తివంతమైనదేశంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా అమెరికా సైనిక స్థావరాలు ఎంతగా విస్తరించి ఉన్నాయంటే అమెరికా తర్వాతి పది స్థానాల్లో ఉన్న దేశాల మొత్తం సైనిక శక్తిని ఏకం చేసినా అమెరికా సైనిక శక్తితో పోటీ పడే పరిస్థితి లేదు. అందువల్ల ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డప్పుడు సైనిక శక్తి ద్వారా ఫలితాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవటానికి అమెరికా ప్రయత్నిస్తుంది. ❞**



**ఉక్రెయిన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కర్కీవ్ నగరంలోని లెనిన్ విగ్రహం ఎదుట ప్రదర్శన చేస్తున్న నిరసన కారులు. ఉక్రెయిన్‌లో ఎన్నికైన ప్రభుత్వాన్ని తిరుగుబాటుద్వారా కూలదోసిన అమెరికా అనుకూల మితవాద శక్తులు అనేక చోట్ల లెనిన్ విగ్రహాలను కూలగొట్టాయి.**

14. రష్యా చైనాల మధ్య మైత్రి అమెరికా సామ్రాజ్యవాదానికి పెద్ద దెబ్బ. ప్రపంచంలో అత్యంత విస్తారమైన ఇంధన వనరులు రష్యా ఆధీనంలో ఉన్నాయి. ఏరకమైన మార్కెట్‌నైనా పాదాక్రాంతం చేసుకోగల పెట్టుబడి శక్తి చైనా చేతుల్లో ఉంది. మామూలుగా అయితే ఈ రెండు శక్తుల మధ్య ఇవాళ కాకపోతే రేపు ఏకాభిప్రాయం రావల్సిందే. కలిసి పని చేసుకోవాల్సిందే. కానీ అమెరికా దురహంకారం వల్ల రేపు జరగాల్సిన పరిణామాలు ఈ రోజే జరుగుతున్నాయి. ఈ ప్రత్యేక పరిస్థితులు రష్యా, చైనాలకు కూడా వర్తిస్తాయి. రష్యా, చైనాలు రెండూ అడపాదడపా అమెరికాకు జూనియర్ భాగస్వామిగా ఉండటానికి సంసిద్ధత వ్యక్తం చేసినప్పటికీ అమెరికా అందుకు సిద్ధపడలేదు. ఆయా దేశాలకు వాటి స్థాయికి తగ్గ పాత్రను అంతర్జాతీయ వ్యవహారాల్లో ఇవ్వలేదు. అది ఊహించిన పరిణామమే. పురోగమిస్తున్న శక్తులు పతనమవుతున్న శక్తుల మధ్య అధికార బదలాయింపు దశ వచ్చే వరకూ ఎదుగుతున్న శక్తి పతనమవుతున్న శక్తుల నీడలో కొంతకాలం ఉండటం క్షేమకరం. ఈ విషయం పతనమవుతున్న శక్తులకు కూడా తెలుసు. అందువల్లనే చైనా, రష్యా పట్ల అమెరికా మితిమీరిన ఆగ్రహం, దౌష్ట్యం ప్రదర్శిస్తున్నది. ఉక్రెయిన్ ఉదంతపు ముఖ్యపర్యవసానంగా రష్యా చైనాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం గట్టిపడిందని చెప్పుకోవచ్చు.

15. తన ఆర్థిక శక్తి నానాటికీ దిగజారుతున్నప్పటికీ అమెరికా నేటికీ భూమ్మీద సైనికంగా, ఆయుధీకరణ పరంగా అత్యంత శక్తివంత మైనదేశంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా అమెరికా సైనిక స్థావరాలు ఎంతగా విస్తరించి ఉన్నాయంటే అమెరికా తర్వాతి పది స్థానాల్లో ఉన్న దేశాల మొత్తం సైనిక శక్తిని ఏకం చేసినా అమెరికా సైనిక శక్తితో పోటీ పడే పరిస్థితి లేదు. అందువల్ల ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డప్పుడు సైనిక శక్తి ద్వారా ఫలితాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవటానికి అమెరికా ప్రయత్నిస్తుంది. సిరియాపై అమెరికా యుద్ధానికి దిగటం వెనక ఒక కారణం ఏమంటే టార్టస్ ప్రాంతంలోని రష్యా నావికాదళ శిబిరాన్ని ఉపయోగించుకునే వీలు లేకుండా ఆటంకం కలిగించటం. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో తిరుగుబాటు ప్రోత్సహించి ఉక్రెయిన్‌ను నాటో కూటమిలో భాగస్వామి అయ్యేలా ఒత్తిడి తేవటం వెనక మరో మౌలిక కారణం ఉంది. క్రిమియా తీరంలోని నల్ల సముద్రం కేంద్రంగా ఉన్న రష్యా నావికాదళ శిబిరాన్ని రష్యా ఉపయోగానికి వీలు లేకుండా అవరోధం సృష్టించటమే ఈ కారణం. నల్ల సముద్రంలో గత 300 ఏళ్లుగా రష్యా నావికా దళ శిబిరం కొనసాగుతోంది. ఈ రకంగా అమెరికా సైనికపరంగా రెచ్చగొట్టుడు చర్యలకు పాల్పడుతూనే ఉంటుంది.

16. వివాదాస్పదమైన, పర్యావరణానికి విఘాతం కలిగించే హైడ్రాలిక్ ఫ్రాక్చరింగ్ టెక్నాలజీ ద్వారా (దీన్నే ఫ్రాకింగ్ అంటున్నారు) కెనడాలోనూ, అమెరికాలోని పశ్చిమ మధ్య ప్రాంతంలోనూ ఉన్న బొగ్గుగనుల్లోని గ్యాస్ నిల్వలు, షేల్ ఆయిల్‌ను అమెరికా బయటకు తీస్తున్నది. దీనిద్వారా రష్యా, సౌదీ అరేబియాలనూ, ఇతర ఇంధన వనరులున్న దేశాలనూ పక్కకు నెట్టి ప్రపంచ ఇంధన శక్తిగా ప్రథమ స్థానాన్ని ఆక్రమించుకోవాలని అమెరికా ఉవ్విళ్లూరుతోంది. రష్యా పట్ల అమెరికా రూపొందించే వ్యూహంలో పూర్తిస్థాయిలో యూరోపియన్ శక్తులు భాగస్వాములు కాకపోవటానికి ప్రధాన ఆటంకం ఆ దేశాలు రష్యా ఇంధన వనరులపై

> **“ తిమొషెంకో ఈ మధ్య ఉక్రెయిన్ పార్లమెంట్ సభ్యులు నెస్టోర్ షుఫ్రిక్‌తో ఫోన్‌లో జరిపిన సంభాషణ యూట్యూబ్ లో విడుదలచేశారు. ఈ సంభాషణలో ఆమె, “అందరూ ఆయుధాలు చేతబట్టి ఈ కట్సాప్‌లను వాళ్ల నాయకుడితో సహా అంతమొందించాలి అన్నారు. (ఉక్రెయిన్ భాషలో రష్యన్లను దూషించటానికి కట్సాప్ అన్న పదం వాపయోగిస్తారు. వాళ్ల నాయకుడు అంటే పుతిన్). ”**

ఆధారపడాల్సిరావటమే. అయితే తాత్కాలికంగా తన వ్యూహాత్మక నిల్వల నుండి యూరోపియన్ దేశాలకు అవసరమైన ఇంధనం సరఫరా చేయటానికి కూడా అమెరికా ముందుకు రావచ్చు. దీర్ఘకాలంలో ఫ్రాకింగ్ టెక్నాలజీతో పెరిగే చమురు నిల్వలల నుండి విచ్చలవిడిగా సరఫరా చేయవచ్చు. ఈ ‘గొప్ప ఆట’ను యూరప్‌లోకి విస్తరించటం వెనక ఇంధన మార్కెట్ ద్వారా రష్యాకు వచ్చే ఆదాయంలో గండి పెట్టటంతో పాటు భవిష్యత్తులో తన ఇంధన ఉత్పత్తులకు యూరోపియన్ మార్కెట్‌ను సిద్ధం చేసుకోవటం అమెరికా ప్రధాన వ్యూహంగా ఉంది.

**ఉక్రెయిన్, క్రిమియా, రష్యా :**
**కలహాల కాపురం**

రష్యా పార్లమెంట్ డ్యూమాలో పుతిన్ మార్చి 18 న చేసిన ప్రసంగంలో మరో నాలుగు వాక్యాలు చూద్దాం. “యువరాజు వ్లదిమీర్‌కు బాప్తిస్మం ఇచ్చిన ప్రాచీన ఖెర్సన్స్ వాన్న ప్రాంతమిది. మౌలిక క్రైస్తవాన్ని అనుసరించి, అమలు చేయటంలో ఆయన అనుసరించిన పద్ధతులు రష్యా, ఉక్రెయిన్, బైలోరస్ ప్రజల ఉమ్మడి సంస్కృతి, నాగరికత, మానవవిలువలును నిర్దేశించాయి. క్రిమియాను రష్యాలో అంతర్భాగంగా చేర్చే ప్రయత్నంలో సాహసోపేతంగా ప్రాణాలు అర్పించిన సైనికుల సమాధులు కూడా క్రిమియాలోనే ఉన్నాయి. ఘన చరిత్ర కలిగిన సెవెస్థపోల్ నగరం కూడా ఇదే. ఇక్కడే రష్యా నల్ల సముద్రపు నావికాదళానికి పునాదులు పడ్డాయి.” తన ఉపన్యాసం ముగింపులో ఆయన “రష్యా నగరాలన్నింటిలోనూ కీవ్ తలమానికం. తల్లివంటిది. ప్రాచీన రుస్ మన ఉమ్మడి సంస్కృతి వనరు. అది లేకుండా మనం పరస్పరం కలిసి జీవించలేము” అని అన్నారు.


యూలియా తిమొషెంకో

పుతిన్ మాటల్లోని తీవ్రత, ఉమ్మడి చరిత్ర, సంస్కృతి గురించిన భావన వ్యాసం ప్రారంభంలో అలెగ్జాండర్ సొల్జెనిట్సిన్ వ్యక్తం చేసిన అభిప్రాయంతో ఏకీభిస్తున్నాయి. ఈ మొత్తం కూడా విస్తరించాలనుకుంటున్న రష్యా దుందుడుకు జాతీయవాదంలో అంతర్భాగమే అని మనం అనుకోవచ్చు. ఈ సందర్భంగా అమెరికాకు చెందిన టుఫ్ట్స్ విశ్వవిద్యాలయ చరిత్ర ఫ్రొఫెసర్ గారీ లియుప్ మాటలను ఇక్కడ ప్రస్తావించు కోవాలి. ఈయన రెండో ప్రాధాన్యత కింద మతాల చరిత్రకూడా బోధిస్తూ ఉంటారు. వాషింగ్టన్ పాలకవర్గం దుందుడుకు చర్యలపట్ల ఆందోళన చెందిన లియుప్...

“పశ్చిమ దేశాలు రష్యా సంస్కృతికి కేంద్ర స్థానం అయిన ఉక్రెయిన్‌ను పశ్చిమ దేశాలతో మమేకం చేసుకోవాలనుకుంటున్నాయని రష్యన్ వాసులు ఎందుకు అనుకుంటున్నారు? 9వ శతాబ్దం ప్రారంభంలో కీవ్ పరిసర ప్రాంతాల్లో నివసించిన రుస్ తెగతో రష్యా సంస్కృతి ప్రారంభమవుతుందని వారికి తెలియదా? నేటి రష్యా, ఉక్రెయిన్‌ల కంటే ముందుగానే కీవ్ ప్రాంతంలో రుస్ ఉందని తెలియదా? 1654 నాటి పెరెస్లావ్ సంధి మేరకు ఉక్రెయిన్ రష్యాలో అంతర్భాగం కావటానికి ముందు కొంత కాలం పోలండ్ ఆధీనంలో వుంది, అంతకు ముందు మంగోలియన్ దండయాత్రలను ఎదుర్కునే క్రమంలోనే ఉక్రెయిన్ స్వతంత్ర అస్థిత్వాన్ని పొందిందన్న విషయం వారికి తెలియదా? ఈ సంధి మేరకు ఉక్రెయిన్ రష్యాలో అంతర్భాగమై స్వతంత్రం పోగొట్టుకుంది. అప్పటినుండి రష్యా సామంత రాజ్యంగానే ఉందన్న విషయం కూడా తెలియదా? రెండు వందల ఏళ్ల పాటు రష్యాకు సామంత రాజ్యంగా ఉన్న ఉక్రెయిన్ తొలుత ద్నీపర్ నదికి పశ్చిమ భాగాన ఉన్న ప్రాంతమే అనీ, బోల్షివిక్ విప్లవం తర్వాత రష్యాలో భాగమైన తూర్పు ప్రాంతాన్ని కూడా కలిపి ఉక్రెనియన్ సోషలిస్టు రిపబ్లిక్‌గా అవతరించిందన్న విషయం పాశ్చాత్య దేశాల వారికి తెలీదా? 1783 వరకు రష్యాలో అంతర్భాగమైన క్రిమియన్ దీవి 1954లో ఉక్రెయిన్‌లో అంతర్భాగంగా మార్చబడిందన్నది కూడా వారికి తెలీదా? కనీసం వాళ్లకు బాబీయార్ అంటే ఏమిటో తెలుసా? సందేహం లేదు. వారికి (పశ్చిమ దేశాల పాలకులకు) చరిత్ర ఏమీ తెలీదు” అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొత్తగా ఉనికిలోకి వచ్చిన ప్రాదేశిక రాజ్యాలు, చరిత్ర పూర్వోత్తరాల్లో తమ పుట్టుక ఉందని చెప్పుకోవటం కోసం ప్రయత్నం చేస్తాయి. నిజానికి ఉక్రెయిన్ స్వతంత్ర సర్వసత్తాక రాజ్యంగా ఉనికిలోకి వచ్చింది కేవలం 20 ఏళ్ల క్రితమే. అదికూడా సంక్షోభ భరిత పరిస్థితుల్లో ఉనికిలోకి వచ్చింది. ఉక్రెయిన్ స్వతంత్ర రాజ్యంగా అవతరించడానికి వెనక సుదీర్ఘ స్వాతంత్ర్య పోరాటం జరగలేదు. ప్రజాభిప్రాయం మేరకు ఏర్పడలేదు. మాస్కోలో కూర్చున్న నేతలు తమ ఆధీనంలోని విశాల భూభాగాలను ఒక్క కలం పోటుతో వుక్రెయిన్‌కు అప్పగించి స్వతంత్ర రాజ్యంగా ప్రకటించారు. తాజాగా క్రిమియా వేరుపడిన తర్వాత కూడా వుక్రెయిన్ తూర్పు ప్రాంతంలో నేటికీ 45 శాతం ప్రజలు రష్యన్ భాష మాట్లాడేవాళ్లే. ఫ్రెంచి భాషను ఉన్నత సంస్కృతికి సంబంధించిన భాషగా భావించిన సెయింట్ పీటర్స్‌బర్గ్ పాలకులు రష్యన్ భాషలో మాట్లాడటానికి బదులు ఫ్రెంచిలో మాట్లాడేవాళ్లు. అలాగే ఉక్రెయిన్ పాలకులు కూడా తమ మాతృభాష కంటే రష్యన్ భాషలో మాట్లాడటానికే ప్రాధాన్యత ఇస్తారు. అ పరిణామాన్ని యులియా తిమోషెంకోను ఉదాహరణగా తీసుకుని వివరించవచ్చు.

యులియా తిమోషెంకో ఉక్రెయిన్ మాజీ ప్రధాన మంత్రి. పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఆమెను ఉక్రెయిన్ న్యాయస్థానం జైల్లో పెట్టింది. తాజాగా జరిగిన భారీ నిరసన ప్రదర్శనల్లో భాగంగా అమెరికా ఒత్తిడితో ఆమె విడుదలైంది. వెనువెంటనే ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోయటానికి జరుగిన ఆందోళనలకు ఆమె నాయకత్వం వహించింది. సాధ్యమైతే తన ప్రధాన మంత్రి పదవి తిరిగి దక్కించుకోవాలని విశ్వప్రయత్నం చేస్తోంది. ఆమె మిలిటెంట్ ఉక్రెయిన్ జాతీయవాది. ప్రజల సమక్షంలో ఆమె ఉక్రేనియన్ భాషలోనే మాట్లాడుతుంది.

తిమొషెంకో ఈ మధ్య ఉక్రెయిన్ పార్లమెంట్ సభ్యులు నెస్టోర్ షుఫ్రిక్‌తో ఫోన్‌లో

జరిపిన సంభాషణ యూట్యూబ్‌లో విడుదల చేశారు. ఈ సంభాషణలో ఆమె, "అందరూ ఆయుధాలు చేతబట్టి ఈ కట్సాప్‌లను వాళ్ల నాయకుడితో సహా అంతమొందించాలి అన్నారు. (ఉక్రెయిన్ భాషలో రష్యన్లను దూషించటానికి కట్సాప్ అన్న పదం ఉపయోగిస్తారు. వాళ్ల నాయకుడు అంటే పుతిన్). తన సంభాషణలో ఆమె ఇంకా, "నాకున్న అన్ని మార్గాలూ, పరిచయాలూ ఉపయోగించి మొత్తం ప్రపంచం రష్యా చర్యలకు ఎదురు నిలిచేటట్లు చేయాలని ప్రయత్నిస్తున్నాను. తద్వారా రష్యన్లకు కనీసం మండుటెడారి కూడా దక్కకుండా చేయాలి" అన్నారు. ఎఎఫ్‌పి వార్త సంస్థ విడుదల చేసిన బులిటెన్‌లో ఉక్రెయిన్‌లోని 80 లక్షల మంది రష్యన్ జాతి పౌరుల పరిస్థితులపై షుఫ్రిక్‌తో చర్చిస్తూ ఆమె "వాళ్లపై అణుదాడి చేయాలని" కూడా ప్రతిపాదించినట్లు వెల్లడించింది. ఈ వీడియో విడుదలపై వెల్లువెత్తిన నిరసనల నేపథ్యంలో ఆ గొంతు తనదేననీ, అయితే అభ్యంతరకర పదాలన్నీ రష్యా నిఘా వర్గాలు తన మాటల్లో జొప్పించి విడుదల చేశాయనీ ఆరోపించారు. విశేషమేమిటంటే ఈ తిమొషెంకో ఉపన్యాసం అంతా ఉక్రెయిన్ భాషలో లేదు. స్పష్టమైన రష్యన్ భాషలో మాట్లాడింది.

పై పేరాల్లో బాబి యార్ గురించి ప్రొఫెసర్ లియుప్ ప్రస్తావించటాన్ని గుర్తు తెచ్చుకుందాం. ఆయన రష్యన్లు, ఉక్రేనీయన్ల ఉమ్మడి సంస్కృతి గురించి ప్రస్తావిస్తూ బాబి యార్‌ను ఉదహరించారు. ఇదేదో చరిత్ర పూర్వకాలం నుండి తవ్వుకొచ్చిన ఉదంతం కాదు. 20 శతాబ్దపు ఉదాహరణను మన ముందుంచటం ద్వారా ఆయన తాజా చరిత్రనే తడుముతున్నారు. అసలు బాబీయార్ అంటే ఏమిటి? వికిపీడియా ఇలా చెప్తోంది.

"బాబీ యార్ అన్నది ఉక్రెయిన్‌లో కీవ్ సమీపంలోని ఒక ఉపనది. ఈ నది ఒడ్డునే రెండో ప్రపంచ యుద్ధ కాలంలో రష్యాకు వ్యతిరేకంగా నాజీ దండయాత్ర సందర్భంగా నాజీ సేనలు వరుస మారణకాండకు పాల్పడ్డాయి. ఈ మారణకాండల్లో అత్యంత ఘోరమైనది 1941 సెప్టెంబరు 29,30, తేదీల్లో జరిగింది. ఈ ఒక్క సంఘటనలోనే 33,771 మంది యూదులను నాజీ సేనలు హతమార్చాయి. ...సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా నాజీ సేనలు చేపట్టి అన్ని దుష్కృత్యాల్లోకీ ఇది అతి పెద్ద దారుణ మారణకాండ. ఇప్పటికు వరకు చరిత్రలో వెలుగు చూసిన మారణకాండల్లో ఒకే సంఘటనలో ఇంత మందిని చంపిన సందర్భం ఇదే... ఈ ప్రాంతంలో ఊచకోతకు గురైన ఇతరుల్లో రష్యా జైళ్లల్లో ఉన్నవారూ, కమ్యూనిస్టులూ, జిప్సీలూ, ఉక్రేనియన్ జాతీయవాదులూ, సాధారణ పౌరులూ ఉన్నారు. ఈ ప్రాంతం జర్మనీ ఆక్రమణలో ఉన్న కాలం లో బాబీ యార్ వద్ద లక్ష నుండి లక్షా యాభై వేల మందిని ఊచకోత కోసి ఉంటారని అంచ నా." నేడు జర్మనీపై ప్రశంసలు కురిపించే వాళ్లే కీవ్‌లో కీలక స్థానాల్లో అధిష్టించి ఉన్నారు.

**"కీవ్‌లో తిరుగుబాటు దారులు ఆక్రమించిన సిటీ హాలు తెల్ల జాతి దురంహకారాన్ని వ్యక్తంచేసే పతాకాలు, జండాలతో నిండిపోయింది. కూలగొట్టిన లెనిన్ స్మారక చిహ్నంపై తిరుగుబాటుదారులు ప్రఖ్యాత నాజీ చిహ్నాలతో కూడిన పతాకాలను ఎగరవేశారు. విక్టర్ యనుకోవిచ్ విలాసవంతమైన తన భవనం నుండి హెలికాప్టర్‌తో పారిపోయిన తర్వాత రెండో ప్రపంచ యుద్ధంలో జర్మన్లపై పోరాడుతూ అసువులుబాసిన వారికి స్మారకంగా నిర్మించిన చిహ్నాలను కూడా తిరుగుబాటుదారులు ధ్వంసం చేశారు."**



ఉక్రెయిన్‌లో మితవాద శక్తులు తిరుగుబాటుద్వారా అధికారం చేపట్టినతరువాత ఫాసిస్టులు బహిరంగంగా నాజీ పతాకాలు పట్టుకు తిరుగుతున్నారు. ఒక ఫుట్‌బాల్ మ్యాచ్‌వద్ద నాజీపతాకంతో ఫాసిస్టుమూకలు

### ఫాసిజం గురించిన సమస్య

కీవ్‌లో విప్లవాన్ని వ్యతిరేకించే శక్తులే ఫాసిజం గురించి గగ్గోలు పెడుతున్నాయని అమెరికా రక్షణశాఖ సహాయ మంత్రి సుసాన్ రైస్ వ్యాఖ్యానించారు.

ఈ ధోరణి మరింత విస్తృతమైనది. ఉక్రెయిన్‌లో ఉన్న సంస్థల్లో ఫాసిస్టు ధోరణులకు పెద్దపీట వేసే రెండు సంస్థల గురించి ఇక్కడ పరిశీలిద్దాం. ఒకటి స్వొబోదా పార్టీ (స్వతంత్ర పార్టీ), మరొకటి ప్రైవియా సెక్టొర్ (మితవాద సెక్టర్). స్వొబోదా 1991లో ప్రారంభమైంది. ప్రారంభంలో దాని పేరు "నేషనల్-సోషల్". నాజీల అసలు పేరు నేషనల్ సోషలిస్టు వర్కర్స్ పార్టీకి జ్ఞాపకంగా ఈ పేరు పెట్టుకున్నారు. 1929లో స్టీఫెన్ బుండేరా ప్రారంభించిన ఉక్రెయిన్ జాతీవాదుల సంస్థకు స్వొబోదా వారసురాలినని చెప్పుకుంటుంది. బుడెరా వైవిధ్య భరితమైన వ్యక్తి. చివరకు నాజీలు ఈయన్ను జైల్లో పెట్టారు. నాజీలతో వైరం తెచ్చుకోవటానికి ముందు వాళ్ల నుండి నేరుగా పెద్దఎత్తున నిధులు సేకరించాడు బుడేరా. నాజీల తరపున రష్యన్లపై యుద్ధానికి రెండు బెటాలియన్ల సైన్యాన్నికూడా ఆయన సమకూర్చాడు. యూదుల ఊచకోత గురించి అధ్యయనం చేస్తున్న పరిశోధనా సంస్థ సిమోన్ వైసెంథాల్ సెంటర్ పరిశోధనల మేరకు వీటిలో ఒక బెటాలియన్ 1941 జూలైలో కీవ్ ప్రాంతంలో 4,000 మంది యూదులను చుట్టుముట్టి నాజీలు వచ్చే వరకు వాళ్లను కదలకుండా ఉంచింది. ఉక్రేనియన్ జాతీయవాదులను స్మరించుకుంటూ ఆ పార్టీ నాయకుడు ఒలెమ్ తహ్నిబోక్, "వాళ్లు పిరికిపందలు కాదు. ఆయుధాలు చేబూని మాస్కోవాసులను, యూదులను, జర్మన్లను వెంటాడుతూ అడువుల్లోకి వెళ్లారు." "మాస్కోవాసులు, యూదుల మాఫియా నుండి" ఉక్రెయిన్‌ను విముక్తి చేయా లని ఆయన తన అనుయాయులకు పిలుపు నిచ్చాడు. తాజాగా 2010లో స్వొబోదా పార్టీ వెబ్‌సైట్‌లో ఇలా ప్రకటించారు :

"తూర్పు దక్షిణ నగరాల్లో నిజమైన ఉక్రేనియన్ ఉక్రెయిన్‌ను నిర్మించటానికి ఏదో ఒక్క చర్య సరిపోదు. మొత్తం పార్లమెంట్‌ను రద్దు చేయాలి. రాజకీయ పార్టీలను నిషేధించాలి. పరిశ్రమలన్నింటినీ జాతీయం చేయాలి. మీడియాను ప్రభుత్వ అజమాయిషీలోకి తీసుకోవాలి. రష్యానుండి ఎటువంటి సాహిత్యమూ ఉక్రెయిన్

“ఉక్రెయిన్‌లో త్యాహ్నిబోక్ ఈ స్థాయికి రావటానికి ముందు ఆయన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన జాన్ మకెయిన్‌తోపాటు ఎన్నికల సభల్లో కనిపించేవాడు. ప్రస్తుతం స్వొబోదా సభ్యులు ఉక్రెయిన్ ప్రభుత్వంలో ప్రాసెక్యూటర్ జనరల్, రక్షణ మంత్రి, ఉప ప్రధాని పదవితో సహా అనేక ముఖ్యమైన పదవులు ఆక్రమించి ఉన్నారు.”

లోకి ప్రవేశించకుండా అడ్డుకోవాలి. పౌరసేవా సిబ్బంది మొత్తాన్ని తొలగించి కొత్తవారిని నియమించాలి. (ప్రత్యేకించి తూర్పు ప్రాంత భూభాగంలో) విద్యా వ్యవస్థ, సైనిక వ్యవస్థలను సమూలంగా మార్చేయాలి. రష్యా భాష మాట్లాడే మేధావులనూ, ఉక్రెయిన్‌లోని వారి అనుయాయులనూ భౌతికంగా నిర్మూలించాలి. (వెంటనే, ఎలాంటి విచారణ లేకుండా. స్వొబొదా పార్టీకిచెందిన ఏ వ్యక్తి అయినా ఉక్రెయిన్‌లో రష్యా అనుయాయులను గుర్తించవచ్చు) ఉక్రెయిన్ రాజకీయ పార్టీలను వ్యతిరేకించే వారినందరినీ హతమార్చాలి” అని బాహాటంగా ప్రకటించింది.

2012లో జరిగిన ఉక్రెనియన్ పార్లమెంట్ ఎన్నికల్లో స్వొబోదా పార్టీ 12 శాతం ఓట్లు, చెప్పుకోదగ్గ సంఖ్యలో సీట్లూ సంపాదించుకు న్నది. ఆ తరువాత 2012 డిశంబరు 13న యూరోపియన్ పార్లమెంట్ ఉక్రెయిన్ పరిస్థితి గురించి ఆమోదించిన తీర్మానంలో ఈ విధంగా పేర్కొన్నది:

“ఉక్రెయిన్‌లో మితవాద స్వొబోదా పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణ రూపంలో జాతీయవాద దురహంకారం పెచ్చరిల్లటం పట్ల యూరోపియన్ పార్లమెంట్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ ఎన్నికల ఫలితంగా ఉక్రెయిన్ పార్లమెంట్‌లోకి ప్రవేశించిన రెండు పార్టీల్లో స్వొబాదా పార్టీ ఒకటిగా ఎదిగింది. జాతీయ దురహంకార, యూదు వ్యతిరేక ఉన్మాద ధోరణులు యూరోపియన్ యూనియన్ ఎంచు కున్న విలువలు సూత్రాలకు వ్యతిరేకం. అందు వల్ల ఉక్రెయిన్ పార్లమెంట్‌లోని స్వొబోదా పార్టీ లక్ష్యాలను ఆమోదించరాదనీ, ఆ పార్టీతో ఎటువంటి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయరాదనీ ప్రజాతంత్ర శక్తులకు పిలుపునిస్తోంది.”

‘రిపబ్లికన్ గుమరాహ్’ అనే అత్యంత ప్రజాదరణ పొందిన పుస్తకం రచయిత మాక్స్ భుమెం థాల్, క్రిమియా తిరుగుబాటు సమయంలో తాను చూసిన పరిణామాలను ఈ విధంగా గ్రంథస్తం చేశారు:

కీవ్‌లో తిరుగుబాటు దారులు ఆక్రమించిన సిటీ హాలు తెల్లజాతి దురహంకారాన్ని వ్యక్తంచేసే పతాకాలు, జండాలతో నిండిపోయింది. కూలగొట్టిన లెనిన్ స్మారక చిహ్నంపై తిరుగుబాటు దారులు ప్రఖ్యాత నాజీ చిహ్నాలతో కూడిన పతాకాలను ఎగరవేశారు. విక్టర్ యనుకోవిచ్ విలాసవంతమైన తన భవనం నుండి హెలికాప్టర్‌తో పారిపోయిన తర్వాత రెండో ప్రపంచ యుద్ధంలో జర్మన్లపై పోరాడుతూ అసువులు బాసిన వారికి స్మారకంగా నిర్మించిన చిహ్నాలను కూడా తిరుగుబాటుదారులు ధ్వంసం చేశారు. మైదాన్ స్క్వేర్‌లో నాజీ చిహ్నాలూ, సీగ్ హెల్ శాల్యూట్‌లూ సాధారణ అంశాలుగా మారాయి. కీవ్‌లోనూ, దాని పరిసరాల్లోనూ నయా–నాజీ శక్తులు స్వతంత్ర ప్రాంతాన్ని ప్రకటించాయి. ఉక్రెయిన్ పార్లమెంట్‌లో 37 సీట్లు సంపాదించిన స్వొబోదా పార్టీ అధినేత త్యాహ్నిబోక్ సహచరుడు యూరీ మైఖేల్‌చిష్న్ గోబెల్స్ వ్యాఖ్యలు పునరుక్తి చేస్తూ కనిపించారు. జోసెఫ్ గోబెల్స్ రాజకీయ పరిశోధనా కేంద్రం అనే పేరుతో ఒక పరిశోధనా కేంద్రాన్నే ప్రారంభించిన వ్యక్తి ఆయన. యూరోపియన్ నయా–ఫాసిజంపై పరిశోధనలు చేస్తున్న విద్యావేత్త పెర్ ఆండర్స్ రుడ్గింగ్, తనను తాను జాతీయ సామ్యవాదిగా చెప్పుకుంటున్న మైఖేల్ చిష్న్ ఇటు స్వొబోదా అధికార విభాగానికీ, అటు మితవాద నాజీశక్తులకూ మధ్య సంధానకర్తగా ఉన్నాడు. ఉక్రెయిన్‌లో అమెరికా రాయమారి జెఫ్రీ ప్యాట్‌తో మైఖేల్ చిష్న్ తాజా సంభాషణ ఒకటి వెలుగు చూసింది. ఈ సంభాషణలో (అమెరికా సహాయ విదేశాంగ మంత్రి) న్యూలాండ్, “మైఖేల్ చిష్న్ బయటే ఉండాలనీ, యనుకోవిచ్ స్థానంలో అమెరికా పనుపున పని చేస్తున్న యత్సెనియుక్‌తో వారానికి నాలుగు సార్లు సంప్రదింపులు జరుపుతూ ఉండాలనీ ప్రతిపాదించింది.”

ఉక్రెయిన్‌లో త్యాహ్నిబోక్ ఈ స్థాయికి రావటానికి ముందు ఆయన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన జాన్ మకెయిన్‌తోపాటు ఎన్నికల సభల్లో కనిపించేవాడు. ప్రస్తుతం స్వొబోదా సభ్యులు ఉక్రెయిన్ ప్రభుత్వంలో ప్రాసెక్యూటర్ జనరల్, రక్షణ మంత్రి, ఉప ప్రధాని పదవితో సహా అనేక ముఖ్యమైన పదవులు ఆక్రమించి ఉన్నారు. తిరుగుబాటులో అత్యంత మిలిటెంట్ దళాలను సమీకరించి ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని కూలదోయటంలో కీలక పాత్ర పోషించిన ‘రైట్ సెక్టార్’ పార్టీ, స్వొబోదా మెతకగా వ్యవహరిస్తోందని విమర్శలు గుప్పిస్తోంది. ఈ పార్టీ దేశీయ భద్రత వ్యవహారాల వంటి కీలక అదుపు చేస్తోంది. అంతర్గత భద్రత, పోలీసు వ్యవస్థ మొత్తం ఈ పార్టీ పడగ నీడన పనిచేయాల్సి ఉంది. ఈ రెండు పార్టీలు మొత్తంగా జాతీయ భద్రత వ్యవహారాలపైనా, ఉక్రెయిన్ ప్రభుత్వం ఆధీనంలో ఉన్న అన్ని రకాల హింసాత్మక సాధనాలపైనా గుత్తాధిపత్యాన్ని సంపాదించాయి. ప్రభుత్వపరంగా అందుబాటులోకి వచ్చిన విధ్వంసక శక్తులతో పాటు తమ ప్రైవేటు నరహంతక సైన్యాలు ఉండనే ఉన్నాయి.

ముఖ్యమైన యూరోపియన్ దేశంలో ఫాసిస్టు, యూదు వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దెనెక్కించటంలో ప్రత్యక్ష పాత్ర పోషించినందుకు గాను త్వరలోనే అమెరికా, యూరోపియన్ శక్తులు సిగ్గుపడాల్సిన పరిస్తితులు తలెత్తనున్నాయి. ఏదో ఒక మిషతో మళ్లీ ఘర్షణ మేఘాలు కమ్ముకోవటం అనివార్యం. సమీప భవిష్యత్తులో రెండు రకాల నిరసనలు తలెత్తనున్నాయి. పాలకవర్గాలు బాహాటంగా ప్రదర్శిస్తున్న రష్యన్ వ్యతిరేకత నేపథ్యంలో రష్యా జాతీయులు మెజారిటీగా ఉన్న తూర్పు ప్రాంతంతో పాటు మైనారిటీగా ఉన్న పశ్చిమ ప్రాంతంలో సైతం అలజడులు చెలరేగనున్నాయి. ఐఎంఎఫ్ ఆదేశిత ఆర్థిక విధానాల పర్యవసానంగా ప్రజలపై మరిన్ని భారాలు పడనున్నాయి. దీంతో అప్పటికే చెలరేగటానికి సిద్ధంగా ఉన్న నిరసనలు ఏరూపం తీసుకుంటాయన్నది స్పష్టంగా చెప్పలేని పరిస్థితి. ఉక్రెయిన్‌లో ప్రజాతంత్ర వ్యవస్థలు చాలా బలహీనంగా ఉన్నాయి. ఉదారవాద శక్తులమని చెప్పుకునే వారందరూ నేరస్తులు, గుత్తేదార్లే. ఒకసారి అధికారాన్ని రుచి మరిగిన ఫాసిస్టులు అంత తేలికగా తమ స్థానాలు ఖాళీ చేస్తారని అనుకోవటం పొరపాటు. వివిధ రకాల సామాజిక అశాంతి పెల్లుబికే పరిస్థితులు ఉండటంతో ఉదారవాదులుగా చెప్పుకుంటున్న వారందరికీ ఈ నయా–ఫాసిస్టులతో సమన్వయం, సహకారం అనివార్యం అయ్యే పరిస్థితులు ఉన్నాయి.

ఒక్క మాటలో చెప్పాలంటే ఉక్రెయిన్ సంక్షోభం ఇప్పుడే మొదలైంది. రానున్న కాలంలో జాతీయ అంతర్జాతీయ పరిణామాలను ఈ సంక్షోభం ఎలా ప్రభావితం చేయనుంది అని ఇప్పుడే నిక్కచ్చిగా చెప్పటం కష్టం.

**(అనువాదం: కె. వీరయ్య)**

అధ్యయనం

# వలస కార్మికులు: మారుతున్న ప్రభావాలు

**అర్చనా ప్రసాద్**

**భా**రతదేశంలో అంతర్గత వలసలు, మురికివాడల వాసుల మీద తాజాగా వెలువడిన రెండు నివేదికలు భారత కార్మికవర్గం భౌగోళిక స్వభావంలో వేగంగా చోటు చేసుకుంటున్న మార్పుల గురించి తెలియ చెబుతున్నాదయి. వ్యవసాయరంగంలో సంక్షోభం పెరిగిపోతున్నందున గ్రామీణ ప్రాంతాల నుండి వలసల తీవ్రత పెరిగిపోతుందనేది అందరూ ఎరిగిన సత్యమే. వలసలు ఏ స్థాయిలో జరుగుతున్నాయి... వాటి సామాజిక లక్షణాలు ఏమిటనేవి అంచనా వెయ్యడానికి 'అంతర్గత వలసలు- సామాజిక సమ్మిళిత స్థితిగతులు' అన్న అంశం మీద యునెస్కో వెలువరించిన నివేదిక, మురికివాడల గురించి 2011 భారత జనాభా గణన నివేదికలను మనం పరిశీలించాలి. శ్రమజీవులు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభ భారాల్నీ, కార్మికవర్గం మీద నయా-ఉదారవాద విధానాల ప్రభావాన్నీ మనకీ నివేదికలు తెలియచేస్తాయి. నయా-ఉదారవాద కార్పొరేట్ పెట్టుబడిదారీ విధానాన్ని సవాలు చెయ్యాల్సిన గ్రామీణ పట్టణ కార్మికవర్గ స్వభావం ఏ రకంగా మారుతుంది అనేది కూడా మనకు ఒక అవగాహన కలుగుతుంది.

### వలసలు-సంక్షోభం

2001 జనాభా లెక్కల ప్రకారం భారత దేశ జనాభాలో 30 శాతం మంది అంతర్గత వలసలు పోతున్నట్లు నమోదైంది. 2007-08 నాటికి ఇది 28.5 శాతానికి తగ్గే అవకాశం వుందని నేషనల్ శాంపిల్ సర్వే సంస్థ అంచనా వేసింది. అయితే 2011 జనాభా గణన నివేదిక మాత్రం వలసలు 33.3 శాతానికి పెరిగే అవకాశం వుందనే అంచనాకు వచ్చింది. భారతదేశంలో 2011 నాటికి 40 కోట్లమంది అంతరత్గత వలసలు పోయే అవకాశం వుందని యునెస్కో అంచనా వేసింది. అయితే ఈ రెండు అంచనాలలోనూ ఒక ప్రధాన లోపం వుంది. స్వల్పకాలిక, సీజనల్ వలసలు ఏ మేరకు వుంటాయనేది ఈ రెండు నివేదికలూ సరిగా అంచనా వెయ్యలేదు. లేబర్ మార్కెట్లకు పునాదే ఇది. గ్రామీణ-పట్టణ ప్రాంతాలు రెండింటా ఇలాంటి సీజనల్ వలసలు పోయేవారిసంఖ్య 10 కోట్లు వుంటుందని ఒక అంచనా. ఇందులో మెజారిటీ జనాభా దళితులూ, ఆదివాసీలే.

గత రెండు దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంత జనజీవనం అతలాకుతలం అయిపోతున్న కారణంగానే వలసలు ఇంత పెద్దఎత్తున వుంటున్నాయి. కుటుంబాలు సహా వలసలు పోవడం 2007-08 నాటికి 36 శాతానికి చేరిందని నేషనల్ శాంపిల్ సర్వే సంస్థ (యన్.ఎస్.ఎస్.బి.) వెల్లడించింది. 1999-2000 నాటికన్నా ఇది 2 శాతం అధికం. వలసల పెరుగుదల రేటు ఇంత అత్యధికంగా వుండడానికి కారణం ఉపాధి వెతుక్కుంటూ పోవడం కాదనీ, మహిళలకు పెళ్ళిళ్లు కావడంతో అత్తవారి ఇళ్ళకో, పెనిమిటి ఊళ్ళకో పోవడం అని ఎన్.ఎస్.ఎస్.ఓ. ఒక వాదన తీసుకొచ్చింది. అయితే యునెస్కో అధ్యయన నివేదిక ఈ వాదనను తోసిపుచ్చింది. పెళ్ళిళ్ళ తరువాత మహిళలు పట్టణ ప్రాంతాలకు వలస వెళ్ళినా రోజువారీ జీవితం గడపడానికి అనివార్యంగా వారు కూడా ఉపాధి వెతుక్కోవాల్సిన పరిస్థితుల్లోనే ఎక్కువమంది ఉన్నారని వివరించింది. అంటే మహిళలకు సంబంధించిన ఉపాధి అంతచనాలకూ, వారి వివాహానంతర వసలకూ దగ్గరి సంబంధం వుందని తెలియవస్తుంది.

2007-08 నాటికి వలసలపై ఎన్ఎస్ఎస్ఓ రూపొందించిన గణాంక పట్టికలను యునెస్కో పునః విశ్లేషించింది. మహిళల్లో వలసలు పెరగడానికి ప్రధాన కారణం ఉపాధి వెతుక్కోవడం కాకపోయినప్పటికీ వలసల అనంతరం మహిళల ఉపాధి రేటు అత్యధికంగా వుందని లెక్కతేల్చింది. 1/5వ వంతు మంది మహిళలు దినసరి కూలి పనులకు పోతున్నారనీ, 43.7 శాతం మందికి ఎలాంటి ఉపాధి లభించడం లేదనీ 36.7 శాతం మంది



రచయిత న్యూఢిల్లీలోని జమియా మిల్లియా ఇస్లామియా విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్. గిరిజన సమస్యలు, పర్యావరణ, ప్రభుత్వ అటవీ విధానాలపై అనేక వ్యాసాలు, పుస్తకాలు రాశారు.

నర్సులు, ఇంటి పనివారల వంటి వృత్తిలో కుదురుకున్నారనీ వివరించింది. ఒకప్పుడు వివాహానంతరం ఇంటి యజమాని ఉపాధి కోసం పట్టణాలకు వలస పోయినా మహిళలు గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి పట్టునే వుండే పరిస్థితి మారిపోయింది. నయా-ఉదారవాద సంస్కరణల అమలు వల్ల గ్రామీణ ప్రాంత సంక్షోభం పెరిగిపోవడంతో మహిళలు కూడా అనివార్యంగా వలసబాట పట్టారు.

### స్వల్పకాలిక వలసలు - లెక్కలోని రాని కార్మికులు

పై వివరాలను బట్టి జనాభా గణన (సైన్సస్)లో స్వల్పకాలిక వలసలను శాస్త్రీయంగా పరిగణనలోకి తీసుకోకపోవడంతో కార్మికుల 'మొబిలిటీ'కి సంబంధించిన స్పష్టమైన చిత్రణ లోపించింది. తాజా ఎన్.ఎస్.ఎస్.ఒ. సర్వేలో ఈ రకమైన స్వల్పకాలిక వలసలు 15.2 కోట్ల దాకా వుండవచద్చని అంచనా వేసింది. 2000-2008 మధ్య కాలంలో 12.4 కోట్లుగా వున్న ఈ సంఖ్య సుమారు 40 శాతం పెరిగింది. అంటే 2008 నుండి ఏటా ఐదు లక్షలమంది అదనంగా వలసబాట పట్టారని తెలియవస్తుంది. ఇందులో 85.1 శాతం మంది మగవాళ్ళు గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు వలస వచ్చారు. మహిళల వసలు తక్కువగా వున్నప్పటికీ 2007-08లో వలస వచ్చిన 28 లక్షలమంది మహిళలో 60 శాతం మంది షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన వారే. వలస మగ కార్మికులలో ఇది 38 శాతంగా వుంది. అంటే వ్యవసాయేతర శ్రామిక మార్కెట్లలో అత్యధికులు దళితులే అని తెలియవస్తుంది.

గ్రామీణ ప్రాంతాలనుండి ఇలా

**"చట్టపరంగా 'నోటిఫై' చేసిన మురికివాడల సంఖ్య పెరుగుదల సగం కథనే మనకు వివరిస్తాయి. 'నోటిఫై' కానప్పటికీ గుర్తించబడిన మురికివాడల సంఖ్య కూడా గణనీయంగానే వుంది. అంటే ఈ వాడలను ప్రభుత్వం అధికారికంగా నోటిఫై చెయ్యనప్పటికీ ఈ వాడల స్థితిగతులు మురికివాడల స్థితి గతులతో సమానంగా వున్నాయని జనగణన ఎన్యూమరేటర్లు ఒక అంచనాకు వచ్చారు."**

పట్టణాలకు సీజనల్‌గా, స్వల్పకాలానికి వలస వచ్చే కార్మి కులు ఏడాదిలోని మిగతా కాలంలో తమ ఊళ్ళో ఏకామందు దగ్గర పనిచేస్తూ వుండేవాడో అతని దగ్గర ఉపాధి అవకాశాలను అట్టే పెట్టుకుంటాడు. లేదా సొంతంగా భూమి వుంటే పొలం పనులు చేసుకుంటూ వుంటాడు. అంటే అతను పూర్తి కాలపు పట్టణ కార్మికుడూ కాదు, పూర్తికాలపు గ్రామీణ కార్మికుడూ కాదు. గ్రామీణ-పట్టణ ప్రాంతాల పనిలో అనుభవానికే అతని కార్యాచరణ పరిమితమై వుంటుంది. అలాగే అటు గ్రామంలోకానీ, ఇటు పట్టణం లోకానీ, అతని రాజకీయ భాగస్వామ్యం పరిమితంగానే వుంటుంది.

సామాజిక సంక్షేమ పథకాలను రూపొందించే క్రమంలో ప్రతి పథకానికీ నివాస ధృవీకరణ పత్రం అడుగుతుంటారు. ఈ విధానాల రూపకల్పనలో వలస కార్మికుల ఇబ్బందులను గమనంలో పెట్టుకోలేదు. వలస కార్మికులకు సంబంధించిన సూక్ష్మ వివరాలు ప్రభుత్వ గణాంకాల్లో లోపించడం, రాజకీయ కార్యరంగంలో గణనీయమైన భాగస్వామ్యం లేకపోవడానికి వలసల్లో వున్న వైవిధ్యమే కారణం.

2011 జనగణన వివరాల్లో పట్టణీకరణ పట్టణ ఉపాధి అవకాశాల్లో ధోరణులను సరిగా పట్టుకోలేకపోవడానికి కారణం కూడా వలస కార్మికులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని శాస్త్రీయంగా సేకరించకపోవడమే.

**పట్టణ కార్మికుల సామాజిక పొందిక**

జనగణన వివరాలను బట్టి చూస్తే కొత్తగా పట్టణ కేంద్రాలు విస్తరిస్తున్నట్లు మనకు అర్థమౌతుంది. అలాగే మురికివాడల సమాచారాన్ని విశ్లేషిస్తే విస్తరిస్తున్న పట్టణ కార్మికవర్గం భౌగోళిక స్థితిగతుల్లో వస్తున్న మార్పులు అర్థమౌతాయి. పట్టణ ప్రాంతాల విస్తరణ, పట్టణ ఉపాధిలో పెరుగుదలకు సంబంధించిన గణాంకాలను బట్టి చూస్తే వలసలకు సంబంధించిన సమాచారం అరకొరగా సమీకరించినట్లు బోధ పడుతుంది. 2001-11 మధ్యకాలంలో నోటిఫై చేసిన మురికివాడల సంఖ్య 1743 నుండి 2613కు పెరిగింది.

చట్టపరంగా 'నోటిఫై' చేసిన మురికివాడల సంఖ్య పెరుగుదల సగం కథనే మనకు వివరిస్తాయి. 'నోటిఫై' కానప్పటికీ గుర్తించబడిన మురికివాడల సంఖ్య కూడా గణనీయంగానే వుంది. అంటే ఈ వాడలను ప్రభుత్వం అధికారికంగా నోటిఫై చెయ్యనప్పటికీ ఈ వాడల స్థితిగతులు మురికివాడల స్థితిగతులతో సమానంగా వున్నాయని జనగణన ఎన్యూమరేటర్లు ఒక అంచనాకు వచ్చారు.

2001-11 మధ్య కాలంలో మురికివాడల నివాసితుల సంఖ్య 44.2 శాతం పెరిగింది. అలాగే 36 శాతం మంది నివాసితులు అనధికారిక మురికివాడల్లో జీవిస్తున్నారని లెక్క తేల్చింది. కాబట్టి ప్రభుత్వ లెక్కల్లో, పథకాల్లో సౌకర్యాల కల్పనలో వీరికి చోటు లేకుండా పోయింది. 34.4 శాతం మంది నివాసితులు మాత్రమే అధికారికంగా గుర్తించిన మురికివాడలలో నివసిస్తున్నారు. వీనికి మాత్రమే ఒక మోస్తరు మౌలిక సదుపాయాలను కల్పిస్తుంది ప్రభుత్వం. అదే పదేళ్ళకాలంలో మురికివాడల నివాసితుల్లో మహిళల సంఖ్య మగవారికన్నా 5.7 శాతం పెరిగింది. ఇది కూడా గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న సంక్షోభాన్ని గురించీ, గ్రామీణ ప్రాంతాలనుండి పట్టణాలకు పెరుగుతున్న వలసలను గురించీ మనకు తెలియ చేస్తుంది.

ఈ మురికివాడల నివాసితుల సామాజిక పొందికలో వైవిధ్యం వుంది. 2001-11 మధ్య పదేళ్ళకాలంలో ఈ మురికివాడల నివాసితుల్లో ఎస్సీల సంఖ్యలో 38 శాతం, ఎస్టీల సంఖ్యలో 51.8 శాతం పెరుగుదల వుంది. దేశవ్యాప్తంగా మురికివాడల్లో నివసిస్తున్న ఎస్సీ జనాభా 2001లో 18.5 శాతం కాగా అది 2011 నాటికి 20.4 శాతానికి, ఎస్టీ జనాభా 2001లో 2.5 శాతం నుండి 2011 నాటికి 3.4 శాతానికి పెరిగింది. ఈ పదేళ్ళ కాలంలో మురికివాడల నివాసితుల శాతం 17.4 దగ్గర స్థిరంగా వున్నప్పటికీ ఎస్సీ, ఎస్టీ నివాసితుల సంఖ్య గణనీయంగా పెరగడం గమనార్హమైన అంశం. అలాగే 2001-2011 మధ్యకాలంలో మురికివాడల నివాసితుల్లో ఎస్సీ మహిళల శాతం 40.3 శాతం, ఎస్టీ మహిళల శాతం 50.4 శాతం పెరిగింది. ఇది మురికివాడల నివాసితుల పెరుగుదల రేటు 34 శాతం కన్నా అధికంగా వుండడం గమనించదగ్గ మరో అంశం.

ఉపాధి కోసం పట్టణ శ్రామిక మార్కెట్లకు వలస వస్తున్న కార్మికుల సంఖ్య నానాటికీ పెరుగుతూ వస్తోంది. అయితే వారికి కార్మికులనే గుర్తింపు లేకుండా పోయింది. పైపెచ్చు వీరు గ్రామీణ ప్రాంత పితృస్వామిక భావజాలంతో ప్రభావితమై వుండేవారు గనుక కార్మికవర్గ స్వభావం సంతరించుకోవడానికి ఇంకా ఆమడ దూరంలోనే వుండిపోయారు. కాబట్టి ప్రధాన స్రవంతి కార్మికోద్యమం ప్రత్యేక శ్రద్ధపెట్టి వలస కార్మికుల సమస్యల మీద కృషి చెయ్యాలి. వీరికంటూ వుండే ప్రత్యేక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నడుం బిగించాలి. తద్వారా పెద్ద సంఖ్యలో వున్న వలస కార్మికులను ప్రధాన స్రవంతి కార్మికోద్యమంలో భాగస్వాములుగా చెయ్యాలి.

**(అనువాదం: సత్యరంజన్)**

## మార్క్సిస్టు పాఠకులకు మనవి

2014 మార్చి నెల నుండి 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక ధర కింది విధంగా సవరించబడింది. పాఠకులు గమనించగలరు.

| | |
|---|---|
| **విడి ప్రతి** | **రూ. 10/-** |
| **సంవత్సర చందా** | **రూ. 100/-** |
| **పోస్టల్ చందా** | **రూ. 120/-** |

పత్రికకు విరివిగా చందాలు చేర్పించి సహకరించాల్సిందిగా కోరుతున్నాం.

**మేనేజర్,**
**మార్క్సిస్టు సైద్ధాంతిక మాసపత్రిక,**
**ఎంహెచ్ భవన్, (ప్రజాశక్తి భవనం)**
**అజామాబాద్, హైదరాబాద్ -20**

సంస్కృతి

# రెండు విభిన్న సంస్కృతులు



రచయిత ప్రఖ్యాత రష్యన్ రచయిత, సాహితీవేత్త. ఆయన రాసిన అమ్మ నవల ప్రపంచ వ్యాపితంగా అనేక మంది విప్లవకారులకు స్ఫూర్తినిచ్చింది. ఆయన సాహిత్యంలో సోషలిస్టు వాస్తవికతను ప్రవేశపెట్టారు.

**- మగ్జీమ్ గోర్కీ**

**శారీరక, భౌతిక, సాంకేతిక, మేధా శక్తులు సంస్కృతిని సృష్టిస్తాయి. శ్రమశక్తి అనుభవాలను తార్కికంగా విశ్లేషించడంతో సాంకేతిక రంగం అభివృద్ధి చెందుతుంది. మానవుని శ్రమశక్తి అనుభవాల వలన పెరిగిన విజ్ఞానం, తర్కం అతడికి ప్రాపంచిక దృక్పథాన్ని కలిగించి ఈ ప్రపంచాన్ని మార్చవలసిన ఆవశ్యకతను తెలియచేస్తాయి.**

**బూర్జువా సంస్కృతి పెట్టుబడిదారులకు లాభాలు తెచ్చిపెట్టే అడ్వర్టయిజ్‌మెంట్లను కళా సంస్కృతులుగా చూపెడుతుంది. అదృష్టం, ఛాన్స్‌లాంటి వాటిమీద ఆధారపడే లాటరీ విధానాన్ని ప్రోత్సహిస్తుంది. సెక్స్, క్రైం, థ్రిల్లింగ్, సస్పెన్స్‌లను పెంచి పోషించే సాహిత్యాన్నీ, సినిమాలనూ ప్రోత్సహించి ప్రజలను పెడ మార్గం పట్టిస్తుంది.**

ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ వర్గానికి చెందిన మేధావులు, రచయితలు సంస్కృతి క్షీణించిపోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'సంస్కృతి' అనే పదం ప్రపంచవ్యాప్తంగా ఒకే అర్థంలో వాడబడుతున్నదా? అంటే 'కాదు' అనేది స్పష్టమైన జవాబు. ప్రపంచంలో రెండు విభిన్న సంస్కృతులు ఉన్నాయి. ఒకటి సామ్రాజ్య వాద పెట్టుబడిదారీ సంస్కృతి, రెండవది సోషలిస్టు సంస్కృతి.

మేధావులు అవసరాన్ని మించి అదనంగా తయారవుతున్నారనీ, విద్యకు కొన్ని పరిమితులు విధించి పారిశ్రామికాభివృద్ధికి అడ్డుకట్టలు వేసి చేతివృత్తులను ప్రోత్సహించాలనీ పెట్టుబడిదారీ వర్గ ప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. కార్మికవర్గం చైతన్యవంతమైతే సోషలిజం వ్యాప్తి చెందుతుందనే అపహాస్యంతో చేసే ప్రకటనలివి. ఇలాంటి ప్రకటనలు 19వ శతాబ్దపు చివరి భాగంలో చేయబడి ఉంటే వాటిని పిచ్చి ప్రకటనలుగా, ప్రకటన కర్తలను అభివృద్ధి నిరోధకులుగా అందరూ ఈసడించుకొని ఉండేవారు. కాని సాహసానికి, సిగ్గులేనితనానికి మధ్య గల వ్యత్యాసాన్ని విస్మరించిన పెట్టుబడిదారీ వర్గం ఈనాడు మధ్యయుగాల నాటి పరిస్థితులను పునరుద్ధరించాలని చెప్పడాన్ని సాహసోపేతమైన ఆలోచనగానే గుర్తిస్తుంది.

తరతరాలుగా కరడుగట్టిన స్వభావం నరనరాన జీర్ణించుకొన్న పెట్టుబడిదారీ వర్గం వ్యాపారులుగా, బ్యాంకర్లుగా సమాజంలో తమ ఉన్నత స్థానాన్ని కాపాడుకుంటూనే మరోవైపు పనిచేసేహక్కు కావాలని కోరుతున్న కార్మికులను కారుచౌకగా లభ్యమయ్యే వస్తువులుగా మాత్రమే పరిగణిస్తోంది. మనుషులుగా కూడా పరిగణించడానికి వీల్లేని ఈ పెట్టుబడిదారీ వర్గమే మరోవైపు సంస్కృతీ పరిరక్షకునిగా పోజు పెడుతోంది.

శారీరక, భౌతిక, సాంకేతిక, మేధాశక్తులు సంస్కృతిని సృష్టిస్తాయి. శ్రమశక్తి అనుభవాలను తార్కికంగా విశ్లేషించడంతో సాంకేతికరంగం అభివృద్ధి చెందుతుంది. మానవుని శ్రమశక్తి అనుభవాల వలన పెరిగిన విజ్ఞానం, తర్కం అతడికి ప్రాపంచిక దృక్పథాన్ని కలిగించి ఈ ప్రపంచాన్ని మార్చవలసిన ఆవశ్యకతను తెలియచేస్తాయి.

తమ లాభాల పెరుగుదలను తప్ప మరి దేనినీ చూడ నిరాకరించే ఆధునిక పెట్టుబడిదారులు నిరుద్యోగులను పెంచడం వలన, సాంకేతిక రంగానికి పరిమితులు విధించడం ద్వారా, ఉన్నత విద్యాసంస్థల నిధులకు కోతలు పెట్టడం ద్వారా సంస్కృతీ పురోగతికి అడ్డుకట్టలు వేయయత్నిస్తుంటారు. నిరంతరాయంగా విస్తరిస్తూ లక్షలాది కార్మిక కర్షకులను నాశనం చేస్తున్నది యుద్ధ పరిశ్రమ. ఏ గుత్త పెట్టుబడిదారీ సంస్థలు, వాటి గ్రూపులు ఏయే దేశాలపై ఆధిపత్యం కొనసాగించాలో తేల్చుకునేందుకు సామ్రాజ్యవాదం యుద్ధాలను కొనితెస్తుంది.

మొదటి ప్రపంచ యుద్ధకాలంలో ఫ్రెంచ్ వ్యాపారులు వారి శత్రువులైన జర్మన్లకు జింకు, నికెల్ సరఫరా చేశారు. బ్రిటన్, జర్మనీ పారిశ్రామికవేత్తల మధ్య వినాశకరమైన పరిశోధనల మారకాలు జరిగాయి. బయటికి పొక్కనివీ, రహస్యంగా జరిగినవీ లెక్కకు మించిన నేరాలు. కాబట్టి ఒక విషయం స్పష్టం. వ్యాపారానికి యుద్ధం అవరోధం కాదు. వారివి 'ప్రేమ కలహాలు, ప్రేమికుల సరదాలు'. కాని యుద్ధం ఫలితంగా లక్షలాది కార్మికులు రక్తతర్పణం చేశారు.

ఒక దేశ కార్మికులూ, మరొక దేశ కార్మికులూ కలహించుకుని చంపుకోవటం మూర్ఖత్వమనీ, యుద్ధాల వలన కలిగే నష్టాలను పూడ్చడానికి కార్మికవర్గమే అధికంగా పనిచేయవలసి వుంటుందనీ, వ్యాపారుల ప్రయోజనాలను యుద్ధాలు కూడా కాపాడుతూనే వుంటాయనేది కార్మికవర్గం గుర్తించవలసిన బాధాకరమైన సత్యం.

శ్రమశక్తితో ఉత్పత్తి అయిన వస్తువులు శ్రామికులకు చెందాలి గాని అవి తయారు చేయమని ఆజ్ఞాపించిన వారికి కాదనేది అతి సాధారణమైన, స్పష్టమైన మానవతా దృక్పథంతో కూడిన న్యాయం. ఆయుధాలు–అన్నిరకాల ఆయుధాలు– శ్రామికుల శ్రమశక్తితో ఉత్పత్తి అయినవే.

"శతాబ్దాలుగా అనేక అవరోధాలను

> పెట్టుబడిదారుల పెత్తందారీతనం కర్కశమైనది. పశుప్రవృత్తి గలది. వారి దోపిడీని కొనసాగించడం కోసం కాలం చెల్లిన విషపూరిత భావాలను వేదాంత, మతపరమైన చింకిపాతలతో కప్పివేయడానికి చేసే ప్రయత్నాలు బహిరంగ రహస్యాలే. వర్ణ, మత, విద్వేషాలు దోపిడీని ప్రోత్సహిస్తాయి.

అధిగమించి నిర్మించుకున్న, మనకు వారసత్వంగా సంక్రమించిన మన సంస్కృతి మేధావులచే సృష్టించబడింది. ఆర్థిక పరిస్థితుల ఎదుట ఈనాడు మేధస్సు తలవంచవలసిందేనా?" అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు పత్రికా రచయితలు.

నిజానికి పత్రికా రచయితలు సంపాదకుల మీద, సంపాదకులు ఆయా పత్రికల అధిపతులైన పారిశ్రామికవేత్తలు, బ్యాంకర్ల మీద ఆధారపడి పనిచేస్తున్నారు. అయినప్పటికీ తాము మేధాపరమైన స్వాతంత్ర్యాన్ని కలిగి వున్నామనే అపోహలో పత్రికా రచయితలున్నారు. తమ రచనల ద్వారా సమాజంలోని అజ్ఞానమనే చీకటిని చీల్చి చెండాడుతున్నామనే భ్రమలలో వున్న బూర్జువా పత్రికా రచయితలు తమ రంగుటద్దాలను తొలగించి, కళ్ళు తెరచి, మనసు విప్పి సమాజాన్ని తేరిపారజూస్తే పెట్టుబడిదారీ సమాజం ఏ ఆర్థిక నైతిక సూత్రాలపై నడుస్తున్నదీ, తాము కళాశాలల్లో విశ్వవిద్యాలయాల్లో ఎలాంటి ఇసుక పునాదులపై నిర్మించబడిన ఆర్థిక, సామాజిక శాస్త్రాలను అధ్యనం చేసిందీ, వారు ఎలాంటి విష వలయాల్లో చిక్కుకొని ఎవరికి సేవలు చేస్తున్నదీ స్పష్టంగా అర్థమవుతుంది. ప్రజలు (పత్రికా రచయితలతో సహా) సంతలో గొర్రెల్లాగా అమ్ముడుపోయే సరుకులుగా చూడబడుతున్న పెట్టుబడిదారీ సమాజంలో వ్యక్తి స్వేచ్ఛను గురించి కలలుగనడం, మాట్లాడడం హాస్యాస్పదం. పరాధీనపు బతుకులు బతుకుతున్న బూర్జువా పత్రికల రచయితలు సంస్కృతి నిర్మాతల మనుకోవడం మరీ హాస్యాస్పదం.

బూర్జువా సమాజ జీవితాన్నీ, దాని అలవాట్లనూ, విధానాలనూ యథాతథంగా ఎలాంటి ఆందోళన లేకుండా పత్రికా రచయితలు వ్యక్తం చేయడం జుగుప్సనూ, విస్మయాన్నీ కలిగిస్తోంది. కుళ్లికంపుగొట్టే సమాజంలో వృత్తిరీత్యా రాత్రింబవళ్ళు పనిచేసే రచయితలు నిర్లిప్తతకు లోనవుతుంటారు. అందుకే బూర్జువా పత్రికలలో వార్తలుంటాయి. వ్యాఖ్యలుండవు. పాఠకులను ఆకట్టుకొనేందుకు కొన్ని సందర్భాలలో వాస్తవాలపై బురదజిమ్మి అతి మొరటుగా వ్యక్తీకరిస్తుంటారు. పాఠకులు కూడా నేర సంబంధమైన వార్తలను నెమరువేసుకొనడానికి అలవాటుపడి పత్రిక చేతికందగానే సంచలనాత్మక వార్తలను వెతుకుతుంటారు. అందుకే పెట్టుబడిదారీ సమాజంలో డిటెక్టివ్ కథలు, నవలలు బహుళ జనాదరణ పొందుతుంటాయి.

ఇలాంటి రొచ్చులో కూరుకుపోయిన పత్రికా రచయితలు సంస్కృతిని ఏవిధంగా సంరక్షించగలరు? సంస్కృతి తాలూకూ భౌతిక విలువలు కోటేశ్వరుల మ్యూజియంలలో పదిలంగా వుంటాయి. అవి సామాన్యులకు అందుబాటులో వుండవు. సాహిత్య, సాంస్కృతిక విలువలు గల నాటకాలు రంగస్థలాలపై ప్రదర్శింపబడవు. విశ్వవిద్యాలయాల్లో వేదాంతం, తర్కం, జాతీయ–అంతర్జాతీయ చట్టాలు, మధ్యయుగాల నాటి మానవతపై వుపన్యాసాలిస్తుంటారు ప్రొఫెసర్లు. ఆధునిక సమాజంలోని గందరగోళంలో వాటి స్థానమేమిటో, వాటి ఆచరణ, విద్యా విలువలు 'సంస్కృతి నిర్మాతలై'న పత్రికా రచయితలే నిర్ధారించాలి.

విచ్ఛిన్నతకూ, వినాశనానికీ చేరువలో నున్న బూర్జువా వ్యవస్థలో మేధావులు చాలా బాధాకరమైన పాత్ర నిర్వహిస్తున్నారు. సంస్కృతిని కాపాడాలనే సాకుతో బూర్జువా పాలనను సమర్థిస్తున్నారు. మేధావులలోని అత్యధికులు కార్మికవర్గానికి చెందినవారే. కాని గుత్త పెట్టుబడిదారీ విధానానికి తోడ్పడే వీరి చర్యలు ఆత్మహత్యా సదృశ్యమైనవి. ప్రస్తుతం దేశాల మధ్యగల వుద్రిక్తతలను పెంచి యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తున్నది సామ్రాజ్యవాదం. రాబోయే యుద్ధాలు న్యూక్లియర్ బాంబులతో మరీ భయంకరంగా వుంటాయి. యుద్ధాలను నివారించకపోతే సంస్కృతి చిహ్నాలు కూడా మిగలవు.

ఈ యుద్ధాలు ఎందుకు? అభివృద్ధి చెందుతున్న దేశాలపై గుత్త సంస్థల ఆధిపత్యం కోసం, పొరుగుదేశాలను దోచుకునేందుకు. సాయుధ గూండాల దోపిడీకీ, సామ్రాజ్యవాదం కొనితెచ్చే యుద్ధాలకూ బేధమేమీ లేదు. కానీ సాయుధ దోపిడీలు సామ్రాజ్యవాద దేశాలలో కూడా చట్టవిరుద్ధమైన చర్యలే. యుద్ధాల వల్ల ఎన్ని నగరాలు, ఎన్ని ఫ్యాక్టరీలు బూడిదయిపోతాయి! ఎన్ని విలువైన ఓడలు విమానాలు నాశనమవుతాయి! ఎంతో శారీరక, మానసిక శ్రమను వెచ్చించి కార్మికులు, కర్షకులు, మేధావులు సృష్టించిన సంపదను వారి చేతులతోనే నాశనం చేయించడం ఎంత దుర్మార్గమో, ఎంత పైశాచికమో ఆలోచించండి.

పెట్టుబడిదారుల పెత్తందారీతనం కర్కశమైనది. పశుప్రవృత్తి గలది. వారి దోపిడీని కొనసాగించడం కోసం కాలం చెల్లిన విషపూరిత భావాలను వేదాంత, మతపరమైన చింకి పాతలతో కప్పివేయడానికి చేసే ప్రయత్నాలు బహిరంగ రహస్యాలే. వర్ణ, మత, విద్వేషాలు దోపిడీని ప్రోత్సహిస్తాయి.

బూర్జువా వ్యవస్థ సంస్కృతికి సంబంధించిన ప్రాథమిక సూత్రాలను వుల్లంఘించింది. సమాజంలోని ఆర్థిక వ్యవస్థమీద దానికెలాంటి అదుపూ లేదు. నిరుద్యోగులను విపరీతంగా పెంచుతోంది. వర్గ స్వభావరీత్యా కార్మిక, కర్షకులను దోచుకుంటూ పెట్టుబడిదారులను కాపాడుతుంది. పెట్టుబడిదారులకు లాభాలు తెచ్చిపెట్టే అడ్వర్టయిజ్‌మెంట్లను కళా సంస్కృతులుగా చూపెడుతోంది. శాస్త్రీయ విజ్ఞాన వ్యాప్తికి తోడ్పడక అదృష్టం, ఛాన్స్‌లాంటి వాటిమీద వ్యామోహం కలిగించే లాటరీ విధానాన్ని ప్రోత్సహిస్తుంది. సెక్స్, క్రైం, థ్రిల్లింగ్, సస్పెన్స్‌లను పెంచి పోషించే సాహిత్యాన్నీ, సినిమాలనూ ప్రోత్సహించి ప్రజలను పెడమార్గం పట్టిస్తుంది. సాంఘిక అరాచకాలకు గల అసలైన కారణాలను మభ్యపెట్టేందుకు అంధ, మత విశ్వాసాలను ప్రోత్సహిస్తుంది. సంస్కృతిని సర్వనాశనం చేస్తున్న బూర్జువావర్గం.. సంస్కృతి సంరక్షింపబడాలని ఆక్రోశించడంలో అర్థంలేదు. వారి దృష్టిలో సంస్కృతిని రక్షించడమంటే దోపిడీని కొనసాగించడమే. అధిక సంఖ్యాక వర్గాలపై అల్ప సంఖ్యాక వర్గ పాలన కొనసాగించడమే. ప్రజా చైతన్యాన్నీ, సోషలిస్టు శక్తులనూ అణచడమే.

కార్మిక, కర్షకుల శ్రమశక్తి అనుభవాలు వారి విజ్ఞాన పరిధిని విస్తృతపరుస్తుండగా, సమిష్టిశక్తి వారి జీవితాలలో క్రొంగొత్త వెలుగులను ప్రసరింపజేస్తుండగా కొత్త సోషలిస్టు సంస్కృతిని నిర్మించుకొంటున్నారు శ్రామికులు సోషలిస్టు సమాజంలో.

కార్మిక, కర్షకులు మార్క్స్–ఏంగెల్స్‌ల శాస్త్రీయ సోషలిజాన్ని అధ్యయనం చేస్తూ నిరంకుశ బంధాలను ఛేదించుకొని, బానిస భావాలను

> **"బూర్జువా మానవతావాదం శ్రామికజనులకు చేసిందేమీ లేదు. అప్పుడప్పుడు ఏవో ఎంగిలి మెతుకులు విసరడం తప్ప. ఎంగిలి మెతుకులు విసరడం శ్రామికుల ఆత్మగౌరవాన్ని అవమానపరచడమే. ఆచరణలో బూర్జువా మానవతావాదం దోపిడీ చేసి, దోపిడీకి గురయిన వారికి బిచ్చం పెడుతుంది."**

అధిగమించి, ప్రయివేటు యాజమాన్యం ఎదుట అణిగి మణిగి ఉండే పరిస్థితుల నుండి బయట పడి, దేశ సంపదపై శ్రామికుల సమిష్టి యాజమాన్యాన్ని సాధించుకుంటున్నారు సోషలిస్టు సమాజంలో.

బూర్జువా సమాజంలో శ్రమకు తగ్గ ఫలితాన్ని పొందలేని శ్రామికులు... విజ్ఞానాన్ని సమకూర్చితే సంస్కారవంతులై నిజమైన సంస్కృతిని నిర్మిస్తున్నారు సోషలిస్టు సమాజంలో.

వ్యక్తి సృష్టించే సంస్కృతిని సమాజం గుర్తించి అభిమానించడంతో సామాజిక కార్యకలాపాలలో ఉల్లాసంగా పాల్గొనగలుగుతున్నారు సోషలిస్టు సమాజంలో కార్మికులు.

జనాభాలో సగభాగంగా వున్న స్త్రీలు పురుషులతో సమానమైన హక్కులు అనుభవిస్తూ సమాజ పునర్నిర్మాణానికై అన్ని రంగాలలో పురుషులతో భుజం భుజం కలిపి పనిచేస్తూ వారి ప్రతిభా సామర్థ్యాలను విపరీతంగా పెంచుకో గలుగుతున్నారు సోషలిస్టు సమాజంలో.

యథాతథ పరిస్థితులకు లొంగి విధేయతగా ఉండే సహనాన్ని బోధించే మతమౌఢ్యాలకు అతీతంగా స్వేచ్ఛగా ఎదుగుతున్నారు సోషలిస్టు సమాజంలో.

తమ భాషలకు లిపి కూడా లేక అనాగరికంగా వున్న పలు జాతుల వారికి లిపిని అందజేసి స్వేచ్ఛగా ఎదగడానికి అవకాశాలు కల్పించిన తరువాత సాంస్కృతికంగా ఊహకందని విధంగా అభివృద్ధి చెందుతున్నాయి పలు జాతులు సోషలిస్టు సమాజంలో.

కార్మికవర్గం వ్యక్తిని ఉన్నతంగా చూస్తుంది. సమాజ ప్రయోజనాలకు భిన్నంగా వ్యక్తి ఏదైనా నేరం చేస్తే అతడి శారీరక మానసిక శక్తులను హరించే విధంగా చీకటి జైళ్ళలో తోయడం జరగదు. అతడిని చైతన్యపరచి నిపుణుడైన పనివానిగా, సమాజానికి ఉపయుక్తమైన పౌరునిగా తీర్చిదిద్దడానికి యత్నిస్తుంది.

నేరస్తుని యెడల అలాంటి దృక్పథాన్ని వ్యక్తం చేయగలిగింది కార్మికవర్గ మానవతావాదం మాత్రమే. ఇరుగువాడు పొరుగువాణ్ణి పీక్కుతినే తోడేళ్లుగా చూసే సమాజంలో ఇలాంటి మానవతావాదానికి అవకాశం ఉండదు.

బిడ్డల పెంపకం, ఆరోగ్య పరిరక్షణకు సోషలిస్టు సమాజంలో అత్యంత ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

పరిశ్రమలు విస్తరిస్తున్నాయి. వ్యవసాయ రంగం పునర్నిర్మించబడుతోంది. కొత్త ఆహారధాన్యాలు, పండ్ల మొక్కలు ప్రవేశపెట్టబడుతున్నాయి. చిత్తడి నేలలు వ్యవసాయ యోగ్యాలుగా మార్చబడుతున్నాయి. బొగ్గు, నూనె, ఖనిజ నిక్షేపాలు వెలికితీయబడుతున్నాయి. ఆర్కిటిక్ అదుపులోకి వచ్చింది. ఆ సమాజంలో శ్రమశక్తి ఒక కళగా అభివృద్ధి చెందుతోంది. కొత్త సంస్కృతి–శ్రామిక వర్గ సంస్కృతి, శ్రామికవర్గ మానవతావాదం సృష్టిస్తున్న సంస్కృతి ఇది. సంస్కృతి నాగరికతలకు మూలం. మానవతావాదమని బూర్జువాలు విర్రవీగే మానవతావాదం కాదు. రెండు మానవతావాదాలకు పేరులో తప్ప సమాన్య లక్షణమేమీ లేదు. రెండూ మానవతావాదాలే. కానీ స్వభావరీత్యా భిన్నమైనవి. ఫ్యూడల్ ప్రభువుల నుండీ, మతం నుండీ తమ రక్షణ కోసం బూర్జువాలు మానవతావాదాన్ని ప్రవేశపెట్టాయి. మానవులంతా ఒకటే. అంటే పెట్టుబడిదారుడు, పారిశ్రామికవేత్త ఫ్యూడల్ ప్రభువులతో సమానమనే వారి భావం. కాని శ్రామికులంతా అని కాదు. బానిస విధానంతో, బానిస వ్యాపారులతో బూర్జువా విధానం సహజీవనం చేసింది. శ్రామికులతో జైళ్ళను నింపివేస్తూ హక్కుల కోసం పోరాడే కార్మికులను నిర్దాక్షిణ్యంగా నగర వీధులలో కాల్చివేసిన బూర్జువా వర్గం మానవతావాదాన్ని జపించడం కొంగజపం లాంటిదే.

బూర్జువా మానవతావాదం శ్రామికజనులకు చేసిందేమీ లేదు. అప్పుడప్పుడు ఏవో ఎంగిలి మెతుకులు విసరడం తప్ప. ఎంగిలి మెతుకులు విసరడం శ్రామికుల ఆత్మగౌరవాన్ని అవమానపరచడమే. ఆచరణలో బూర్జువా మానవతావాదం దోపిడీ చేసి, దోపిడీకి గురయిన వారికి బిచ్చం పెడుతుంది. 'కుడిచేయి చేసే దానం ఎడమ చేతికి తెలియకూడదు' ఇది చాలా మందిచేత ఆమోదింపబడిన బూర్జువా ధర్మసూత్రం. శ్రామికుల కష్టార్జితం కొల్లగొట్టి కొన్ని వందలు, వేల రూపాయలు పాఠశాలలకూ, సత్రాలకూ, మఠాలకూ విరాళాలివ్వడం జనాన్ని మభ్యపెట్టడానికే. 'పడిపోయిన వానికి చేయూతనిమ్ము' మరొక ధర్మసూత్రం. పడిపోయినవారు పెట్టుబడిదారుల చేత ఊబిలోనికి నెట్టబడినవారే.

బూర్జువా మానవతావాదానికి చిత్తశుద్ధి ఉంటే, ప్రకృతి శక్తుల కెదురొడ్డి నిలిచి సంస్కృతిని నిర్మిస్తున్న శ్రామికశక్తి యెడల అభిమానముంటే, 'బాధలు తప్పవు గనుక భరించి తీర్చవలసిందే' నని శుష్క నీతివాక్యాలు వల్లించక బాధలకు వ్యతిరేకంగా, ముఖ్యంగా సామాజిక ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా జరిగే పోరాటానికి దోహదపడి ఉండేది.

శరీరావయవాల కార్యకలాపాలలో గిట్టని పదార్థం జోక్యం కలుగజేసుకుంటే శరీరంలో బాధ కలుగుతుంది. శరీరావయవాలు నీకిచ్చే సంకేతం బాధ. 'మనిషీ నిన్ను నీవు రక్షించుకో' అనీ, బాధలను ఓపికగా భరించమని చెప్పడమంటే సమాజంలోని హెచ్చుతగ్గులు, వర్ణ, వర్గ, మత, జాతి వివక్షతలు అధిగమించరానివి కనుక వాటికి తలొగ్గి ఉండమని చెబుతోంది బూర్జువా మానవతావాదం. శ్రామిక ప్రజానీకం చైతన్యవంతమవడానికీ, సమిష్టి ప్రయోజనాల కోసం సంఘటిత పరచడానికీ వివక్షతలు అవరోధంగా వుంటాయి. అవరోధాలు కల్పించడానికే బూర్జువా మానవతావాదం నీతి సూత్రాలను వల్లించేది.

శ్రామికవర్గ మానవతావాదం తేనె పలుకులు పలకదు. పెట్టుబడిదారులనుండీ – రక్తపిపాస గల విషదంష్ట్రల నుండీ– విముక్తి పొందడానికి శ్రామికులను పోరాడమంటోంది. శ్రామిక ప్రజలను అమ్మకానికి సిద్ధంగా ఉన్న ముడి సరుకులుగా పరిగణిస్తూ, వారి శ్రమశక్తిని బ్యాంక్ చెక్కులుగా, బంగారు కడ్డీలుగా మార్చుకుంటున్న పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా కార్మికవర్గాన్ని పోరాడాలని బోధిస్తుంది.

ఇవీ సంక్షిప్తంగా రెండు విభిన్న సంస్కృతులు

ఏదీ సంస్కృతి? ఏది విచ్ఛిన్నత?

ఏది పురోగామి దృక్పథం? ఏది తిరోగామి దృక్పథం?

సంస్కృతీ నిర్మాతలెవరు? విచ్ఛిన్నకారులెవరు? ౦

# సిపిఐ(ఎం) కార్యక్రమం రూపుదిద్దుకున్న తీరు

(11వ పేజీ తరువాయి)

అంశాలుగా వుంటాయన్న వాస్తవాన్నీ గుర్తెరిగి భారత బూర్జువా వర్గం విదేశీ ద్రవ్య పెట్టుబడి మీద ఆధారపడడం లేదా, షరీకవడం వల్ల తలెత్తే ప్రమాదాలను అంచనా వెయ్యాల్సిందే. కానీ అదేదో యాంత్రికంగానో, అదంతా రాజకీయ లొంగుబాటు అనో 'సామ్రాజ్యవాదంతో మళ్ళీ చేరడానికి భారత బూర్జువా వర్గం సిద్ధపడి పోయిందనో' పిడివాదంగా ఒక సాధారణ సూత్రీకరణ చేసే పని చెయ్యకూడదు. "నూతన రాజ్యాధికారం పాత్ర, మారిన నూతన అంతర్జాతీయ పరిస్థితులు, దేశంలో వర్గ పోరాట చైతన్య స్థాయి – వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుంటే తప్ప భారత పాలకవర్గాలు సామ్రాజ్యవాదంతో ఏ మేరకు రాజీపడిపోతున్నాయి. ఏ మేరకు షరీకరవుతున్నాయి, ఏ మేరకు లొంగుబాటు ప్రదర్శిస్తున్నాయి అనేది నిర్ధారించలేం. అలా కాకుండా పైపై అంచనాలతో విదేశీ ద్రవ్య పెట్టుబడి మీద ఆధారపడడాన్నో, షరీకవడాన్నో దేశీయ బూర్జువా వర్గం ఫైనాన్స్ పెట్టుబడికి లొంగిపోయిందనే అతి సాధారణ సూత్రీకరణ చూసేస్తే దానివల్ల అనేక విపరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. మన అంచనాయే లోపభూయిష్టంగా వున్నాక దాని నంటి పెట్టుకొని వుండే పొరబాట్లు మన వైఖరిలో చోటు చేసుకుంటాయి.

ఇప్పుడు మీ చేతుల్లో వున్న ముసాయిదాలో గత కాలపు పొరబాటు అంచనాలను పక్కన పెట్టి అంతర్జాతీయ బలాబలాల పొందికలో వచ్చిన రాడికల్ మార్పుల ఆధారంగా ఏర్పరచుకున్న అవగాహనను పొందుపరిచాం.

అలాగే 1948 సిద్ధాంత పత్రంలోని పెడ ధోరణులను కూడా ఈ మూరు ఈ ముసాయిదాలో పక్కన బెట్టాం. అంతర్జాతీయ బలాబలాల పొందికలో తీవ్రంగా వచ్చిన మార్పులను ఆధారంగా చేసుకొని ఏర్పరచుకున్న నూతన అవగాహనను పొందుపరిచాం. విప్లవ రెండు దశలను ఒకదానికొకటి లింకు చేస్తూ 1948 సైద్ధాంతిక పత్రంలో పొందుపరిచిన పొరబాటు అవగాహనను విడనాడాం. జాతీయ బూర్జువా వర్గం మొత్తాన్నీ శత్రు శిబిరంగా పరిగణించడం, ధనిక రైతాంగాన్ని ప్రజాస్వామిక పొత్తుల నుండి మినహాయించడం, 1947లో దేశానికి వచ్చిన రాజకీయ స్వాతంత్ర్యాన్ని కుహనా స్వాతంత్ర్యం గా కొట్టి పారెయ్యడం వంటి పొరబాట్ల నుండి కూడా విడగొట్టుకున్నాం.

అలాగే 1951లో రాసుకున్న పార్టీ కార్యక్రమంలో రాజ్యంమీదా, ప్రభుత్వంమీదా మన 'వర్గ అంచనా' ఆ ప్రభుత్వం అనుసరిస్తూ వచ్చిన జాతీయ, అంతర్జాతీయ విధానాలపై అంచనా, విప్లవ సాధనకు కలిసివచ్చే వర్గ శక్తులతో పొత్తు తదాది అంశాల నుండి కూడా మనం విడగొట్టుకున్నాం. మీ అందరికీ తెలుసు మనం 1951లో రాసుకున్న కార్యక్రమాన్ని, అందులోని విషయాలను స్టాలిన్ సోవియట్ సోషలిస్టు నాయకత్వం ఆమోదించి, అభినందించింది. రెండవ మహాసభ సిద్ధాంత పత్రంతో పోలిస్తే ఆ నాటికి పార్టీలో వున్న కొన్ని మౌలిక పొరబాటు అంచనాలను సరిచేసేందుకు నిజంగానే 1951 కార్యక్రమం డాక్యుమెంట్ ఎంతగానో వుపకరించింది అయినప్పటికీ మితవాద సంస్కరణవాద ధోరణులు, పిడివాద ధోరణులను పూర్తిగా వదిలించుకోలేకపోయింది. అదేంటో వివరించడానికన్నా ముందు నేనొక విషయం నిష్కర్షగా స్పష్టం చెయ్యాల్సిన అవసరం వుంది. 1951 కార్యక్రమం రూపకల్పన – దాని తప్పొప్పులన్నింటి సహా పూర్తి బాధ్యత మాదే. కీలక సలహాలు, సవరణలు సూచించిన స్టాలిన్‌కుగానీ, సి.పి.ఎస్.యు. నాయకత్వానికిగానీ ఈ తప్పులు ఆపాదించ బూనటాన్ని మేం అంగీకరించం. అది పూర్తిగా పొరబాటు ఆలోచన. ఆత్మవిమర్శనా పూర్వకంగా మన పొరబాట్లను మనం అంచనా వేసుకొని వాటిని సరిదిద్దుకునేందుకు కృషిచేస్తూ ఇతరుల సలహాల మీద కూడా ఆధారపడడం సరైన వైఖరి అవుతుందిగానీ, నెపం మొత్తం అవతలివారి మీదికి నెట్టడం ఏమాత్రం సరైనది కాదు. నిజమైన శ్రామికవర్గ అంతర్జాతీయ స్ఫూర్తితో సోదర విమర్శనలను, సలహాలను సూచలను మనం పరిగణనలోకి తీసుకోవాలేగానీ గుడ్డిగా వ్యతిరేకించడం, త్రోసిపుచ్చడం సరికాదు.

ఇక 1951 కార్యక్రమంలో పొరబాట్ల విషయానికి వస్తాను. సంక్షిప్తంగా చెప్పుకోవాలంటే....

(1) రాజకీయ అధికారాన్ని భారత బూర్జువా వర్గానికి బదలాయించబడడంలో వున్న కీలక ప్రాధాన్యతను, అంతర్జాతీయ యవనికలో (సామ్రాజ్యవాద–సోషలిస్టు శక్తుల) బలాబలాల్లో వచ్చిన పెను మార్పులను పరిగణనలోకి తీసుకోకుండా రెండవ ప్రపంచ యుద్ధం ముందుకాలంనాటి బలాబలాల పొందిక చట్రం ఆధారంగా అంచనా వెయ్యడం

(2) స్వాతంత్ర్యాన్ని వుపయోగపెట్టుకొని దేశ ఆర్థిక వ్యవస్థను– పెట్టుబడిదారీ పంథాలోనే అయినప్పటికీ – నిర్మించేందుకు వున్న అవకాశాలను విస్మరించాం.

(3) నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం బ్రిటీష్ సామ్రాజ్యవాదుల చెప్పుచేతల్లో నడిచే కీలుబొమ్మ ప్రభుత్వంగా అభివర్ణించి సాపేక్షంగా దానికి వున్న బలాన్నీ, సుస్థిరత అవకాశాల్నీ తక్కువచేసి చూపాం. అదే ఊపులో ప్రజా చైతన్యాన్నీ, అసంతృప్తినీ, తిరుగుబాటు అవకాశాలనూ అతిగా అంచనా వేశాం

(4) అలీన విదేశాంగ విధానాన్ని అటు సామ్రాజ్యవాద శిబిరానికీ, ఇటు శాంతికాముక సోషలిస్టు శిబిరానికీ మధ్య దోబూచులాడే వైఖరిగా అభివర్ణించాం. అమెరికన్ సామ్రాజ్యవాదుల దూకుడుకు పరోక్ష సహకారంగా అంచనా వేశాం. ఇది సాపేక్షంగా మాత్రమే సత్యం. 1948–51 మధ్యకాలంలో కొరియా దురాక్రమణ తదితర అనేక అంశాలపై ప్రభుత్వం అమెరికన్ సామ్రాజ్యవాద ఒత్తిడికి లొంగిన మాట వాస్తవమేగానీ భారత బూర్జువా వర్గం తాను నిలదొక్కుకొని బలపడేందుకు దాని వర్గ ప్రయోజనాలరీత్యా ఘర్షణ కోరుకోని రీతిలో శాంతియుత వాతావరణం కోరుకున్న నేపథ్యంలో అలాంటి వైఖరి చేపట్టి వుంటుందనే అంచనాకు రాలేకపోయాం. అంతర్జాతీయంగా మారిన బలాబలాల పొందిక నేపథ్యంలో కొత్తగా వచ్చిన రాజకీయ స్వాతంత్ర్యాన్ని ఆలంబనగా చేసుకొని భారత బూర్జువా వర్గం ఈ రెండు శిబిరాల మధ్య వున్న వైరుధ్యాలను వుపయోగపెట్టుకుంటుందని మనం గమనంలోకి తీసుకోలేకపోయాం. స్వాతంత్ర్యానంతర భారతదేశం బ్రిటీష్ సామ్రాజ్యవాదం మీద ఆధారపడి ఆ సామ్రాజ్యవాద విదేశాంగ విధానం తోక పట్టుకుపోతుందని మన 1951 కార్యక్రమంలో పొరబాటుగా అంచనా వేశాం.

(5) వర్గ వ్యూహం, విప్లవ ఎత్తుగడల విషయంలో స్వాతంత్ర్య పూర్వకాలంలో నిర్దేశించుకున్నదానికీ, స్వాతంత్ర్యానంతర కాలానికీ తేడా లేకుండా పోయింది. స్వాతంత్ర్య పూర్వ కాలంలో వేసిన ఎత్తుగడలు ప్రధానంగా బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా వేసినవి.

1951 కార్యక్రమాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే ఒకపక్క పిడివాద, ఒంటెద్దు ధోరణులు, రెండోపక్క మితవాద అవకాశవాద ధోరణుల సమ్మిశ్రమ ధోరణి మనకు కనిపిస్తుంది. ఈ ముసాయిదా కార్యక్రమం ద్వారా మనం ఆ

రెండు పొరబాటు ధోరణులను పరిహరించుకొని నికరమైన మార్క్సిస్టు–లెనినిస్టు వర్గ దృక్పథాన్ని పునాదిగా చేసుకున్నాం. అలాగే నూతన శకం, నూతన అవకాశాల పేరిట మితవాద సంస్కరణ వాదులు పూర్తి అవకాశవాద ధోరణులతో వాళ్ళ ముసాయిదా కార్యక్రమంలో రివిజనిస్టు ధోరణులను బాహాటంగా ఎలా బయట పెట్టుకున్నారో దృష్టిలో పెట్టుకొని కీలక అంశాలన్నింటా మనం వాటినుండి సూటిగా విడగొట్టుకునేందుకు సీరియస్‌గా ప్రయత్నించాలి. ముసాయిదా కార్యక్రమంలో రాజ్యాధికారం స్వభావాన్నీ, లక్షణాలనూ మనం ఎలా నిర్వచించుకున్నాం?

బడా బూర్జువా నాయకత్వాన బూర్జువా భూస్వామ్య శక్తులు రాజ్యాధికారంలో వున్నాయని ముసాయిదా కార్యక్రమంలో చెప్పుకున్నాం. అంతేకాదు బడా బూర్జువా నాయకత్వం విదేశీ ద్రవ్య పెట్టుబడితో రాజీపడుతూ, మిలాఖతు అవ్వడమే కాకుండా భూస్వామ్య శక్తులతో షరీకయి చారిత్రకంగా పనికిమాలినదిగా తేలిపోయిన పెట్టుబడిదారీ అభివృద్ధి పంథాను అనుసరిస్తూ తన వర్గ పాలననూ, క్రూరమైన దోపిడీనీ ప్రజానీకంమీద రుద్దుతోందని మరింతగా వివరించుకున్నాం. ఇదే లక్ష్యంతో, దృష్టితో సోషలిస్టుల దేశాల సాయాన్ని వినియోగ పెట్టుకొని భారీ పరిశ్రమల నిర్మాణం కావించుకొంటూ, దీన్ని అడ్డం పెట్టుకొని సామ్రాజ్యవాద శక్తులతో మెరుగైన బేరసారాలకు దిగుతుందనే వాస్తవాన్నీ ముసాయిదాలో పొందుపరిచాం. బడాపెట్టుబడిదారులు ఇదంతా సామ్రాజ్యవాద పోటీదారుల నుండి తట్టుకోవడానికీ, అయిన కాడికి ప్రజలను తామే దోచుకొనేందుకూ చేస్తారు.

రాజ్యం బూర్జువా వర్గంలోని గుత్తేతర శక్తుల చేతుల్లో వుంది, అంటే ఈ శక్తులు సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక కర్తవ్యాలను పరిపూర్తి చేయాలి అని రివిజనిస్టులు భావిస్తున్నారు. కానీ రాజ్యాధికారం ప్రధానంగా బడా బూర్జువాల చేతుల్లో వుంది. ఈ శక్తుల ప్రమాదాన్ని ఎంతమాత్రం తక్కువగా అంచనా వెయ్యరాదు. రివిజనిస్టులు వాడే అత్యంత మోసపూరిత వాగాడంబర పదజాలంలో పడి మనం కొట్టుకుపోరాదు. 'బడా బూర్జువాలు రాజ్యంలో కీలక స్థానం ఆక్రమించారు' 'గణనీయ ప్రభావం చూపిస్తున్నారు' తరచూ గణనీయమైన ప్రభావం చూపిస్తున్నారు' 'ఐనా రాజ్యంలో నిర్ణయాత్మక నాయకత్వ స్థానాల్ని గెలుచుకోలేకపోయారు' అంటూ రివిజనిస్టులు నానా రకాల కూతలు కూస్తున్నారు. ఇదంతా దేనికి పనికి

“ రాజ్యం బూర్జువా వర్గంలోని గుత్తేతర శక్తుల చేతుల్లో వుంది, అంటే ఈ శక్తులు సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక కర్తవ్యాలను పరిపూర్తి చేయాలి అని రివిజనిస్టులు భావిస్తున్నారు. కానీ రాజ్యాధికారం ప్రధానంగా బడా బూర్జువాల చేతుల్లో వుంది. ఈ శక్తుల ప్రమాదాన్ని ఎంతమాత్రం తక్కువగా అంచనా వెయ్యరాదు. రివిజనిస్టులు వాడే అత్యంత మోసపూరిత వాగాడంబర పదజాలంలో పడి మనం కొట్టుకుపోరాదు. ”

వస్తుందంటే బడా బూర్జువా వర్గం, దాని రాజకీయ ప్రాతినిధ్య శక్తులు రాజ్యంలో కీలక పాత్ర పోషిస్తూ ప్రజా ప్రయోజనాలను ఫణంగా పెట్టి అపారమైన సంపదను పోగేసు కోవడానికి రాజ్యాధికారాన్ని వినియోగ పెట్టుకుంటుందనే వాస్తవాన్ని మరుగున పరచడానికి పనికొస్తుంది.

బూర్జువా వర్గం రాజ్యంలో ప్రధాన పాత్ర పోషిస్తుందన్న మన అంచనామీద దగాకోరు ఆరోపణలు కుప్పిస్తూ 'అంటే రాజ్యాధికారం గుత్తాధిపత్య శక్తుల చేతుల్లోకి వచ్చేసినట్లేనా, రాజ్య పెట్టుబడి–గుత్త పెట్టుబడి ఒకటిగా కలిసిపోయి రాజ్యం గుత్తాధిపత్య పెట్టుబడిదారీ విధానం కిందకి వచ్చేసినట్లేనా' అనడుగుతున్నారు రివిజనిస్టులు. ఇది మన ముసాయిదా కార్యక్రమాన్ని ప్రయత్నపూర్వకంగా వక్రీకరించడమే. మన ముసాయిదా కార్యక్రమంలో 'బడా బూర్జువాయేతర శక్తులు బడా బూర్జువా శక్తులతో కలిసి రాజ్యాధికారం పంచుకుంటున్నాయని తద్వారా తామూ ఆధిపత్య శక్తుల సరసకు చేరుకోగలమని భావిస్తున్నాయని' ప్రత్యేకంగా వివరించాం. అంతేకాదు స్వార్థ ప్రయోజనాల కోసం జాతి వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బడా బూర్జువా నాయకత్వాన్ని ఇలానే కొనసాగనిస్తే, సరైన సమయంలో ఓడించకుంటే రాజ్య – గుత్త– పెట్టుబడిదారీ విధానం భారతదేశ ప్రత్యేక పరిస్థితులకు తగినట్లుగా వికృతరూపంలోనైనా ముందుకువచ్చే ప్రమాదం వుందని కూడా మనం అర్థం చేసుకోవాలి. ఈ ప్రమాదాన్ని నిలువరించడానికైనా రాజ్యం యొక్క నిజ స్వభావాన్నీ, అందులో బడా వ్యాపార వాణిజ్యవేత్తల పాత్రనూ మనం బట్టబయలు చెయ్యాలి. ఇందులో ఏమాత్రం వైఫల్యం చూపించినా కార్మికవర్గానికీ, భారత జనతా ప్రజాస్వామిక విప్లవానికీ మనం ద్రోహం చెసినట్లే అవుతుంది.

రివిజనిస్టులు అంచనా వేసిన బూర్జువా వర్గం రాజ్యంలో ప్రధానపాత్ర పోషిస్తూ భూస్వామ్యవర్గానికి వ్యతిరేకంగా పనిచేస్తుందనేది ఎంతమాత్రమూ సరికాదు. తద్భిన్నంగా భూస్వామ్యశక్తులు బూర్జువా శక్తులకు నికరంగా తోడై రాజ్యాధికారాన్ని పంచుకుంటూ వున్నాయి. ఫ్యూడల్–అర్ధఫ్యూడల్ భూస్వామ్య విధానం, ఇంకా ఇతరేతర భూస్వామ్య విధానాలంటూ రివిజనిస్టులు చెవులకింపయిన భాషలో బహుపసందుగా వైరుధ్యాలు వున్నాయంటూ 'ఫ్యూడలిజం వెన్ను విరిగిపోయింది', 'ఫ్యూడల్– అర్ధ ఫ్యూడల్ ఎస్టేట్లు అదృశ్యం కావడం ఊహించనలవికాని పరిణామాలకు దారితీస్తుంది' 'బూర్జువా వర్గంతో పోలిస్తే భూస్వామ్య శక్తుల బలం క్షీణిస్తుంది'. 'దానాదీనా రాజ్యాధికారంలో భూస్వామ్య శక్తుల ప్రమేయం లేకుండా వుంది' 'బూర్జువా వర్గం దయా దాక్షిణ్యాలతో అనుమతించిన మేరకు అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రాల్లో కొన్ని పదవులకు మాత్రమే భూస్వామ్య శక్తులు పరిమితం అయిపోయాయన్న' అంచనాలను మన పార్టీ తిరస్కరిస్తుంది. అసలు రివిజనిస్టులు ఇలాంటి మాటల గారడీకి ఎందుకు పాల్పడుతున్నట్లు? దేశంలోని కార్మిక వర్గాన్నీ, రైతాంగాన్నీ మోసం చేసేందుకే – ఇదిగో బాబులూ రాజ్యాధికారం మీరు అనుకునేంత చెడ్డది కాదు, మితవాద భూస్వామ్య శక్తులు రాజ్యాధికారాన్ని పంచుకోవడం లేదు, ప్రజలంతా కలిసికట్టుగా రాష్ట్ర, కేంద్ర, ప్రభుత్వాలకు సహకరిస్తే అది ఫ్యూడల్, అర్ధ ఫ్యూడల్ శక్తుల వెన్నువిరిచినట్లే ఏదో ఒక నాటికి భూస్వామ్య శక్తులనూ రద్దు చేస్తాయనీ, అందుకు తగిన భూ సంస్కరణలు చేబడతాయనీ నమ్మించేందుకే.

రాజకీయ స్వాతంత్ర్యాన్ని నామమాత్ర పుదిగా, కుహనాదిగా మనం గతంలో పేర్కొన్న విషయాన్ని సవరించుకున్నాం. రాజ్యం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో విదేశీ సామ్రాజ్యవాద శక్తుల పాలనలో లేదు కాబట్టి దాన్ని 'జూనియర్ పార్ట్‌నర్ అనో, సీనియర్ పార్ట్‌నర్' అనో అనుకోవడం కూడా సరికాదు. సరే, జాతీయోద్యమం

> **"రివిజనిస్టులు తమ ముసాయిదా కార్యక్రమంలో రాజ్యం యొక్క వర్గ స్వభావాన్ని ఎలా అంచనా కట్టారంటే ఇప్పుడున్న రాజ్యాన్ని వివిధ ప్రజాస్వామిక శక్తులు కలిసికట్టుగా విప్లవం ద్వారా పరిమార్చాల్సిన చారిత్రక ఆవశ్యకత లేదని అభిప్రాయపడుతున్నారు. అంటే రాజ్య పునర్నిర్మాణం కోరుకుంటున్నారు."**

– రాజకీయ స్వాతంత్ర్యాల గురించి రివిజనిస్టులకన్నా భిన్నంగా మనం ఎలా చూస్తున్నాం. ఈ విషయానికి వస్తే మన అంచనా ఏమిటంటే పాలక శక్తులు తమ వర్గ స్వభావరీత్యా ఆర్థికంగా, వాణిజ్యపరంగా, పరపతిపరంగా ప్రపంచ పెట్టుబడిదారీ మార్కెట్లతో లింకు పెట్టుకుంటాయి. సామ్రాజ్యవాద శక్తుల నుండి సాయం తెచ్చుకుని పంచవర్ష ప్రణాళికల పేరిట పెట్టుబడిదారీ అభివృద్ధికి బాటలు వేశాయి. భారత గుత్త పెట్టుబడిదారీ శక్తులు, విదేశీ సామ్రాజ్యవాద శక్తులమధ్య ఆర్థిక భాగస్వామ్యం బలపడుతుంది. ప్రజా వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక, కమ్యూనిస్టు వ్యతిరేక స్వభావం కలిగిన బూర్జువా–భూస్వామ్య శక్తుల నాయకత్వంలోని రాజ్యం విదేశీ ద్రవ్య పెట్టుబడి ప్రత్యక్ష–పరోక్ష ప్రభావాలకు గురౌతూనే వుంటుంది. అతి శక్తివంతమైన ఈ విదేశీ ద్రవ్య పెట్టుబడితో లాలూచీ వ్యవహారం వల్ల అవి ఎంతటి ఒత్తిడికైనా, బెదిరింపులకైనా గురి అవుతూ దేశ స్వాతంత్ర్యాన్నే పణంగా పెట్టే స్థితికి దిగజారినా మనం ఆశ్యర్యపోనక్కరలేదు. కానీ రివిజనిస్టులు మాత్రం 'వామపక్షాలు చిత్రీకరిస్తున్నట్లు ఇదేమంత ప్రమాదకరమైన వ్యవహారం కాదు' అని తేలిక చేసి చూపడానికి రకరకాల వాదనలు ముందుకు తెస్తున్నారు. 'సామ్రాజద్యవాద, విదేశీ ద్రవ్య పెట్టుబడితో మిలాఖతు వల్ల భారత పెట్టుబడి శరవేగంగా శక్తివంతంగా అభివృద్ధి చెందుతుంది. మన దేశంలో విదేశీ ద్రవ్య పెట్టుబడి పరిమాణాత్మకంగా పెరిగినప్పటికీ పంచవర్ష ప్రణాళికలద్వారా సాధించిన ఆర్థిక–పారిశ్రామికాభివృద్ధి దేశ స్వాతంత్ర్యాన్ని బలోపేతం చేస్తుంది' "జాతీయ,బూర్జువా వర్గం బలహీనమైన పార్టీ అయినప్పటికీ, అయాచితంగా లభించే సోషలిస్టు ఆర్థిక సాయాన్ని అడ్డు పెట్టుకొని బహు నేర్పుగా సామ్రాజ్యవాద పెట్టుబడినవాళ్ళను ఓడించగలదు" అని రివిజనిస్టులు నమ్మబలుకుతున్నారు.

రివిజనిస్టులు మనమీద చేసే ఇంకో ఆరోపణ ఏమిటంటే – రాజ్యం–ప్రభుత్వాల యొక్క వర్గ స్వభావాన్ని అంచనా వేసేటప్పుడు సోషలిస్టు ఆర్థికసాయం స్వీకరించడం ద్వారా రాజ్యం – ప్రభుత్వం మీద అది చూపే ప్రభావాన్ని, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడే అవకాశాలను మార్క్సిస్టులు పూర్తిగా విస్మరించారు అనేది. ఇదంతా పసలేని వాదన. సోషలిస్టు దేశాలు అందించిన (ఆర్థిక–సాంకేతిక) సహకారంతో దేశంలో అతిపెద్ద వస్తూత్పత్తి కర్మాగారాలను నెలకొల్పడం, దేశ పారిశ్రామికీకరణకు సామ్రాజ్యవాద పెట్టుబడి నుండి కొంత రాయితీలు పొందిన మాటా, తద్వారా దేశ స్వాతంత్ర్యాన్ని బలోపేతం చేసేందుకు అవకాశం కలిగిందనే అంచనా మార్క్సిస్టుపార్టీకి వుంది. మా విమర్శ ఏమిటంటే రాజ్యము–ప్రభుత్వము నడుపుతున్న గుత్త బూర్జువా నాయకత్వం సోషలిస్టు ఆర్థిక సాయాన్ని ఉపయోగపెట్టుకొని ప్రణాళికాబద్ధంగా విదేశీ ద్రవ్య పెట్టుబడిని దేశంనుండి కూకటివేళ్ళతో పెకలించేసేదానికి బదులుగా – దివాళాకోరు పెట్టుబడిదారీ పంథాను అభివృద్ధి చేసేందుకూ, ప్రజలను అయినకాడికి దోచుకొని సంపద పోగేసుకునేందుకూ, కార్మిక–ప్రజాస్వామిక ఉద్యమాలను అణగదొక్కి తమ వర్గపాలనను రుద్దేందుకూ, అదే విదేశీ ద్రవ్య పెట్టుబడి ప్రాపకం సంపాదించేందుకూ ఉపయోగపెట్టుకుంటుందనేదే. 'సోషలిస్టు ఆర్థిక సాయం పొందుతున్నాం' అనే సాకుతో రాజ్యాధికారం ఏ వర్గ శక్తుల చేతుల్లో వుంది, సోషలిస్టు సాయాన్ని ఏ రకంగా ఉపయోగ పెట్టుకుంటుంది అన్న అంశాలను వివేచించకుండా గుడ్డిగా సరిపెట్టుకోలేం కదా. ఏదన్నా ప్రాజెక్టు కట్టడానికి ఏదేని సోషలిస్టు దేశంతో ఒక ఒప్పందం చేసు కుంటే ఆ వెనువెంటనే వివిధ సామ్రాజ్యవాద, విదేశీ శక్తులతో షరీకయ్యి కుదుర్చుకుంటున్న ఒప్పందాల సంఖ్యను చూస్తుంటే దేశ ఆర్థికవ్యవస్థనూ, రాజ్యాన్నీ సామ్రాజ్యవాద శక్తుల బెదిరింపులకు బలిచేసే విస్తృత అవకాశాలు కళ్ళకు కట్టినట్లు కనబడుతున్నా, రివిజనిస్టులు ఈ ప్రమాదాన్ని పసిగట్టకుండా కొండంత తప్పు చేస్తూ ఉన్నారు. ఈ పొరబాటు వైఖరి వల్లనే సోషలిస్టు దేశాల నుండి ఆర్థికసాయం తీసుకుంటున్నందుకు బూర్జువా వర్గాన్ని ఆకాశానికి ఎత్తేస్తూ సామ్రాజ్యవాద పెట్టుబడి ప్రవేశానికి దేశంలో గేట్లు ఎత్తేస్తున్నందున వచ్చిపడే ప్రమాదాన్నీ, విపర్యవసానాలనూ విస్మరిస్తున్నారు.

రివిజనిస్టులు తమ ముసాయిదా కార్యక్రమంలో రాజ్యం యొక్క వర్గ స్వభావాన్ని ఎలా అంచనా కట్టారంటే ఇప్పుడున్న రాజ్యాన్ని వివిధ ప్రజాస్వామిక శక్తులు కలిసికట్టుగా విప్లవం ద్వారా పరిమార్చాల్సిన చారిత్రక ఆవశ్యకత లేదని అభిప్రాయపడుతున్నారు. అంటే రాజ్య పునర్నిర్మాణం కోరుకుంటున్నారు. రాజ్యంమీద బడా వ్యాపార వాణిజ్యవర్గాల ప్రభావాన్ని తగ్గించడం బడా భూస్వాములను రాష్ట్రాలస్థాయిలో సర్కారీ పదవులకు పరిమితం చేయడం లేదా, చెయ్యకపోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల్లో మార్పు తీసుకురావడం కోసం కార్మికవర్గ ప్రతినిధులను ప్రభుత్వాల్లో భాగస్వాములుగా చెయ్యడం, తద్వారా ప్రజాస్వామిక ఫ్రంట్‌ను ముందుండి నడిపించడం, జాతీయ బూర్జువా వర్గంతో కలిసి అసంపూర్ణంగా వున్న సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక విప్లవాన్ని పరిపూర్తి చెయ్యడం తమ కర్తవ్యంగా పెట్టుకున్నారు రివిజనిస్టులు. రాజ్యం యొక్క వర్గ స్వభావాన్ని స్పష్టంగా, నిర్దిష్టంగా కార్మికవర్గం ముందు, జన సామాన్యం ముందు ఉంచలేని వైఫల్యమే రివిజనిస్టులను ఈ కాడికి తెచ్చింది. సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక అసంపూర్ణ విప్లవకర్తవ్యాలను పరిపూర్తి చేసేందుకు ఎవరు ఆటంకంగా వున్నారు, ఎవరికి వ్యతిరేకంగా పోరాడాలనే స్పష్టత ఇవ్వకపోగా ఏ రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి విప్లవం సాధించాలో దాని తోక పట్టుకు పోవాలనే సందేశాన్ని కార్మికవర్గానికీ, జన సామాన్యానికీ ఇస్తున్నారు రివిజనిస్టులు. సామ్రాజ్యవాద వ్యతిరేకత, ఫ్యూడల్ వ్యతిరేకత, జాతీయ ప్రజాస్వామిక విప్లవం వంటి అంశాలపై మార్క్సిస్టు–లెనినిస్టు దృక్పథం లోపిస్తే ఇదిగో ఇట్లాగే సంస్కరణవాద ధోరణిలో పడి కొట్టుకుపోతూ, నినాదప్రాయంగా మిగిలిపోతూ తమను తాము మోసగించుకోవడమే కాకుండా ప్రజానీకాన్ని కూడా వంచనకు గురిచేస్తారు. అందుకే వారు రివిజనిస్టులుగా మిగిలిపోతారు.

**(అనువాదం : సత్యరంజన్ కె.)**

# మారిన పరిస్థితుల్లో వర్గపోరాట వ్యూహాలను కమ్యూనిస్టు పార్టీలు అభివృద్ధిచేసుకుంటున్నాయి

## సందేహాలు సమాధానాలు



**- బి.వి.రాఘవులు**

**రాఘవులుగారికి నమస్కారం, కొన్ని సందర్భాల్లో పార్టీ అభిమానుల, సాధారణ కార్యకర్తల అభిప్రాయాలకు భిన్నంగా రాష్ట్ర కేంద్ర కమిటీల అభిప్రాయాలుంటాయి. వైఎస్ఆర్‌సిపితో పొత్తుకు పార్టీ సానుకూలంగా వున్నట్లు వస్తున్న వార్తలకు స్పందనగా ఈ వుత్తరం రాస్తున్నాను. వైసీపితో అవగాహన వుండాలని సిపిఐ(ఎం) నిర్ణయించుకున్నాక సిపిఐ వద్దంటే ఆగుతారా? పార్లమెంటు శాసన సభల్లో ప్రజా పోరాటాలు ప్రతిబింబించడానికి ప్రాతినిధ్యం అవసరమే కావచ్చు. అలాగని వైసీపితో అవగాహనకు వస్తే సిపిఐ(ఎం) నైతికతను ప్రజలు తప్పుపడతారు.**

**పి. పాండురంగారావు,**
చింతలపూడి,
పశ్చిమగోదావరి జిల్లా.

**సిపిఐ, సిపిఎం పార్టీలు జాతీయ పార్టీలు. మరి తోక పార్టీలతో ఎన్నికల పొత్తు పెట్టుకోవడం ఏమిటి? కాంగ్రెస్, వైఎస్ఆర్ పార్టీలను సిపిఐ, సిపిఎంలు విమర్శించి, తిరిగి స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం వైఎస్ఆర్ పార్టీతో పొత్తు పెట్టుకోవడం కార్యకర్తలకు ఇబ్బంది కాదా!**

**కంచుమర్తి కాటం రాజు,**
చిన బ్రహ్మదేవం,
తూర్పు గోదావరి జిల్లా

రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు, శాసనసభ ఎన్నికల్లో మార్క్సిస్టు పార్టీకి రాష్ట్రస్థాయి సర్దుబాట్లు లేవు. వైఎస్ఆర్‌సిపి ఖమ్మం పార్లమెంటు అభ్యర్థి తన అవసరం రీత్యా వ్యక్తిగత చొరవతో స్థానికంగా సర్దుబాట్లు చేసుకున్నారు. మన పార్టీ కేంద్ర కమిటీ నిర్ణయించిన రాజకీయ విధానానికి లోబడే ఈ స్థానిక సర్దుబాటు ఉన్నది. కాంగ్రెస్, బిజెపి పార్టీలను, వాటి మిత్రులను ఓడించడం వామపక్ష, లౌకిక ప్రతిపక్ష శక్తులను గెలిపించుకోవడం లక్ష్యంగా పార్టీ పెట్టుకున్నది. ఈ లక్ష్యానికి అనుగుణంగా వివిధ రాష్ట్రాల్లో కలిసివచ్చే శక్తులతో సర్దుబాట్లు చేసుకొని ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించింది. ఇందుకు కలిసివచ్చే శక్తులతో మనకు అనేక విషయాల్లో తీవ్రమైన విభేదాలున్నా, అభ్యంతారాలున్నా ఎన్నికల వరకు ప్రధాన లక్ష్యాన్ని నెరవేర్చుకునేందుకు కలిసి వ్యవహరించాలని నిర్ణయించుకున్నాం. ఈ విధానంలో భాగంగానే వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్, బిజెపియేతర లౌకిక శక్తులను కలుపుకొచ్చేందుకు ప్రయత్నం చేశాం. కొన్నిచోట్ల సర్దుబాట్లు సాధ్యపడ్డాయి. కొన్ని చోట్ల సాధ్యం కాలేదు.

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ బిజెపితో కూటమి కట్టింది. వైఎస్ఆర్‌సిపి బిజెపితో తగాదా తెచ్చుకోవడానికి సిద్ధంకాక జయలలిత, బిజూపట్నాయక్‌ల లాగానే వామపక్షాలకు దూరంగా ఉండదల్చుకుంది. లోక్‌సత్తా ఇప్పటి వరకు గంభీరమైన మాటలు ఎన్నిచెప్పినా బిజెపితో చెలిమి కట్టడానికి, మోడీ భజన చేయడానికి సిద్ధమైంది. ఆర్భాటంగా జనసేన పార్టీని ప్రకటించి రాజకీయాల్లో ప్రవేశించిన పవన్‌కళ్యాణ్ మోడీయిజాన్ని భుజాన వేసుకున్నాడు. అందువలన ఇటువంటి పార్టీలతో సర్దుబాట్లకు అవకాశం లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్‌పై తిరుగుబాటు చేసి కొత్తగా ఏర్పాటు చేసిన జై సమైక్యాంధ్ర పార్టీ, సిపిఐ వంటి పార్టీలతో పరిమితమైన మేరకైనా సర్దుబాట్లు చేసుకోవడం జరిగింది. బలాబలాల్లో మార్పులకు ఈ సర్దుబాట్లు తోడ్పడకపోయినా ఎన్నికల్లో సాధ్యమైనంత వరకు ఒంటరికాకుండా ఉండేందుకు చేసిన ప్రయత్నం ఇది.

రాజకీయాల్లో జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు వంటి పేర్లతో వివిధ పార్టీలను పిలుస్తున్నా మార్క్సిస్టులుగా పార్టీలను వర్గ దృష్టితో చూస్తాం. ఆ దృష్టితో చూసినపుడు గుత్తపెట్టుబడిదారీ వర్గానికి ప్రతినిధులుగా కాంగ్రెస్, బిజెపిలను పరిగణిస్తాం. తెలుగుదేశం, వైఎస్ఆర్‌సిపి, టిఆర్ఎస్ వంటి పార్టీలను ప్రాంతీయ బూర్జువా వర్గానికి ప్రతినిధులుగా చూస్తాం. కమ్యూనిస్టు పార్టీలను పై పార్టీలకు పూర్తి భిన్నమైన కార్మికవర్గ పార్టీలుగా పరిగణిస్తాం. అందువలన జాతీయ పార్టీలు అని కాంగ్రెస్, బిజెపి, కమ్యూనిస్టు పార్టీలను ఒకేగాటన, తోక పార్టీలని మిగతా ప్రాంతీయ పార్టీలన్నింటిని ఒకగాటన కడితే వర్గ దృష్టితో పరిశీలించినట్లుకాదు. ఇది తీవ్రమైన లోపాలకు దారి తీస్తుంది.

**'మార్క్సిస్టు' ఫిబ్రవరి నెల సంచికలో కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్యగారి వ్యాసం 12వ పేజీలో 1957 నవంబర్‌లో మొట్టమొదటి ప్రపంచ కమ్యూనిస్టు పార్టీ సమావేశం జరిగిందని పేర్కొన్నారు. దీనికి 60 కమ్యూనిస్టు, కార్మిక పార్టీలు హాజరయ్యాయి, కానీ వాటి మధ్య విభేదాలు పరిష్కారం కాలేదు. తిరిగి 1960 జూన్‌లో రుమేరియా పార్టీ మూడవ మహాసభ సందర్భంగా ప్రపంచ పార్టీలు రెండవ సారి సమావేశమైనాయి. విభేదాలు అలాగే వుండిపోయాయి. మూడవసారి 1960 నవంబర్-డిసెంబర్ మాసాల్లో సమావేశం జరిగింది. దీనికి 81కి పైగా పార్టీలు హాజరైనాయి అని చెప్పారు. ప్రపంచ స్థాయి సమావేశాలు ఇన్ని సార్లు వాయిదా పడితే ఈ సమావేశాల్లో సమస్యలు ఎలా పరిష్కారం చేస్తారు? ఈ సమావేశాలు ప్రపంచ కమ్యూనిస్టు వుద్యమంలో ఐక్యతను పునరుద్ధరించాయా? లేక తద్విరుద్ధంగా విభేదాలు పెంచి నిలువునా చీలడానికి దారితీశాయా? అంటే విడదీశాయి. రాఘవులుగారూ ఇంత జరగడానికి లోపం ఎక్కడుంది? పరిస్థితుల్లోనా, నాయకత్వంలోనా?**

**వరికోటి లక్ష్మి,**
ఆశా వర్కర్, లమ్మసింగి,
చింతపల్లి మండలం,
విశాఖ జిల్లా, 531116

కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో అంతర్జాతీయ సమావేశాలు మొదటి నుండి జరుగుతూనే ఉన్నాయి. ప్రపంచంలోని కమ్యూనిస్టు, సోషలిస్టు, సిండికలిస్టు బృందాలన్నీ (రకరకాల పేర్లతో ఉన్నప్పటికీ) మొదటి ఇంటర్నేషనల్‌గా 1864 సంవత్సరంలో ఏర్పడ్డాయి. ఈ సంస్థ 1876 సంవత్సరంలో రద్దయింది. మళ్లీ 1889 సంవత్సరంలో ఆనాటికి వివిధ దేశాల్లో వున్న కమ్యూనిస్టు పార్టీల (అప్పటికి పార్టీలను సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీలుగా పిలిచేవారు) తో రెండవ ఇంటర్నేషనల్ ఏర్పడింది. మొదటి ప్రపంచయుద్ధం సందర్భంలో రెండవ ఇంటర్నేషనల్ నిర్వహించిన నష్టదాయక పాత్ర వలన అది1916లో విచ్ఛిన్నం అయిపోయింది. 1919 సంవత్సరంలో మూడవ ఇంటర్నేషనల్ ప్రపంచ కమ్యూనిస్టు పార్టీల వేదికగా ఏర్పడింది. రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభంలో మారిన పరిస్థితుల్లో 1943 సంవత్సరంలో ఇది కూడా రద్దయింది. ఈ మూడు ఇంటర్నేషనల్ సంస్థలు ఉనికిలో ఉన్న కాలంలో అనేక సమావేశాలు నిర్వహించాయి. తీర్మానాలు చేశాయి. అంతర్గతంగా అనేక విషయాలపై వాదోపవాదాలు నిర్వహించాయి.

మూడవ ఇంటర్నేషనల్ స్థానంలో ఇప్పటి వరకు మరో అంతర్జాతీయ కమ్యూనిస్టు సంస్థ ఏర్పడకపోయినప్పటికీ పార్టీల మధ్య సమన్వయం కోసం, ఉమ్మడి అవగాహన అభివృద్ధి కోసం అప్పుడప్పుడు అంతర్జాతీయ సమావేశాలు జరుగుతూనే ఉన్నాయి. వీటిల్లో 1957, 1960 సంవత్సరాల్లో జరిగిన కమ్యూనిస్టు పార్టీల అంతర్జాతీయ సమావేశాలు ముఖ్యమైనవి. రెండవ ప్రపంచయుద్ధం తరువాత ఆవిర్భవించిన అంతర్జాతీయ పరిస్థితిపై కమ్యూనిస్టు పార్టీల మధ్య తీవ్రమైన విభేదాలు తలెత్తిన సందర్భంలో ఇవి జరిగాయి. ఈ సమావేశాలు కమ్యూనిస్టు పార్టీల మధ్య ఉమ్మడి అవగాహనను తెచ్చే ప్రయత్నం చేశాయి. అయినా కొన్ని అంశాల్లో విభేదాలు తీవ్రమైన స్థాయిలో ఉండడంతో తరువాతి కాలంలో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం తీవ్రమైన అనైక్యతకు గురైంది. కమ్యూనిస్టు పార్టీలలో చీలికలు వచ్చాయి. కమ్యూనిస్టు పార్టీల అంతర్జాతీయ ఉమ్మడి సమావేశాలు కూడా లేకుండా పోయాయి. 1990లో సోవియెట్ పతనం తరువాత పరిస్థితి మరింత దిగజారింది.

సోషలిజానికి ఎదురుదెబ్బ తగిలి నిరాశా వాతావరణం నెలకొన్న పరిస్థితుల్లో మళ్లీ కమ్యూనిస్టు పార్టీల మధ్య పరస్పర సహకారం పెంపొందించేందుకు కృషి మార్క్సిస్టు పార్టీ చొరవతో 1993వ సంవత్సరంలో కలకత్తాలో అంతర్జాతీయ సమావేశం జరిగింది. అప్పటి నుండి క్రమం తప్పకుండా ఇటువంటి సమావేశాలు జరుగుతున్నాయి. అయినా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో అన్ని విషయాల్లో ఏకాభిప్రాయం కుదిరిందని చెప్పలేం. అటువంటి పరిస్థితి రావడానికి ఇంకొంత సమయం పట్టవచ్చు.

అంతర్జాతీయమైనా, జాతీయమైనా కమ్యూనిస్టు ఉద్యమంలో భిన్నాభిప్రాయాలు, భేదాభిప్రాయాలు ఉండడాన్ని అసహజమైనదిగా భావించడం ఆదర్శవాదం అనిపించుకుంటుంది. వర్గ సమాజంలో వైరుధ్యాలున్నందున వర్గ పోరాటాన్ని నిర్వహించే కమ్యూనిస్టు పార్టీల్లో సైతం వివిధ రూపాల్లో అన్యవర్గ ప్రభావాలు ప్రవేశిస్తుంటాయి. అవి సైద్ధాంతిక వివాదాల రూపంలో, కొన్ని సందర్భాల్లో చీలికల రూపంలో వ్యక్తం అవుతుంటాయి. వాటిని వర్గ పోరాట సంఘర్షణలో భాగంగానే చూడాలితప్ప వాటిని చూసి బెంబేలు పడడం శాస్త్రీయం అనిపించుకోదు.

**కామ్రేడ్ రాఘవులు గారు, మన దేశంలో అధిక శాతం ప్రజలు బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు, కార్మికులు, శ్రమ జీవులు, పేదవిద్యార్థులు. వీరిలో ఎవరికి కష్టం వచ్చినా సిపిఎం పార్టీ ఆదుకుంటోంది. వారికి ప్రస్తుతం జరుగుతున్న సరళీకరణ విధానాల గురించీ, అనేక రాజకీయ కుతంత్రాలు, అక్రమాల గురించి తెలియజేస్తున్నారు. ఏ దేశంలోనైనా కార్మికులు, విద్యార్థులు మార్పును తీసుకు రాగలరని అంటారు. అలాంటప్పుడు నిరంతరం ప్రజల కోసం, సమాజ శ్రేయస్సు కోసం ఆలోచిస్తూ, పోరాడే సిపిఎం ఎందుకు అధికారంలోకి రావడం లేదు? ప్రజల్లో సోషలిస్టు భావాలు ఎందుకు కలగడం లేదు?**

**దేశంలో, రాష్ట్రంలో పాలక రాజకీయ వేత్తలు, ప్రతిపక్ష రాజకీయ వేత్తలు అవినీతికి పాల్పడుతున్నారని మేధావులు, విద్యార్థులు చెబుతున్నారు. దాని గురించి చర్చిస్తున్నారు. కానీ ఎన్నికలు వచ్చేసరికి ఎవరైతే ప్రజలను నిలువుగా దోపిడీ చేస్తున్నారో వారికే ఓటువేయడానికి పూనుకుంటున్నారు. ఎందుకని? ప్రజల్లో మార్పు రాకా లేక ప్రత్యామ్నాయంగా మంచి వ్యక్తులు ఎన్నికల్లో పోటీ చేయడం లేదనా? మన పార్టీ అభ్యర్థులు దేశంలోని అన్ని చోట్లా పోటీ చేస్తే ఎన్నికల్లో మన వారికే ప్రజల ఓట్లు వస్తాయని నా ఉద్దేశం. ఏమంటారు?**

**వి. దుర్గా ప్రసాద్,**
(ఎంఎస్‌సి, బయోకెమిస్ట్రీ)
ఆది ఆంధ్ర వీధి,
టెక్కలి, శ్రీకాకుళం జిల్లా.

ప్రస్తుతం ప్రపంచంలో, దేశంలో కూడా మార్క్సిస్టు, సోషలిస్టు భావాలకు గతంలో ఉన్నంత ఆదరణ లేకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలనే ప్రశ్న మనలనందరినీ వేధిస్తున్నది. మార్క్సిస్టు పార్టీ, ఇతర కమ్యూనిస్టు పార్టీలు నిర్వహిస్తున్న ఉద్యమాలు, పోరాటాల సందర్భంగా రావాల్సినంత వర్గ చైతన్యం అభివృద్ధి కాకపోవడానికీ, కమ్యూనిస్టు ఉద్యమాలు బల పడకపోవడానికీ, ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించలేకపోవడానికీ వస్తుగతమైన కారణాలు అనేకం ఉన్నాయి. అలాగే కమ్యూనిస్టు ఉద్యమం యొక్క లోపాలు కూడా ఉన్నాయి. ప్రపంచవ్యాపితంగా వ్యాపించిన సరళీకరణ విధానాల ప్రభావాలు, వాటి పర్యవసానాలు, వాటిని ఎదుర్కోవడంలో పీడిత వర్గాల వైఫల్యాలు ఒక కారణమైతే, మార్పులకు అనుగుణంగా వర్గపోరాట వ్యూహాలను, పనిపద్ధతులను రూపొందించుకోవడంలో కమ్యూనిస్టు పార్టీల, ఉద్యమాల వెనుకబాటుతనం మరొక కారణం. అయితే ఈ పరిస్థితి ఇలాగే ఎంతో కాలం కొనసాగదు. సరళీకరణ విధానాల ప్రమాదకర పర్యవసానాల వల్ల వస్తుగత పరిస్థితుల్లో ఉద్యమాలకు సానుకూలత ఏర్పడుతున్నది. అలాగే రెండుమూడు దశాబ్దాల ఉద్యమాల అనుభవాల నుండి కమ్యూనిస్టు పార్టీలు నేర్చుకొని, మారిన పరిస్థితుల్లో వర్గపోరాటాన్ని ముందుకు తీసుకెళ్లగల వ్యూహాలనూ, పనిపద్ధతులనూ అభివృద్ధిచేసుకుంటున్నాయి.

మనదేశంలో పార్లమెంటరీ రంగం కూడా పూర్తిగా కార్పోరేటీకరణ అయ్యింది. పెట్టుబడిదారీ శక్తుల పట్టు పెరిగి పార్లమెంటరీ రంగంలో పని చేయడం, ఆ రంగాన్ని వినియోగించుకోవడం కమ్యూనిస్టులకు గతం కన్నా కష్టతరం అయ్యింది. ఇటువంటి స్థితిలో కమ్యూనిస్టు పార్టీలు గతంలో సాధించిన విజయాలను కూడా పొందడం అసాధ్యమవుతున్నది. అయితే మారిన పరిస్థితుల్లో కూడా పార్లమెంటరీ రంగంలో కమ్యూనిస్టులు ఎలా పోరాడాలనేది ఆలోచించుకుని సరయిన వ్యూహాలు రూపొందించుకోవాల్సి ఉంది. మంచి వ్యక్తులు ఎన్నికల్లో పోటీ చేయడం, అన్ని స్థానాలకు పోటీ చేయడం ద్వారానే కమ్యూనిస్టులను ప్రజలు ఆదరిస్తారని అనుకోవడం పరిమితమైన దృష్టి అవుతుంది. పెట్టుబడిదారీ వర్గం పార్లమెంటరీ వ్యవస్థను తమ గుప్పెట్లో పెట్టుకొన్న స్థితిని ప్రజలు అర్థం చేసుకునేట్టుగా కమ్యూనిస్టులు కృషి చేయడం అన్నిటికన్నా ముఖ్యమైంది. ఇందులో జరుగుతున్న లోపాలను సరిదిద్దుకోవడమే పరిష్కారం.

## 'మార్క్సిస్టు'కు
## మీ సందేహాలు రాయండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**
'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

# గాబ్రియెల్ మార్క్వెజ్

(2వ పేజీతరువాయి)

నిబద్ధ కమ్యూనిస్టుగానే నిలిచిపోయాడు.

స్టోరీ ఆఫ్ ఎ షిప్ రెక్‌డ్ సోల్జర్ (మునిగిపోయిన నౌకా దళ సభ్యుడి కథ)లో మార్క్వెజ్ అధికార అవినీతి వినాశానికి ఎలా దారితీసిందో చిత్రించాడు. ఇందుకు గాను ఆయన ప్రభుత్వ నిర్బంధానికి గురి కావలసి వచ్చింది. కొలంబియాలో నియంతృత్వం అధికారాన్ని హస్తగతం చేసుకున్నప్పుడు ఆయన యూరప్‌కు తరలిపోవలసి వచ్చింది. సోషలిస్టు తూర్పు యూరప్‌లో సంచరించిన అనంతరం ఆయన 1955లో సినిమా కళను అధ్యయనం చేయడం కోసం రోమ్ వెళ్లాడు. దాన్ని ఆయన జీవిత పర్యంతం ప్రేమిస్తూనే వచ్చారు. ఆ తర్వాత పారిస్ వెళ్లాడు. ఆ రోజుల్లో లాటిన్ అమెరికా దేశాల్లోని వివిధ నిరంకుశ ప్రభుత్వాలు వెళ్లగొట్టి పంపిన మేధావులు, కళాకారులు పలువురితో అక్కడ గడిపారు.

1958లో మార్క్వెజ్ కొలంబియా తిరిగి వచ్చారు. చిన్నతనంనాటి ఇరుగుపొరుగు నేస్తం మెర్సిడస్ బార్చాను పెళ్లి చేసుకున్నాడు. వారికి ఇద్దరు కుమారులు. వారిలో రోడిగ్రో సినిమా దర్శకుడు కాగా గొంజాలో గ్రాఫిక్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు.

1981లో ఆయన మరోసారి కొలంబియా ప్రభుత్వ నిర్బంధానికి గురైనాడు. ఎం-19 గెరిల్లాలతో సంబంధం పెట్టుకున్నాడనీ, వెనిజులా తిరుగుబాటుదార్లకు నిధులు పంపించాడనీ ఆరోపించి, వేధించారు. ఆ సమయంలో మెక్సికో సిటీకి చేరిన మార్క్వెజ్ శేష జీవితమంతా అక్కడే గడిపాడు.

**రచన, జర్నలిజం, సినిమా**

గార్షియా మార్క్వెజ్‌ను జీవితమంతా మూడు సాంస్కృతిక రంగాలు వెంటాడుతూ వచ్చాయి. ఉత్కంఠ భరితమైన తన నిబద్ధ జీవితంలో ఆయన వీటిని ఏనాడూ విడిచి పెట్టలేదు. మొదటిది- కథలూ, నవలల వంటి కాల్పనిక రచనలు. ఇవే ఆయనను భావి తరాలకు పరిచయం చేశాయి. సినిమా రంగంలో స్క్రిప్టులు రాయడం, కథానుసరణలు, నిర్మాణం. అలాగే జర్నలిజంలోనూ వేర్వేరు విభాగాలూ, శైలులతో పనిచేశాడు. చరిత్ర రచన, పరిశోధనాత్మక జర్నలిజం, రాజకీయ వ్యాఖ్యానం, సినిమా విమర్శ ఇందులో వుంటాయి. ఇదేగాక సంగీతం, ప్లాస్టిక్ కళలపై ప్రత్యేకాసక్తి వుండేది. మరో విధంగా చెప్పాలంటే చాలా మంది రచయితల్లా మార్క్వెజ్ ఏకాంత జీవితం కోరుకోలేదు. క్రియాశీలంగా వున్నాడు.

1994లో కార్టెగానాలో యునెస్కో సహాయంతో న్యూ నిబరో జర్నలిజం (ఎఫ్ఎన్‌పిఐ) పేరిట ఒక స్వంత సంస్థ నెలకొల్పాడు. లాటిన్ అమెరికా వ్యాపితంగా కథాత్మక పరిశోధనా జర్నలిజం ప్రమాణాలు పెంచేందుకు ఈ సంస్థ కృషి చేస్తుంది. సాహిత్య నవలేతర రచనా శైలిని ఆయన చాలా తొలిదశలోనే అనుసరించారు. ఇదే ఉత్తరోత్తరా న్యూ జర్నలిజంగా పేరొందింది.

క్యూబా విప్లవ విజయం తర్వాత ఆయన ప్రెన్సా లాటినాలో పనిచేశారని ఇంతకు ముందే చెప్పుకున్నాం. అంతకు ముందు పలు పత్రికలకు సంపాదకుడుగా పనిచేశాడు గాని ఆయన సమరశీల జర్నలిజం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. 1973లో ఆటం ఆఫ్ ద పేట్రియార్క్ అనే నవలను ఆయన దాదాపుగా పూర్తి చేయబోతున్న సమయంలో చిలీలో సాల్వడార్ అలెండీ ప్రభుత్వాన్ని కూలదోశారు. మార్క్వెజ్ తాత్కాలికంగా సాహిత్య రచనను పక్కన పెట్టాలని నిర్ణయానికి వచ్చాడు. కొలంబియా యువ మేధావులు, జర్నలిస్టులతో కలసి అల్టర్నేటివ్ అనే పత్రిక స్థాపించాడు. 1974 నుంచి 1980 వరకూ నడిచిన కల్లోల కాలంలో దాన్ని ప్రచురించారు. ఇందుకోసం వారంతా తమ స్వంత డబ్బు ఖర్చు చేసి దాన్ని నడిపించారు.

1975లో మార్క్వెజ్ మరోసారి క్యూబా వెళ్లాడు. దేశమంతా విస్తృతంగా పర్యటించి మూడు కథనాలు ప్రచురించాడు. "క్యూబన్లు తమ ఇళ్లలో దిగ్బంధనాలు ఎలా అధిగమించ గలిగారో చెప్పాలన్నది నా ఉద్దేశం. అంతేగాని ప్రభుత్వమో, రాజ్యమో చేసిన దాన్ని గురించి చెప్పాలనుకోలేదు. దిగ్బంధనం పర్యవసానంగా వచ్చిన పరిస్థితులను ఎదుర్కొంటూ ప్రజలు తమ వంటింటి సమస్యలు బట్టలు ఉతుక్కోవడం, కుట్టుకోవడం వంటి వాటిని ఏ విధంగా పరిష్కరించుకున్నారు చూడాలనుకున్నాను" అని ఆయన ఆ తర్వాత చెప్పారు. ఆఫ్రికాలో క్యూబా సైనిక సహాయ కార్యక్రమం గురించి 1976లో మహత్తర చరిత్ర రచన చేశాడు. రెండు అగ్ర రాజ్యాల మధ్య ఘర్షణలో మొదటిసారిగా ఒక 'తృతీయ ప్రపంచ' దేశం ఎలా తలదూర్చిందో వివరించాడు. ఈ లోగా మధ్య అమెరికాలో విప్లవ కర పరిణామాల కల్లోలం కొనసాగుతూ వచ్చింది. అలాగే శాండినిస్టా విప్లవ చరిత్రను కూడా ఆల్టర్నేటివా పత్రికకోసం ఆయన నివేదించేవాడు.

1980లో ఆ పత్రిక మూతపడింది. మార్క్వెజ్ మళ్లీ నవలా రచనలో పడ్డాడు. ఈ సారి క్రానికల్ ఆఫ్ ఎ డెత్ ఫోర్‌టోల్డ్ రచన చేపట్టాడు. అప్పటికే డెబ్బయ్యవ పడిలో ప్రవేశించిన ఆయన తనకు నోబెల్ బహుమతి కింద వచ్చిన సొమ్ముతో కొలంబియన్ మ్యాగజైన్ కాంబియోలో మెజారిటీ వాటాలు తీసుకొన్నాడు. 1999 జూన్‌లో కాన్సర్ బారిన పడేవరకూ ఆయన ఆ పత్రికకు పుంఖానుపుంఖంగా ప్రతిభావంతమైన కథనాలు అందిస్తూనే వచ్చాడు. 1998లో హ్యూగో చావేజ్‌పైనా దానిలోనే మంచి రచన చేశాడు. కొకైన్ ఉత్పత్తి దారులు పాబ్లో ఎస్కోబార్ నాయకత్వంలో సృష్టిస్తున్న అరాచకం ఎలా వుంటుందో, సమాజాన్ని నైతిక జీవనాన్ని ఎలా చిన్నాభిన్నం చేస్తున్నదో కూడా ఆయన కళ్లకుకట్టినట్టు వివరించారు. కులీన వర్గాలకు చెందిన వారిని అపహరించడం ఎలా జరుగుతుందో న్యూస్ ఆఫ్ ఎ కిడ్నాపింగ్ నవలలో చిత్రించారు.

సినిమా రంగంపై మార్క్వెజ్ ప్రేమ కూడా తక్కువది కాదు. 1986లో ఇందుకు సంబంధించి ఆయన క్యూబాలోని శాన్ ఆంటోనియో డీలాస్ బెఫియోలో ఫౌండేషన్ ఫర్ న్యూ లాటిన్ అమెరికన్ సినిమా అండ్ ద ఇంటర్నేషనల్ స్కూల్ ఫర్ ద సినిమా అండ్ టెలివిజన్(ఇఐసిటివి) స్థాపించాడు. అక్కడే ఒక కథ ఎలా చెప్పడం అనే అంశంపై ఆయన నిర్వహించిన వర్క్‌షాప్‌లు బాగా ప్రసిద్ధిగాంచాయి. అక్కడ ఆయన ఒక సినిమా స్క్రిప్టును వివిధ రకాలుగా ఎలా రూపొందించవచ్చునో చెబుతుండేవాడు. తనకు మొదట్లో నిజానికి సినిమా దర్శకుడు కావాలని వుండేదని ఆయన చాలా సార్లు చెప్పాడు. తాను నిజంగా అధ్యయనం చేసిందంటూ ఏదన్నా వుంటే అది సినిమా మాత్రమేనని కూడాచాలా సార్లు చెప్పాడు. 1955లో రోమ్‌లోని సినిమాటోగ్రఫీ ప్రయోగాత్మక కేంద్రంలో చేరి చదువుకున్నాడు. ఒక కాలమిస్టుగానూ స్క్రిప్టు రచయితగానూ కూడా ఆయన సినిమా గురించి రాశాడు.

దీన్నే క్లుప్తంగా చెప్పాలంటే రచయితలను రెండు రకాలుగా చూడొచ్చు. తమ ఆత్మావలోకనానికి వాస్తవ చట్రానికి మధ్య సంబంధాన్ని విశ్లేషించేవారు. మరోవైపున ఈ వలయాన్ని ఛేదించి ఒక దిశానిర్దేశం, ఒక మార్గ దర్శనం చేసేవారు. కథ చెప్పడానికి జీవించేవారంటే వీరే. క్రియాశీల కార్యకర్త అయిన మార్క్వెజ్ మన కాలపు మహా కథకుడుగా, కథ చెప్పడానికే బతికిన మనిషిగా ఎప్పటికీ గుర్తుండి పోతాడు.

RNI Reg. No. APTEL/2006/17554 Postal Regd. No L1/SD/407/13-15

# కార్మికవర్గ బలం యూనియన్లలో దాగిఉంది

**- వి.ఐ. లెనిన్**



కార్మిక సోదరులారా!

మనం మన జీవితాలను ఒక్కసారి పరిశీలిద్దాం. మనం రోజులు ఎలా గడుపుతున్నామో తెలుసుకుందాం. లోతుగా చూస్తే మనకు కనిపించేదేమిటి? మనం కష్టపడి పనిచేస్తాం. తరగని సంపద సృష్టిస్తాం. బంగారం తీస్తాం. చినీచీనాంబరాలు తయారు చేస్తాం. భూ గర్భం లోనుండి ఇనుము, బొగ్గు బయటకు తెస్తాం. మనం యంత్రాలు తయారు చేస్తాం. నౌకలు, రైల్వేలు నిర్మిస్తాం. మహా సౌధాలు కడతాం. ఈ ప్రపంచంలోని సంపద అంతా మన చేతులతో తయారు చేసిందే. మన చెమట, రక్తంతో తయారైందే. ఇంత కష్టపడినందుకు మనకు దక్కే ప్రతిఫలం ఏమిటి? న్యాయంగా అయితే ఇంత చేసినందుకు మనం మంచి ఇళ్లలో నివసిస్తుండాలి, మంచి బట్టలు ధరిస్తుండాలి, మనం ఎటువంటి పరిస్థితుల్లోనూ పొట్టకూటికోసం దేబిరించాల్సిన అవసరం ఉండకూడదు.

కాని మనకు వస్తున్న వేతనాలు మన జీవితం గడవడానికి ఏమాత్రం సరిపోవడం లేదని మనకు తెలుసు. మన యజమానులు మన వేతనాల రేట్లను తగ్గించేస్తున్నారు. బలవంతంగా ఓవర్‌టైమ్ పనిచేయించుకుంటున్నారు. మనలను అనేక విధాలా వేధిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే వాళ్లు మనల్ని అన్ని విధాలుగా అణచేస్తున్నారు. దీనిపై మనం కాస్తా అసంతృప్తి వ్యక్తం చేస్తే చాలు పనిలోనుండి తొలగించేస్తారు. మనం రక్షణకోసం ఎవరి దగ్గరకు వెళతామో వాళ్లు మన యజమానుల స్నేహితులు, తొత్తులు అని మనం పదేపదే గ్రహిస్తున్నాం. మనం కార్మికులం, ఎల్లప్పుడు అజ్ఞానంలో ఉంచబడుతున్నాం. మనకు విద్యను దూరం చేశారు. ఎందుకంటే విద్య దూరమైతే మనం మన జీవితాలను ఉద్ధరించుకునేందుకు పోరాటాలు ఎలా చేయాలో నేర్చుకోలేకుండా పోతాం. వాళ్లు మనల్ని బందీలను చేశారు. కొద్దిగా నిరసన తెలిపితే చాలు అరెస్టులు చేస్తారు, ప్రవాసం పంపుతారు. అజ్ఞానం, నిర్బంధం... ఈ రెంటి ద్వారా పెట్టుబడిదారులూ, ప్రభుత్వమూ మనల్ని ఎల్లప్పుడూ సేవకులుగా, బానిసలుగా మార్చుకుంటాయి.

మన జీవన స్థితి మెరుగుపరుచుకోడానికీ, మన వేతనాలు పెంచుకోడానికీ, మన పని గంటలు తగ్గించుకోడానికీ, దాడులనుండి మనల్ని మనం రక్షించుకోడానికీ, మంచి, ఉపయోగకరమైన పుస్తకాలు చదువుకోడానికీ మనకున్న సాధనాలు ఏమిటి? ప్రతి ఒక్కరూ మనకు వ్యతిరేకమే. యజమానులు, వారి తైనాతీలు, పెట్టుబడిదారుల మోచేతి నీళ్లు తాగేవాళ్లు వీళ్లంతా వ్యతిరేకమే. వీరంతా మనల్ని అజ్ఞానంలోనూ, నిర్బంధంలోనూ ఉంచడానికి ప్రయత్నిస్తారు. అందువల్ల మనం వీళ్లెవరి వంకా సహాయం కోసం చూడకూడదు. మనం మనమీద మాత్రమే ఆధారపడాలి. మన బలం యూనియన్‌లలో దాగిఉంది. మన పీడకులకు మనం ఇచ్చే సమైక్య, సుదృఢ, శక్తివంతమైన ప్రతిఘటనలోనే మన విముక్తి దాగి ఉంది. మన బలం ఎక్కడ ఉందో వాళ్లకు చాలా కాలం క్రితం నుండీ తెలుసు. అందుకే వాళ్లు మనల్ని అనైక్యంగా ఉంచడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తున్నారు. మన కార్మికులకు ఉమ్మడి ప్రయోజనాలుంటాయన్న విషయం మనకు అర్థం కాకుండా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. వాళ్లు జీతాలకు కోతపెడతారు. అయితే అందరికీ ఒకే సారి కాదు. మన మీద వాళ్లు ఫోర్‌మెన్‌లను పెడతారు. పీస్ వర్క్‌ను ప్రవేశపెడతారు. మన వేతనాలను కొద్దికొద్దిగా తగ్గిస్తారు. కానీ ఇదంతా వెనక్కు రాలేని సుదీర్ఘమార్గం. మన సహనానికి కూడా ఒక హద్దు ఉంటుంది. గత ఏడాది కాలంలో రష్యన్ కార్మికులు తమను ఎంతగా అణచి పెడితే అంతగా పైకి లేస్తామని వాళ్ల యజమానులకు తెలియజెప్పారు. కార్మికులను విపరీతంగా దోచుకుతినాలనే పెట్టుబడిదారుల దురాశకు తలగ్గొబోమని చాటిచెప్పారు.

రష్యాలోని అనేక పట్టణాల్లో సమ్మెలు జరిగాయి......ఫ్రాన్స్, గ్రేట్ బ్రిటన్, జర్మనీ, ఇతర దేశాల్లో కార్మికుల యూనియన్లుగా ఏర్పడి అనేక హక్కులు సాధించుకున్నారు.

కామ్రేడ్స్! మనం గనుక శక్తివంతంగా, హృదయపూర్వకంగా ఐక్యతకోసం కృషి చేస్తే జాతి మతాలతో నిమిత్తం లేకుండా ప్రపంచ కార్మికులందరితో కలిసి ప్రపంచంలోని అన్ని దేశాల పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం నడపగలం. మన చేతులకు కట్టిన సంకెళ్ళను మనం తెంచిపారేయగలం. రష్యన్ కార్మికులు శిరమెత్తడం ఖాయం. పెట్టుబడిదారులూ, వారికి ఊడిగం చేసే ప్రభుత్వం భయంతో వణికిపోవడం ఖాయం.

**(1896 ఏప్రిల్‌లో లెనిన్ రాసిన మేడే కరపత్రం నుండి ఈ వాక్యాలు గ్రహించబడ్డాయి.)**

Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P . State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.9, No.1, May 2014